# జనబలం

ప్రజలే ప్రభువులు


నవంబర్ 2025 | లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాస పత్రిక | రూ.10/-






## 6 అంశాల ఎజెండాతో ఏపీ లోక్‌సత్తా ప్రజా ఉద్యమాలు

## సహకార సారథికి నివాళి



## అస్థిర దక్షిణాసియాలో సుస్థిర భారతదేశం

## వైకోమ్ సత్యాగ్రహ స్ఫూర్తికి వందేళ్లు

## సహకారం నుండి సమృద్ధి



# ఇది సనాతనవాదులు, అంబేద్కర్ వాదుల మధ్య పోరాటమా?



సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ పై దాడిని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ నిర్వంద్వంగా ఖండించారు. చట్టసభల్ని, ప్రభుత్వాల్ని, న్యాయ వ్యవస్థను తానూ విమర్శిస్తానని.. కానీ వారికున్న చట్టబద్ధతను, రాజ్యాంగబద్ధతను ప్రశ్నించటం, కించపరచటం పొరపాటున కూడా చేయనని గుర్తుచేశారు. వ్యవస్థల్లో తప్పు జరుగుతుంటే విమర్శించటంతోపాటు నిర్దిష్ట పరిష్కారం చూపాల్సిన హక్కు, బాధ్యత పౌరులకు ఉంటాయన్నారు. ముఖ్యమంత్రిని నేను గుర్తించను, చెప్పుతో కొడతాను అనేవారి సంస్కారం సంగతి అలా ఉంచితే.. వారికి రాజ్యాంగం పట్ల గౌరవం లేదని స్పష్టమవుతుందన్నారు. ఎన్నికైన ప్రభుత్వాల్లో ఉన్నవారంతా గొప్పవారు కాదని, కానీ ప్రజలు ఎన్నుకున్నందున.. వారిని గౌరవిస్తూనే, వారి ప్రాతినిధ్యాన్ని గుర్తిస్తూనే, హేతుబద్ధంగా ప్రశ్నిస్తూ జవాబుదారీతనం పెంచటమే తన పోరాటమంతా అని తెలిపారు. ఎన్నికల సంఘంలో లోపాలులేవని ఎవరూ అనరని, కానీ దానికి పరిష్కారం ఈసీ విశ్వసనీయతను దెబ్బతీయటం కాదన్నారు. లోపాల్ని పరిష్కరించే పద్ధతుల అమలుకు కృషి చేయటమన్నారు. కొందరు మూర్ఖులు సీజేఐపై బూటు విసరటం వంటివి సోషల్ మీడియా ప్రచారం కోసమో, మరోదాని కోసమో చేస్తుంటారని.. వారిని కొద్దిపాటి శిక్షతో వదిలేసి అలాంటి చర్చలకు అతిగా అవకాశం ఇవ్వకూడదన్నారు. రాజ్యాంగ మూలస్వరూపాన్ని మార్చకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా పేర్కొందని, రాజ్యాంగంలో అన్ని మతాలూ సమానమేనని జేపీ గుర్తు చేశారు.

అయితే దేశ విభజన నేపథ్యంలో మైనారిటీలు అభద్రతకు గురికాకుండా సంస్కృతిపరంగా కొన్ని ప్రత్యేక రక్షణలు ఏర్పాటు చేశారని.. మనం రాజ్యాంగాన్ని తప్పుగా అన్వయించి సంస్కృతిని దాటి విద్యాసంస్థలు వంటి వాటికి కూడా వాటిని అమలు చేస్తున్నామన్నారు. ఆ విషయంలో మన పొరపాటును రాజ్యాంగస్ఫూర్తికి అనుగుణంగా సరిదిద్దుకోవాలన్నారు.

హైందవం చెప్పే 'ఏకమ్ సత్ –విప్రా బహుధా వదన్తి' అనే మాటను ప్రపంచంలో ఏ సంప్రదాయమూ చెప్పదని జేపీ పేర్కొన్నారు. సత్యం ఒకటే, విజ్ఞులైనవారు వివిధ రకాల భాష్యాలు చెబుతారు అన్న మార్గాన్ని అనుసరించటం వల్లే హిందూ మతంపై తిరుగుబాటు చేసిన బుద్ధుడు, మహావీరుడు వంటి వారు కూడా ఈ మత సంస్కృతిలో గౌరవాన్ని పొందుతున్నారన్నారు. తనకు దేవుడున్నాడో లేడో తెలియదని, బుద్ధుడి తరహాలో సంశయవాదినని, అయితే నిజమైన ఆధ్యాత్మికతను ఏ మతంలోనైనా గౌరవిస్తానన్నారు. ఈ ప్రపంచంలో ఇప్పటికీ చాలామందికి ఆధ్యాత్మికత అవసరం ఉందన్నారు. సీజేఐ జస్టిస్ గవాయ్ పై దాడిని సనాతనవాదులు, అంబేద్కర్ వాదుల మధ్య పోరాటంగా చిత్రీకరించే ప్రయత్నం సమాజాన్ని విభజించటం తప్ప ఇంకోటి కాదన్నారు. కనీసం మతాలకతీత జీవన విధానమైన హైందవ సంస్కృతిని ఏకం చేయాలనుకుంటున్నవారు ఇలాంటి విభజనల వల్ల వచ్చే నష్టాన్ని గుర్తించాలన్నారు. దాడులు, విభజనలే పరిష్కారమనుకుంటే వారికి రాజ్యాంగం పట్ల గౌరవం లేనట్లన్నారు. సాయుధ నక్సల్స్‌కి, వారికి తేడాలేనట్లేనన్నారు. ఐ.ఎస్.ఐ తీవ్రవాదుల్ని, పుల్వామా ఉగ్రవాదుల్ని అడిగినా తమ దాడులకు ఏదోక కారణం చెబుతారని, అలా హింసకు కారణాల్ని అంగీకరిస్తే, శాంతి భద్రతలు ప్రపంచంలో ఎక్కడా, ఎప్పటికీ సాధ్యం కావన్నారు. అంబేద్కర్ నేతృత్వంలో రూపొందించిన ఉదాత్త రాజ్యాంగ పద్ధతుల్లోనే మన విమర్శలు, ఆందోళనలు హేతుబద్ధ, నిర్దిష్ట పరిష్కారాలు ఉండాలని జేపీ స్పష్టం చేశారు.

ప్రజలే ప్రభువులు

# జనబలం

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ మాసపత్రిక

నవంబర్ 2025

సంపుటి 27 సంచిక 11

## జనబలం చందా రుసుము వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా : | రూ. 100.00 |
| మూడు సంవత్సరాలకు చందా : | రూ. 290.00 |
| ఐదు సంవత్సరాలకు చందా : | రూ. 475.00 |
| జీవితకాలపు చందా : | రూ. 1200.00 |

సంపాదకవర్గం
బండారు రామ్మోహనరావు
శిరమని నరేష్


వర్కింగ్ ఎడిటర్
దూసనపూడి సోమసుందర్

*జనబలంలో ప్రచురితమవుతున్న వ్యాసాలలో రచయిత(త్రు)లు వెలిబుచ్చే అభిప్రాయాలు కేవలం వారి సొంతం. జనబలం సంపాదకవర్గం ఆ అభిప్రాయాలతో ఏకీభవిస్తున్నట్టు కాదు.*

### చందాదారులకు విజ్ఞప్తి

చందా మొత్తాలను, ప్రకటనల ధర మొత్తాలను చెక్కుగాని, డి.డి. ద్వారా గాని FOUNDATION FOR DEMOCRATIC REFORMS పేర పంపవచ్చును. NEFT సౌకర్యము ద్వారా పంపదలచినవారు SBI PUNJAGUTTA BRANCHలోని SB A/C. No. 52086568057కి IFSC CODE No. SBIN0020072కు పంపి, Transaction I.D. No. మరియు తారీఖు తప్పనిసరిగా తెలియజేయవలెను. నగదు రూపంలో చెల్లించదలచిన వారు లోక్‌సత్తా సంస్థ కేంద్ర కార్యాలయంలో ఇచ్చి రశీదు పొందవలెను.

### కార్టూన్ కార్నర్




06 అస్థిర దక్షిణాసియాలో సుస్థిర ప్రజాస్వామ్యం

09 2 లక్షల బహుళ ప్రయోజనకర సహకార సంఘాల ఏర్పాటుకు చురుగ్గా చర్యలు

13 అరుదైన వ్యక్తిత్వం..రాజీలేని తత్వం...

18 శతవత్సరాల దీప్తి! వైకోమ్ సత్యాగ్రహ స్ఫూర్తి!

24 కులాన్ని రాజకీయం పెంచి పోషిస్తోంది కాబట్టే విజయవాడ కాంగ్రెస్ లో జేపీ ఆ విమర్శ చేశారు

కార్యాలయ చిరునామా : H.NO. 6-3-678, B-106 , పాషా కోర్టు, 71 , సోమాజీగూడ, త్రిభువన్‌దాస్ జ్యాయలరీ వెనుక, హైదరాబాద్-500 082 ఫోన్: 040-23310288, 040-23419949
Email: accountsdept@loksatta.org

ప్రత్యేక సంపాదకీయం

# భారత ఆర్థికవృద్ధికి వాణిజ్య ఆంక్షల సవాలు

మన ప్రజాస్వామ్యం బలమైనది, నిజమైనది. కానీ సరిదిద్దుకోవాల్సిన లోపాలు ఎన్నో ఉన్నాయి. మన ఎన్నికల వ్యవస్థ, రాజకీయ సంస్కృతి వ్యక్తిపూజను ప్రోత్సహిస్తాయి. ప్రతిభను నిరుత్సాహ పరుస్తాయి. పార్టీలో పెరగాలంటే, ఎన్నికల బరిలో అభ్యర్థి అనిపించుకోవాలంటే.. ప్రారంభం నుండే ఎన్నో అవరోధాలు! అవినీతిని, ఆశ్రిత పక్షపాతాన్ని మన రాజకీయం పెంచి పోషిస్తుంది. హేతుబద్ధ విధానాలను అణచివేస్తుంది. చట్టబద్ధ పాలనలో విఫల మవుతున్నాం. దీంతో, అరాచకత్వం మన సంస్కృతిలో భాగమన్నట్లు కొనసాగుతోంది. బడితె ఉన్నవాడిదే బర్రె. నేర ముఠాలు, శక్తిమంతమైన మన 'సంపన్నులు' బండ న్యాయాన్ని అందిస్తారు. చాలా సందర్భాల్లో కండబలంతో తక్షణ 'న్యాయాన్ని' అమలుచేస్తారు. స్థానిక ప్రభుత్వాలు అత్యధికం నామమాత్రం. అధికారమంతా రాష్ట్ర స్థాయిలో కేంద్రీకృతమై ఉంది. శాసనసభ్యులు తమ పరిధి చట్టసభకే పరిమితం అని విస్మరిస్తారు. రాజ్యాంగాన్ని అతిక్రమించి ప్రభుత్వ పాత్రలోకి ప్రవేశిస్తారు. నియోజకవర్గంలో మకుటంలేని మహారాజులా, ప్రచ్ఛన్న ప్రభుత్వంలా వ్యవహరిస్తుంటారు. ఈ కేంద్రీకృత పాలన వల్ల మన ఓటర్లు తక్షణ, తాత్కాలిక ప్రయోజనాలను దాటి ఆలోచించలేక పోతున్నారు. డోలాయమాన స్థితిలో ఊగిసలాడుతున్నారు. తరచూ ఎన్నికల్లో పెనం మీద నుంచి పొయ్యిలో పడుతున్నట్లు వారి పరిస్థితి తయారవుతోంది. పౌరుల్లోని ఈ అవగాహనా లోపం మన ప్రజాస్వామ్యం బలోపేతానికి అవరోధమవు తోంది. దీర్ఘకాల ఉమ్మడి ప్రయోజనాల మీద దృష్టి సారించటం కష్టతరం చేస్తోంది.

తమ ఓటు..తమ రోజువారీ జీవితం మీద చూపే ప్రత్యక్ష ప్రభావం ఓటర్లకు అర్థం కావటం లేదు. దాంతో డబ్బు, ప్రలోభాలు వంటి వాటి ఆకర్షణలో కొట్టుకుపోతున్నారు. కులం, ఇతర అణగారిన భావోద్రేకాలను రగిల్చి ఎన్నికలు ప్రజల్ని ముక్కలు చేస్తున్నాయి. వీటితోపాటు.. సంక్షేమం పేరుతో అలవిమాలిన, అసాధ్యమైన తాత్కాలిక పథకాలను ఆశిస్తున్నారు. తమ దీర్ఘకాల అభివృద్ధిని చేజేతులా పణంగా పెడుతున్నారు.

దురదృష్టవశాత్తూ, దేశంలో నిజమైన రాజకీయ, పాలనా సంస్కరణ పట్ల రాజకీయ నాయకులు, అధికారులు, వ్యాపార వర్గం, మధ్యతరగతి, మీడియా - తదితర ఉన్నత వర్గాల్లో తపన కొరవడింది. సేవాభావం గల పౌరులు నలుదిక్కులా ఎక్కడికక్కడ రాజకీయంలో నిజమైన భాగస్వాములై, వారిలో సమర్థులు అధికారంలోకి రాగలిగేలా రాజకీయ పార్టీల ప్రజాస్వామీకరణ జరగాల్సుంది. రాజకీయాల్లో చట్ట విరుద్ధమైన, లెక్కచూపని డబ్బు పాత్రను నిర్మూలించే ఎన్నికల సంస్కరణలు ఎంత త్వరగా తేగలిగితే అంత మంచిది. నిజమైన చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాలకు జవాబుదారీతనంతో సిసలైన సాధికారత, పౌరసేవల నాణ్యత పెంచేందుకు పాలనా సంస్కరణలు అవసరం. పారదర్శకత, జవాబుదారీతనానికి సివిల్ సర్వీస్ సంస్కరణలు తేవాల్సుంది. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో పార్టీలు, నాయకత్వం నుంచి వీటిని ఆశించటం అత్యాశలా కనిపిస్తోంది. మన ప్రజానీకంలో మధ్యతరగతి స్థాయి ఆదాయాల్ని ఆర్జించేవారి సంఖ్య ఇంకా బాగా పెరిగి, నిజమైన మార్పు కోసం డిమాండ్ చేస్తే అప్పుడు సాంప్రదాయ రాజకీయ వ్యవస్థ కదులుతుంది. అంత వరకూ గాంధీజీ చెప్పిన అపార సహనాన్ని పాటిస్తూ సంస్కర్తలు కృషిని కొనసాగించటం తప్పకపోవచ్చు.

కానీ ప్రపంచం మనకు అంత సమయం ఇవ్వదు. ఈ నేపథ్యంలో, రెండు మూడు దశాబ్దాల పాటు అధిక అభివృద్ధి రేటు నిరంతరాయంగా కొనసాగించే అవకాశాన్ని సర్వశక్తులూ ఒడ్డి సద్వినియోగం గావించుకోవటం మన దేశం ముందున్న అత్యుత్తమ మార్గం.

భారత్ ఇటీవలి సంవత్సరాలలో పటిష్ఠ వృద్ధి రేట్లను నమోదు చేస్తోంది. కానీ అంతా బాగుందనుకునేలోపు.. అంతర్జాతీయ ఒడిదుడుకులు చుట్టుముట్టాయి. దశాబ్దాల స్వేచ్ఛా వాణిజ్యానికి ఉన్నట్లుండి విఘాతమేర్పడింది. పాతకాలపు వాణిజ్య ఆంక్షల ధోరణులు మళ్లీ అమల్లోకొచ్చాయి. రష్యా ముడిచమురు కొనకుండా మనల్ని నిరోధించేందుకు అమెరికా 25% సుంకాన్ని జరిమానాగా విధించింది.

పశ్చిమ ఐరోపా కూడా రష్యా నుంచి చమురు కొనుగోలుపై మన మీద ఒత్తిడి పెంచుతోంది. ప్రస్తుతం అమెరికాతో వాణిజ్య చర్చలు తిరిగి మొదలయ్యాయి. కానీ ఫలితం ఊహించలేనిదేమీకాదు. అమెరికా విధానాల్లోని అనూహ్యత, ప్రపంచవ్యాప్త

అనిశ్చితిలో ఇంతకంటే ఒరిగేదేమీ లేదు. సౌదీ-పాక్రక్షణ ఒప్పందం మనకు మరో బలమైన సవాలు. సౌదీ అరేబియాతో మన ఆయుధ, ఆర్థిక సంబంధాలను ఇది గణనీయంగా ప్రభావితం చేస్తుంది. ఇదే సమయంలో.. హెచ్-1బి వీసా ఫీజు పెంపు, ఔషధాల దిగుమతులపై అమెరికా సుంకాలు అనిశ్చితికి ఆజ్యం పోస్తున్నాయి. ఒక్కో సమస్యనూ మనం కాలక్రమంలో పరిష్కరించుకోవచ్చుగానీ..మూకుమ్మడిగా ఈ సమస్యలు మన ఆర్థికాభివృద్ధి లక్ష్యానికి పెను సవాలునైతే విసురుతున్నాయి.

ఈ మొత్తం అనిశ్చితిలో, కారుచీకట్లలో కాంతిరేఖలు లేకపోలేదు. యూనియన్ ప్రభుత్వ ద్రవ్య నిర్వహణ ఆరోగ్యకర రీతిలో ఉండటం అలాంటి ఓ దీపస్తంభం. కొవిడ్ మహమ్మారి ప్రపంచవ్యాప్తంగా అన్నిపెద్ద ఆర్థిక వ్యవస్థల ఖజానాలపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. వ్యాధి వ్యాపించకూడదనే ఉద్దేశంతో మనకు మనం విధించుకున్న లాక్‌డౌన్‌ల వల్ల ఆర్థిక వ్యవస్థ స్తంభించింది. ప్రభుత్వ ఆదాయాలు తగ్గాయి. మరోవంక ఖర్చు మాత్రం అమాంతం పెరిగింది. ఆరోగ్య సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి, నిరుద్యోగం కారణంగా సంక్షేమ కార్యక్రమాలకి భారీగా వెచ్చించాల్సి వచ్చింది. ప్రధాన ఆర్థిక వ్యవస్థలన్నీ పెద్దఎత్తున అప్పులు చేసి మరీ ప్రభుత్వ వ్యయాన్ని పెంచాయి. సంక్షేమ పథకాల్ని అందించాయి. నగదు బదిలీల్ని చేశాయి. విచిత్రంగా, ఇంకా ఇంకా నగదు పంపిణీ చేయాలని, ప్రజల జేబుల్లో డబ్బు నింపాలని అనేక మంది సుప్రసిద్ధ ఆర్థికవేత్తలు సైతం సూచించారు. పైనుంచి డబ్బు వెదజల్లితేనే ఆర్థిక వ్యవస్థ కోలుకో గలుగుతుందన్నారు. ఆర్థిక కలాపాలను మూసి వేయాలని మనమే విధాన నిర్ణయం తీసుకోవటం, సరఫరా గొలుసులు విచ్ఛిన్నమవటం వల్ల ఆర్థిక ప్రగతి కృత్రిమంగా మందగించిందన్న అంశాన్ని వారు గమనంలోకి తీసుకోలేదు. కొవిడ్ అసాధారణ పరిస్థితుల నేపథ్యంలో కీన్స్ ఆర్థిక సిద్ధాంతం విఫలమైంది.

ఈ విషయంలో, మన జాతీయ స్థాయి ప్రభుత్వం ఎంతో నియంత్రణను, ముందుచూపును ప్రదర్శించింది. మరింత ఎక్కువ ఖర్చు చేయాలన్న సాంప్రదాయ ఆలోచనా తీరుకి భిన్నంగా వ్యవహరించింది. వ్యాధిని ఎదుర్కోవటానికి మన పాలకులు ఉదారంగా ఖర్చు చేశారు. టీకాలు, ఆరోగ్య సంరక్షణ, బాధిత వర్గాలకు ఆహార సరఫరా, చిన్న, మధ్యతరహా పరిశ్రమలకు మద్దతు వంటి వాటిల్లో ఎక్కడా వెనుకంజ వేయలేదు. అదే సమయంలో, మిగతా అంశాల్లో వ్యయాన్ని కట్టడి చేశారు.

అయినా కూడా, మన యూనియన్ ప్రభుత్వ ఆర్థిక పరిస్థితిలో గణనీయ మెరుగుదల నమోదైంది. 2014-15లో జీడీపీలో 2.9% ఉన్న రెవెన్యూ లోటును ప్రస్తుత 2025-26 బడ్జెట్ అంచనాల్లో 1.5 శాతానికి తగ్గించగలిగారు. మూలధన వ్యయాలకు సహాయంగా అందించిన గ్రాంట్లు మినహాయిస్తే, రెవెన్యూ లోటు ఇప్పుడు జీడీపీలో 0.3%. వడ్డీ భారం గత పదేళ్లుగా స్థిరంగా ఉంది. మొత్తం యూనియన్ వ్యయంలో 24-25%గా కొనసాగుతోంది. జీడీపీవాటా పరంగా అది 3.25-3.5%. కొవిడ్ ఉధృతి కాలంలో అప్పు గణనీయంగా పెరిగినా కూడా ఆర్థికరంగం అదుపు తప్పలేదు. 2014-15 లో మొత్తం వ్యయంలో 12% ఉన్న పెట్టుబడి వ్యయం.. 2025-26 బడ్జెట్ అంచనాల్లో 30%కి పైగా పెరిగింది. జీడీపీ ప్రకారం చూస్తే, 1.5% నుండి 4.34 శాతానికి పెరి గింది. 2014-15లో 4% ఉన్న యూనియన్ ద్రవ్య లోటు.. కొవిడ్ సంక్షోభం వల్ల 2020-21లో ప్రమాదకర స్థాయిలో 9.2%కి పెరిగింది. కానీ 2024-25 కల్లా మరింత ఆరోగ్యకరస్థాయికి, 4.8%కి తగ్గించారు. 2025-26లో 4.5% ఉంటుందని అంచనా వేస్తున్నారు. 2020-21లో జీడీపీలో 61.4%కి చేరిన యూనియన్ ప్రభుత్వ అప్పు, ఈ రకమైన ద్రవ్య నియంత్రణ వల్ల క్రమంగా తగ్గుతోంది. 2025-26లో సుమారు 56% ఉంటుందని భావిస్తున్నారు. 2031 నాటికి 50%కి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

గత దశాబ్దంలో ఎన్నదగిన సంస్కరణ బహుశా ప్రభుత్వరంగ బ్యాంకుల తిరోగమనం తారుమారై పురోగమనం కావటమని చెప్పవచ్చు. 2014-15లో అన్ని బ్యాంకుల నష్టాలూ కలిపి ఏడాదికి రూ.80,000 కోట్లు. ఈవేళ వాటి ఉమ్మడి లాభం సంవత్సరానికి రూ.100,000 కోట్లు! మూలధన నిబంధనలకు తగిన స్థాయిలో ఉండేలా రూ.400,000 కోట్లకు పైగా నగదు నిల్వల్ని బ్యాంకులకు సమకూర్చారు. అవి దివాళా పరిస్థితి నుంచి కోలుకున్నాయి. పనితీరు మెరుగు పడింది. 2018లో 12% ఉన్న నిరర్థక ఆస్తులు ప్రస్తుతం 2.5%కి తగ్గటం ఆషామాషీ కాదు!

ఆర్థిక క్రమశిక్షణ, పెట్టుబడి వ్యయాన్ని భారీగా పెంచటం, బ్యాంకులు లాభాల బాట పట్టటం- ఈ చర్యలన్నీ అంతర్జాతీయ ఒడిదుడుకులను తట్టుకునే వెసులుబాటును మనకు కల్పించాయి. కానీ నిజమైన పరిపాలన రాష్ట్రాల్లో ఉంది. కాబట్టి, బయటి అనిశ్చిత వాతావరణం నేపథ్యంలో, వృద్ధిని వేగంగా పెంచే నిజమైన సవాళ్లు రాష్ట్రాల్లో ఉన్నాయి. భారత్ ఇప్పుడు సిసలైన ఫెడరల్ దేశం. రాష్ట్రాల భవిష్యత్తు రాష్ట్రాల చేతుల్లోనే ఉంది.

**- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్**

# అస్థిర దక్షిణాసియాలో సుస్థిర ప్రజాస్వామ్యం

- డాక్టర్ జయప్రకాష్ నారాయణ్-



శ్రీలంకలో ఉవ్వెత్తున ఎగసిన జనాగ్రహానికి2022 జులైలో రాజపక్స ప్రభుత్వం రాజీనామా చేయక తప్పలేదు. అయితే తాత్కాలిక అధ్యక్షుడిగా రణిల్ విక్రమసింఘె ఒడుపుగా, ఆచితూచి చర్యలు తీసుకోవటంతో దేశం కుదుట పడనారంభించింది. ఆ తర్వాత సెప్టెంబర్ 2024 ఎన్నికల్లో వామపక్ష సంకీర్ణ సారథి అనూర కుమార దిశనాయకె అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. శాంతియుతంగా అధికార బదిలీ జరిగింది. రాజ్యాంగ ప్రక్రియను పరిరక్షించింది. రాజకీయ స్థిరత్వాన్ని తిరిగి నెలకొల్పింది. అయితే ఈ క్రమంలో ప్రధాన పార్టీలు నామమాత్ర అవశేషాల్లా మిగిలాయి. ఆ పార్టీల పట్ల భ్రమలు తొలగిన ఓటర్లు తమ ఆగ్రహాన్ని బ్యాలెట్‌లోనూ ప్రదర్శించటంతో ఎన్.పి.పి సంకీర్ణం ఘనవిజయం సాధించింది.

ప్రజాందోళనలతో అట్టుడికిన మరో దేశం బంగ్లాదేశ్. షేక్ హసీనా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆగస్టు 2024లో ప్రజలు రోడ్లెక్కారు. విధ్వంసానికి దిగారు. షేక్ హసీనా రాజీనామాతో శాంతించారు. మహమ్మద్ యూనస్ నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. షేక్ హసీనా నాయకత్వం దేశ ఆర్థిక ప్రగతిని వేగవంతం చేసిందనటంలో సందేహం లేదు. అయితే, ఆమె పగ, ప్రతీకార ధోరణులను అనుసరించటం, పార్లమెంటులో ప్రతిపక్షం లేకపోవటం ఆందోళనలకు దారితీసింది. 2026 ఫిబ్రవరిలో ఎన్నికలు జరుగుతాయంటున్నారు. భవిష్యత్తు ప్రభుత్వానికి స్థిరత్వాన్ని, ప్రజామోదాన్ని ఆ ఎన్నికలు అందిస్తాయా అంటే..ఎవరూ చెప్పలేని పరిస్థితి!

ఇటీవల నేపాల్ వంతు వచ్చింది. అక్కడ మరో యువ తిరుగుబాటు పెల్లుబికింది. కె.పి శర్మ ఓలి సంకీర్ణ ప్రభుత్వం రాజీనామా చేయాల్సి వచ్చింది. పార్లమెంటునూ రద్దు చేశారు. మాజీ ప్రధాన న్యాయమూర్తి సుశీల కర్కి నాయకత్వంలో తాత్కాలిక ప్రభుత్వం ఏర్పాటైంది. ఆరు నెలల్లో ఎన్నికలు జరుపుతామని తాత్కాలిక సర్కారు ప్రకటించింది. నేపాల్‌లో మళ్లీ స్థిరత్వం, శాంతిభద్రతలు నెలకొంటాయా, ప్రభుత్వానికి విశ్వసనీయత సమకూరుతుందా?.. వేచిచూడాల్సిందే.

ఇక పాకిస్థాన్. అక్కడ ఫిబ్రవరి 2024లో ఎన్నికలు జరిగాయి. అయితే ప్రజాదరణ ఉన్న ఇమ్రాన్ ఖాన్ పి.టి.ఐ పార్టీకి ఎన్నికల గుర్తునూ నిరాకరించారు. అలా అణచివేసినప్పటికీ, భారీస్థాయి రిగ్గింగ్ జరిగిందనే ఆరోపణలున్నప్పటికీ.. పి.టి.ఐ మద్దతిచ్చిన స్వతంత్ర అభ్యర్థులు ఎక్కువ సీట్లు గెలుచుకున్నారు. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన పి.ఎం.ఎల్ - ఎన్.పి.పి గ్రూప్‌లు సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. పైకి స్థిరంగా కనపడుతున్నా, లోలోపల అంతా అస్థిరత్వం! ప్రభుత్వానికి ప్రజామోదం, నైతిక అర్హత ప్రశ్నార్థకం. అయితే, గతంలో కూడా ఎన్నికైన ప్రభుత్వం పాకిస్థాన్‌లో అరుదుగా మాత్రమే తన అధికారాన్ని వినియోగించింది. నియంత్రణ మొత్తం సైన్యం చేతిలో ఉంటుంది. ప్రభుత్వం ప్రజాస్వామ్యముసుగు మాత్రమే.

ఆగ్నేయాసియా థాయ్‌లాండ్‌లో కూడా సైన్యం, కొంతమంది రాజవంశీకులు నిజమైన అధికారాన్ని చెలాయిస్తారు. ఎన్నికైన ప్రభుత్వాన్ని తమకు నచ్చనప్పుడు వెంటనే రద్దు చేస్తారు. మరోదేశం మయన్మార్‌లో ప్రజాస్వామ్యం కోసం దశాబ్దాల పాటు వీరోచిత పోరాటం చేశారు ఆంగ్ శాన్ సూకీ. వెలకట్టలేని త్యాగాల అనంతరం ఎన్నికలు జరిగాయి. భారీ మెజారిటీతో సూకీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే వాస్తవ పరిస్థితుల్ని గుర్తించి సైనిక నీడలోనే ఆమె తన పాలన సాగించారు. కానీ తర్వాతి ఎన్నిక వచ్చేసరికి సైన్యం పాత కథను పునరావృతం చేసింది. వ్యవస్థ మొత్తాన్నీ మళ్లీ ప్రత్యక్ష నియంత్రణలోకి తీసుకుంది. రాజకీయ నేతల్ని



నిర్బంధంలోకి నెట్టింది. సైనిక పాలనలో అంతర్యుద్ధం నడుమ ప్రస్తుతం ఆ దేశం కొట్టుమిట్టాడుతోంది.

పాకిస్థాన్, థాయ్‌లాండ్, మయన్మార్ దేశాలు సైనిక దళాల జోక్యం వల్ల ప్రజాస్వామ్య సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. నిజమైన అధికారం సైన్యం చేతిలో కేంద్రీకృతమై ఉంది. కానీ శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ పరిస్థితి వేరు. ఎన్నికైన ప్రభుత్వాల్ని ప్రజాగ్రహం, వీధి ఆందోళనలు కూల్చాయి.

బలమైన వ్యవస్థలు, సంప్రదాయాలు, పద్ధతులు లేకుంటే ఎదుగుతున్న ప్రజాస్వామ్యాలు ఎలా కకావికలవుతాయో.. రాచరిక వ్యవస్థ అంతమయ్యాక నేపాల్‌లో గత 17 ఏళ్ల పరిణామాలు ఉదాహరణ. ఈ పదిహేడు సంవత్సరాలలో ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వంతో కూడా కలిపి నేపాల్ 14 ప్రభుత్వాలను చూసినట్లు లెక్క. 2022 నవంబర్ సార్వత్రిక ఎన్నిక తర్వాత 34 నెలల్లో అయిదు ప్రభుత్వాలు మారాయి! పుష్ప కమల్ దహాల్ నాయకత్వం వహిస్తున్నసి.పి.ఎన్ (మావోయిస్ట్ సెంటర్) పార్టీ దిగువ సభలో 275 సీట్లకు 32 మాత్రమే గెలుచుకుంది. కె.పి శర్మ ఓలి నేతృత్వం వహిస్తున్న సి.పి.ఎన్ (యుఎంఎల్) 79 సీట్లు సాధించింది. షేర్ బహదూర్ దేవ్ బా ఆధ్వర్యంలోని నేపాలీ కాంగ్రెస్‌కి 88 సీట్లు లభించాయి. నేపాలీ కాంగ్రెస్‌తో పొత్తుతో దహాల్ ఎన్నికలకు వెళ్లారు. అయినా, ఎన్నికైన వెంటనే ప్లేటు ఫిరాయించి, ప్రజలకు అప్పటిదాకా ప్రచారంలో చెప్పిన మాటలకు పూర్తి విరుద్ధంగా పొత్తు భాగస్వామిని వీడి ఓలితో చేతులు కలిపి ప్రధాన మంత్రి అయ్యారు. మూడు నెలల్లోగా, మార్చి 2023లో మళ్లీ ఓలితో పొత్తును వదిలేసి నేపాలీ కాంగ్రెస్ మద్దతుతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. మళ్లీ ఏడాదిలోగా, మార్చి 2024లో తిరిగి ఓలి పంచన చేరారు. ఎన్నికలనాటి నుంచి మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. జులై 2024లో ఓలి నాయకత్వంలోని సి.పి.ఎన్ (యుఎంఎల్), దేవ్ బా ఎన్.సి కలసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఓలి ప్రధానమంత్రి.

ఎన్నికల్లో ప్రచారానికి, ప్రజల తీర్పుకి వ్యతిరేకంగా సాగిన ఈ రకమైన ఊపిరిసలపని అధికార క్రీడలో అన్ని ప్రధాన

> **విశృంఖలంగా, బాహాటంగా అవినీతి జరుగుతూ, అధికార లాలస, పదవుల సమీకరణాల్లో పార్టీలు మునిగితేలుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని, అధికారానికి లక్ష్యాన్ని విస్మరించినప్పుడు.. పేరుకుపోయిన ప్రజాగ్రహం అసంకల్పితంగా పెల్లుబుకుతుంది.**

పార్టీలూ, నేతలూ వాటాదారులయ్యారు. రెండు ప్రధాన పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయటం, ప్రతిపక్షంలో శూన్యత ఏర్పడటం యువత అసంతృప్తికి ఆజ్యం పోసింది. ఆందోళనలు దావానలాలయ్యాయి. ప్రతిపక్షాన్ని ఉక్కు పాదంతో అణచివేసినందుకు షేక్ హసీనా కూడా మూల్యం చెల్లించారు. తమ కష్టనష్టాల్ని, సమస్యల్ని చెప్పుకోవటానికి ప్రతిపక్షం కొరవడినప్పుడు, శాంతియుత ప్రదర్శనలకు మార్గం లేకుండా చేసినప్పుడు, ఆ ఆగ్రహం, ఆక్రోశం లోలోపల రగులుతూ ఒక్కసారిగా బద్దలవుతుంది. ప్రభుత్వాన్ని కూలదోయటానికి, రాజ్యాంగ ప్రక్రియను సైతం ధిక్కరించటానికి దారితీస్తుంది.

విశృంఖలంగా, బాహాటంగా అవినీతి జరుగుతూ, అధికార లాలస, పదవుల సమీకరణాల్లో పార్టీలు మునిగి తేలుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని, అధికారానికి లక్ష్యాన్ని విస్మరించినప్పుడు.. పేరుకుపోయిన ప్రజాగ్రహం అసంకల్పితంగా పెల్లుబుకుతుంది. ప్రభుత్వానికి ఉండే నిజమైన గొప్ప బలం కేవలం శాసనసభ్యుల సంఖ్య కాదు పాలకుల పట్ల విశ్వసనీయత, వారి నిర్ణయాలకు ప్రజల్లో ఆమోదనీయతకూడా అవసరం.

ఈ విపరిణామాలన్నీ చూశాక, అటువంటి రాజకీయ కల్లోలాలు భారత్‌లోనూ చోటుచేసుకుంటాయేమోనని కొంతమంది ప్రజానీకం విభ్రమ చెందుతున్నారు. కానీ, భారతదేశ పరిస్థితులు చాలా భిన్నమైనవి. మన ప్రజాస్వామ్యం పటిష్ఠమైనది. ఎన్నికల్లో తీవ్ర పోటీ ఉంటుంది, ఎన్నికలు మొత్తమ్మీద నిష్పాక్షికంగా జరుగుతాయి. ఓటు వేయటంలో, ఇతరత్రా రాజకీయ స్వేచ్ఛ ఉంటుంది. ఎవరు గెలిచినా అధికారం శాంతియుతంగా బదిలీ అవుతుంది, ఎన్నికల ఫలితాలను స్థూలంగా అందరూ ఆమోదిస్తారు. ఎన్నికైన ప్రభుత్వాలు నిజమైన అధికారంతో విధుల్ని నిర్వర్తిస్తాయి.

మన ప్రజాస్వామ్యంలో ఎన్ని లోపాలున్నా, ప్రజల్ని సమీకరించటంలో మన రాజకీయ పార్టీలు నిరంతరం చురుగ్గా

వ్యవహరిస్తుంటాయి. ప్రజల సమస్యలకు గొంతునిస్తాయి. సమాజంలోని ఆందోళనల విషయంలో సాధారణంగా పార్టీలు సంయమనంతో వ్యవహరిస్తాయి. న్యాయస్థానాలు, రాజ్యాంగ సంస్థలు నిజమైన స్వయం ప్రతిపత్తిని, విశ్వసనీయతను కలిగివుంటాయి. మనం మొదట్నుంచి కొన్ని ఆరోగ్యకరమైన సంప్రదాయాలను, పద్ధతులను పాదు కొల్పాం. మన వైవిధ్యం, సువిశాలత, గత ముప్పై ఏళ్లుగా రాష్ట్రాల సాధికారత గల నిజమైన ఫెడరలిజం.. స్థిరత్వానికి భరోసానిస్తున్నాయి. భారత్‌లో పరిపాలన ప్రధానంగా రాష్ట్రాల్లో ఉంది. సమస్యల్ని అత్యధికం రాష్ట్రాల స్థాయిలోనే నియంత్రిస్తారు. ఇతర ప్రాంతాలకు వ్యాపించటం అరుదు. రకరకాల గందరగోళాలు, వాగాడంబరాలు ఉంటాయిగానీ.. పైన పేర్కొన్న అంశాలన్నిటి వల్లా మన దేశంలో స్థిరత్వానికి, ప్రజల్లో నమ్మకానికి ఢోకా లేదు.

అలాగని అంతా బాగుందా అంటే.. మనం ఉదాసీనంగా ఉండటానికి వీల్లేదు. ఎన్నికల చట్టబద్ధత, నిష్పాక్షికతలను ఓడిపోయిన పార్టీలు బాధ్యతారహితంగా ప్రశ్నించటం ఇటీవల ప్రమాదకర ధోరణిగా ప్రబలుతోంది. ఎన్నికల్లో లెక్కచెప్పని భారీ డబ్బు ఖర్చును నిర్మూలించేలా మన ఎన్నికల వ్యవస్థను సంస్కరించాలనటంలో సందేహం లేదు. సమాజంలోని అత్యుత్తములు రాజకీయాలు, చట్టసభల్లోకి ప్రవేశించటానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చేలా మార్పులు తేవాల్సుంది. మన చట్టబద్ధపాలన బలహీనం. అధికారం రాష్ట్రాల స్థాయిలో మితిమీరి కేంద్రీకృతమై ఉంది. స్థానిక ప్రభుత్వాలు చాలావరకు ఉత్సవ విగ్రహాలు. భారత్‌లో పనిచేసేవారిలో అత్యధికులు అసంఘటిత రంగంలో ఉన్నారు. వీరికి నెలవారీ జీతం, జీవన భద్రత లేవు. వేగంగా సాగుతున్న మన అభివృద్ధి విలువను, పటిష్ఠంగా కొనసాగించాల్సిన అవసరాన్ని ప్రభుత్వాలు, ప్రజలు కూడా గుర్తిస్తున్నారు. అయితే ఆ అభివృద్ధి ఇప్పటికీ సమ్మిళితం కాలేదు. సంపదసృష్టిలో పాత్రలేని కోట్లాది సామాన్యులు ఇప్పటికీ పరాయిభావనతో నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నారు. రాజకీయ, పాలనా సంస్కరణ, సమ్మిళిత అభివృద్ధి ఈవేళ మనం ఎదుర్కోవలసిన సవాళ్లు. ☆





## జాతీయ ఏకతా దినోత్సవం..

## వల్లభాయ్ పటేల్ 150వ జయంతి కార్యక్రమంలో జేపీ

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి సందర్భంగా సికింద్రాబాద్ బొల్లారం రాష్ట్రపతి నిలయంలో జరిగిన జాతీయ ఏకతా దినోత్సవ ప్రత్యేక కార్యక్రమంలో డాక్టర్ జేపీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హైదరాబాద్ సంస్థాన విలీనంలో తప్ప ఎక్కడా ఒక్క రక్తం బొట్టు చిందకుండా భారత్ లోని 565 సంస్థానాలను పటేల్ విలీనం చేయటం ప్రపంచ చరిత్రలో ఇప్పటికీ ఓ అద్భుతమన్నారు. గాంధీ, పటేల్ సాధించిన దేశ ఐక్యతను కాపాడుకునే ప్రజాస్వామిక పరిణతిని 146 కోట్ల మంది ప్రజలూ సంతరించుకునేలా తగిన వ్యవస్థల్ని నిర్మించుకోవాలని, ప్రజలందరి ఆదాయాలు పెరిగేలా ఆర్థిక క్రమశిక్షణను పాటిస్తూ అభివృద్ధి అవకాశాలను అందుకోగలిగితే ఈ లక్ష్యం 2047 నాటికి పూర్తిగా ఆచరణసాధ్యమని జేపీ పేర్కొన్నారు.

# ఉపాధి, 10శాతం వృద్ధికి 'సహకారం నుంచి సమృద్ధి'

## 2 లక్షల బహుళ ప్రయోజనకర సహకార సంఘాలు

అందరూ తనకు అత్యంత శక్తిమంతమైన హోంశాఖ ఇచ్చారని అనుకుంటుంటారని, కానీ తనకు ఎంతో సంతృప్తినిచ్చేది సహకార మంత్రిత్వ శాఖని.. ఆ రెండు శాఖల్నీ నిర్వహిస్తున్న యూనియన్ మంత్రి అమిత్ షా ఇటీవల వ్యాఖ్యానించారు. పాల ఉత్పత్తిలో గుజరాత్ కేంద్రంగా విప్లవం సృష్టించిన రైతుల సహకార సంస్థ అమూల్ ప్రభావంతో ఆయన ఆ మాటలు అని ఉండవచ్చుగానీ.. వ్యక్తి సుఖానికి-సమాజ హితానికి అనుసంధానం చేస్తూ ప్రజాస్వామ్య స్ఫూర్తికి నిజమైన నిదర్శనంగా నిలిచే రంగం సహకార వ్యవస్థ. అందుకే, అమూల్‌ని తీర్చిదిద్దిన వర్గీస్ కురియన్‌ని తన మెంటార్‌గా, తన కృషి వల్ల తెలుగునాట వచ్చిన 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంఘాల) చట్టం, సహకార రంగాలకు స్వతంత్ర ప్రతిపత్తినిచ్చే 97వ రాజ్యాంగ సవరణలు తనకెంతో ఇష్టమైనవిగా భావిస్తానని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చెబుతుంటారు.

ఉన్నకొద్దీ విభజితమవుతున్న ప్రపంచ దేశాల మధ్య మానవాళికి కీలకమైన కొన్ని మౌలికాంశాల మధ్య ఏకాభిప్రాయ సాధనకు ఐక్యరాజ్యసమితి 2025ను 'అంతర్జాతీయ సహకార సంవత్సరం'గా ప్రకటించటాన్ని ఉపయోగించుకునేలా యూనియన్ ప్రభుత్వం వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. దీంతోపాటు, దేశీయంగా తొలిసారి ఏర్పాటు చేసిన సహకార మంత్రిత్వ శాఖ ద్వారా జాతీయ నూతన సహకార విధానాన్ని ఈ ఏడాది ప్రకటించింది. 'సహకారం ద్వారా సమృద్ధి' నూతన విధాన లక్ష్యం. ఇందులో భాగంగా.. 2030 నాటికి రెండు లక్షల బహుళ ప్రయోజనకర ప్రాథమిక వ్యవసాయ సహకార (పరపతి) సంఘాల (పీఏసీఎస్) ఏర్పాటుకు యూనియన్ ప్రభుత్వం చురుగ్గా చర్యలు తీసుకుంటోంది. మూడు నెలల్లోనే 10 వేల పీఏసీఎస్‌లను ప్రారంభించామని, గడువు కంటే ముందుగానే లక్ష్యాన్ని సాధిస్తామని యూనియన్ సహకార మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. ఇప్పటివరకు 22,600 పైచిలుకు ఏర్పాటయినట్లు చెబుతున్నారు.

పంచాయతీల స్థాయిలో సహకార సంఘాల పనితీరు సక్రమంగా లేకుంటే ఈ రంగం ద్వారా సంపదసృష్టి సాధ్యం కాదని, ఇది ఆర్థికాభివృద్ధి మీద ప్రతికూల ప్రభావం




చూపుతోందని ప్రభుత్వం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే రెండు లక్షల పీఏసీఎస్‌ల ఏర్పాటుకి సంకల్పించింది. సహకారం ద్వారా సమృద్ధి సాధనలో భాగంగా రెండు విడతల్లో ఈ లక్ష్యాన్ని పూర్తిచేయనున్నారు.

మొదటి విడతలో నాబార్డ్ 32,750 కొత్త ఎం-పీఏసీఎస్‌లను, ఎన్.డి.బి.బి 56,500 డెయిరీ సహకార సంఘాలను, ఎన్.ఎఫ్.డి.బి 6,000 మత్స్య సహకార సంఘాలను ఏర్పాటు చేస్తున్నాయి. రెండో విడతలో నాబార్డ్ 45,000 ఎం-పీఏసీలు, ఎన్.డి.బి.బి 46,000 డెయిరీ సహకార సంఘాలు, ఎన్.ఎఫ్.డి.బి 5,500 మత్స్య సహకార సంఘాలు, రాష్ట్ర ప్రభుత్వాలు 25,000 కొత్త సహకార సంఘాలను ఏర్పాటు చేస్తాయి. ప్రస్తుతం పని చేయకుండా ఉన్న సహకార సంఘాల లిక్విడేషన్‌కి నియమావళిని కూడా విడుదల చేశారు. 15,000 గ్రామాలలో కొత్త సంఘాల ఏర్పాటుకి ఈ పరిణామం దోహదం చేయనుంది. ఒక గ్రామంలో ఇప్పటికే ఒక సహకార సంఘం ఉంటే, రెండో పీఏసీఎస్‌ను ఏర్పాటు చేయకూడదని తాజా నిబంధనల్లో పొందుపరిచారు. ఒకవేళ ఇప్పటికే పనిచేయని స్థితిలో ఉంటే, ఈ నిబంధన వర్తించదు. తెలుగు రాష్ట్రాలకు సంబంధించి కొన్ని వివరాలు పరిశీలిద్దాం.

**తెలంగాణలో కొత్త వ్యవసాయ ప్రాథమిక సహకార పరపతి సంఘాలు**

తెలంగాణలో మండలానికి కనీసం రెండు సంఘాలు ఉండేలా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న సంఘాలను విభజించి కొత్త సంఘాలను ఏర్పాటు

చేయాల్సి వస్తే.. అందుకోసం ఆయా సంఘాలు మహాసభలు నిర్వహించి తీర్మానం చేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన 500కు పైగా కొత్త సంఘాలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని తొలుత భావించారు. అయితే ఇటీవల ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనల్లో కొత్తగా 199 ప్రాథమిక వ్యవసాయ సంఘాల ఏర్పాటుకి రాష్ట్ర సహకార శాఖ కోరింది. రాష్ట్రంలో ప్రస్తుతం 908 ప్రాథమిక వ్యవసాయ సంఘాలున్నాయి. 272 మండలాల్లో ఒకే ఒక్క సంఘం ఉంది. 81 మండల కేంద్రాల్లో ఒక్కటీ లేదు. కొన్నిచోట్ల రెండు గ్రామాలకు కలిపి ఒకటే ఉంది. ఒక సంఘంలో 500 మంది సభ్యులుండగా.. మరికొన్నింటిలో వేలమంది ఉన్నారు. 2013 తర్వాత కొత్తగా సంఘాలు ఏర్పాటు కాలేదు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత, వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు విస్తరించటంతో కొత్త సంఘాల కోసం డిమాండ్లు మొదలయ్యాయి. యూనియన్ ప్రభుత్వం నూతన సహకార విధానం కింద ప్రతి గ్రామంలో ఒక్కో ప్రాథమిక సహకార సంఘం, మత్స్య, పాల ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు చేయాలని అన్ని రాష్ట్రాలకూ లేఖ రాసింది.

**నిర్మల్ నుంచి 20:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి 30 జిల్లాల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. నాగర్‌కర్నూలు, జోగులాంబ గద్వాల జిల్లాల నుంచి ఒక్కటీ రాలేదు. అన్నిటికంటే ఎక్కువగా నిర్మల్ జిల్లా నుండి 20 కొత్త సంఘాలకు ప్రతిపాదనలు వచ్చాయి.

**పీఏసీఎల్‌ల పునర్వ్యవస్థీకరణపై ఆంధ్రప్రదేశ్‌లో కమిటీ**

ఏపీలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల పునర్వ్యవస్థీకరణ సాధ్యాసాధ్యాలను అంచనా వేయటానికి సహకార శాఖ కమిషనర్ అధ్యక్షతన రాష్ట్ర ప్రభుత్వం కమిటీని ఏర్పాటు చేసింది. ఆప్కాబ్ ఎండీ కన్వీనర్‌గా వ్యవహరించే ఈ కమిటీలో.. నాబార్డ్ సీజీఎంతోపాటు చిత్తూరు, కృష్ణా జిల్లాల డీసీసీబీ సీఈఓలు సభ్యులుగా ఉంటారు. దేశవ్యాప్తంగా రెండు లక్షల కొత్త బహుళ ప్రయోజన పీఏసీఎంలు, డెయిరీ, మత్స్య సహకార సొసైటీలు ఏర్పాటు చేయాలన్న యూనియన్ ప్రభుత్వ నిర్ణయం అమలు దిశగా రాష్ట్రంలో ఉన్న అవకాశాలను కమిటీ అధ్యయనం చేస్తోంది. నాబార్డ్ జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా కనీస జనాభా, సాగు విస్తీర్ణం, అనుకూల ప్రాంతం, మౌలిక సౌకర్యాల లభ్యత తదితర అంశాలను కమిటీ పరిశీలిస్తుంది. రాష్ట్రంలో ప్రస్తుతం 2,042 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలుండగా, వాటిలో ఇరవై లోపు లిక్విడేషన్ దశలో ఉన్నాయి.

**కంప్యూటరీకరణ పూర్తి:** ఆంధ్రప్రదేశ్ లోని దాదాపు అన్ని పీఏసీఎస్ లలో కంప్యూటరీకరణ పూర్తయింది. వీటన్నిటినీ

**సహకార రంగం ద్వారా జీడీపీలో 18% దాకా ఆదాయం సంపాదించే నెదర్లాండ్స్ వంటి దేశాల్లో..అధికార, ప్రతిపక్ష తేడా లేకుండా సమర్థులను సంఘాల పదవులకు ఎన్నుకుంటారు. సాధారణ ఎన్నికల్లో పార్టీల మధ్య సైద్ధాంతిక పోరు ఉంటుందిగానీ, దేశ ఆర్థికాభివృద్ధికి, ఉపాధికి దోహదం చేసే సహకారం వంటి రంగాల్లో పార్టీల కతీతంగా వ్యవహరిస్తారు.**

ఈ-పీఏసీఎస్‌లుగా మార్చారు. వీటిలో రోజువారీ లావాదేవీలు ఆన్‌లైన్ విధానంలో జరుగుతున్నాయి.

**రాజకీయ జోక్యం:** సహకార సంఘాల్లో చట్టవిరుద్ధ కలాపాలపై మినహా ప్రభుత్వ జోక్యానికి వ్యతిరేకంగా లోక్‌సత్తా న్యాయ పోరాటాలు చేయటంతోపాటు స్థూలంగా వాటి స్వయంప్రతిపత్తికి భరోసానిచ్చే 97వ రాజ్యాంగ సవరణ తెచ్చింది. అంతవరకూ సమస్య లేకున్నా.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు 2005లో జరిగిన పునర్వ్యవస్థీకరణ, రాష్ట్రం విడిపోయాక గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణలు ఏపీలో తాజా కమిటీకి పెద్దసవాలుగా మారాయి.

సహకార రంగం ద్వారా జీడీపీలో 18% దాకా ఆదాయం సంపాదించే నెదర్లాండ్స్ వంటి దేశాల్లో.. అధికార, ప్రతిపక్ష తేడా లేకుండా సమర్థులను సంఘాల పదవులకు ఎన్నుకుంటారు. సాధారణ ఎన్నికల్లో పార్టీల మధ్య సైద్ధాంతిక పోరు ఉంటుందిగానీ, దేశ ఆర్థికాభివృద్ధికి, ఉపాధికి దోహదం చేసే సహకారం వంటి రంగాల్లో పార్టీలకతీతంగా వ్యవహరిస్తారు. పదవిని బాధ్యతగా, ముళ్లకిరీటంలా భావిస్తారు కాబట్టే.. అక్కడి అతిపెద్ద సహకార బ్యాంకు 'రాబో'కి అధికార పక్షంవారు సారథ్య అవకాశం ప్రతిపాదించినా, ప్రతిపక్ష నేతలు తిరస్కరించిన సందర్భాలున్నాయి. మన దేశంలో అందుకు పూర్తి విరుద్ధం.

అధికారాన్ని పూజించే సంస్కృతి మన సమాజంలో వేళ్లూనుకుపోవటంతో..ప్రాథమిక సంఘాల ఎన్నికలు కూడా పక్షపాత రాజకీయమయమై ఎన్నికల రోజు చాంతాడంత క్యూలు, ఓట్ల కొనుగోలు వంటివి జరుగుతుంటాయి. అధికార దుర్వినియోగం, ఆశ్రిత పక్షపాతంతో రుణ కేటాయింపులు వంటివి చాలావాటిల్లో తరచూ చోటు చేసుకుని సభ్యుల ప్రయోజనాలకు గండికొడుతుంటాయి. అలాంటి రాజకీయంలేని ములుకనూర్ వంటి చోట సహకార సంఘాలు అద్భుత విజయాన్ని సాధించి రైతులు, ఇతర

### అన్ని రంగాలకూ సహకారోద్యమ విస్తరణ

సహకార సంఘాలు సంప్రదాయ పరిధిని దాటి నవీకరణకు, డిజిటల్ సేవలు, ఇంధనం, ఆర్థిక సేవలలో స్వావలంబనకు వేదికలుగా నిలుస్తున్నాయని యూనియన్ సహకార, హోంశాఖ మంత్రి అమిత్ షా ఇటీవల ఐక్యరాజ్యసమితిలో పేర్కొన్నారు. 2025 అంతర్జాతీయ సహకార సంఘాల సంవత్సరం నేపథ్యంలో 'సుస్థిరాభివృద్ధి సాధనకు సహకార సంఘాలు' అంశంపై సమితిలో భారత్, కెన్యా, మంగోలియా దేశాలు ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన వీడియో సందేశాన్ని ప్రదర్శించారు. భారతదేశంలో వ్యవసాయం నుంచి ఆర్థిక రంగం వరకు సహకార సంఘాలు క్రియాశీల పాత్ర పోషిస్తున్నాయని మంత్రి తెలిపారు. భారత్ లో 2021లో మొదటిసారిగా జాతీయ స్థాయిలో సహకార మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలోని 29 రంగాలలో ఉన్న 8,40,000 సహకార సంఘాలలో 32 కోట్ల మంది సభ్యులున్నారు. ఈ సంఖ్యను 50 కోట్లకు పైగా పెంచాలన్నది లక్ష్యం.

సభ్యులకు సుస్థిర లాభాల్ని పంచుతున్నాయి.

పార్టీ రాజకీయ ధోరణి పెచ్చుమీరటం వల్ల ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని 4,465 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలను 2005లో సుమారు 2,950కి కుదించారు. వీటిల్లోకి తెలంగాణకు పోను, ఏపీకి మిగిలినవి 2,042. లిక్విడేషన్ పోగా 2,028 మాత్రమే చురుగ్గా ఉన్నాయి. ఇవి కూడా తెలంగాణ తరహాలో ఇష్టారాజ్యంగా కేటాయించారు. ఏపీలోని 248 మండలాల్లో ఒక్కోటి చొప్పున పీఏసీఎస్ ఉండగా, మరికొన్ని మండలాల్లో ఒక్కోచోట 7-10 ఉన్నాయి.

➤ కృష్ణా జిల్లాలో 25 మండలాలుంటే.. 213 సంఘాలు, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాలుంటే 166, ఏలూరు జిల్లాలో 27 మండలాలకు 163 సంఘాలు ఉన్నాయి.

➤ ఒక మండల పరిధిలో 20కి పైగా గ్రామాలున్నా, ఒకటే సంఘం ఉంది. దీంతో అక్కడి రైతులు పీఏసీఎస్‌లో అవసరాల కోసం 10-20 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది.

➤ 2023లో పీఏసీఎస్‌ల పునర్వ్యవస్థీకరణ అంశం తెరపైకి వచ్చింది. మూడు ఆర్.బి.కె ల (రైతు భరోసా కేంద్రాలు) పరిధిలో ఒక పీఏసీఎస్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. కానీ ఆచరణ లేదు.

➤ గత ప్రభుత్వ హయాంలో సొంత పార్టీ వారికి పీఏసీఎస్



సభ్యత్వాల్ని, ఆస్తుల్ని దోచిపెట్టారని, వీటి విలువ వందల కోట్లలో ఉంటుందని, సహకార సంఘాల పునర్వ్యవస్థీకరణ సందర్భంగా వీటన్నిటినీ పరిగణలోకి తీసుకోవాలని అధికార కూటమి పక్ష నేతలు కొందరు కోరుతున్నారు. మండల పరిధి, రైతుల సంఖ్య, స్థానిక అవసరాలను ఈ దఫా దృష్టిలో పెట్టుకోవాలని వినతులు వస్తున్నాయి.

**బహుళ ప్రయోజనాలివీ:**

బహుళ ప్రయోజనకర సహకార సంఘాల ద్వారా వ్యవసాయ, మత్స్య, పాలు తదితర రంగాలలో సకాలంలో, సరసమైన వడ్డీకి రుణాలు, నిల్వకు గోడౌన్లు, శీతల గిడ్డంగులు, మార్కెటింగ్ కి రైతు ఉత్పత్తి సంస్థల (ఎఫ్.పి.ఓ) సమర్థ నిర్వహణ, విత్తనాలు, ఎరువులతో పాటు సాగునీటి నిల్వ, సరఫరా, వ్యవసాయ, అనుబంధ రంగాల నిర్వహణ, మార్కెటింగ్‌లో భాగంగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను ప్రోత్సహించటం, కిరాణా రిటైల్ చెయిన్లు, డిజిటలీకరణ, మేకిన్ ఇండియాకు దన్నుగా నిలవటం వంటి లక్ష్యాలను సాధించాలని భావిస్తున్నారు. భారత వ్యవసాయ రంగానికున్న 100 బిలియన్ డాలర్ల ఎగుమతి సామర్థ్యాన్ని అందుకోవటం వేగంగా సాధ్యమవుతుందని అంచనా వేస్తున్నారు.

ఇటువంటి సామర్థ్యం వల్ల నెదర్లాండ్స్‌లో సహకార రంగం వాటా జీడీపీలో 18% కాగా, పదవుల రాజకీయం తప్ప ప్రజాస్వామిక దృక్పథం కొరవడటం వల్ల, మన వద్ద అది 3-5% మాత్రమే ఉంది. రెండు లక్షల బహుళ సహకార సంఘాలను డిజిటలీకరించి జవాబుదారీతనంతో పనిచేయించటం వల్ల భారత్ కి సుమారు 300-500 బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతుందని అంచనా. అదేవిధంగా, కొత్తగా ఏర్పాటు చేసే పీఏసీఎస్ ల ద్వారా 6-10 లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలు, ప్రతి రూ.1 కోటి టర్నోవర్ ద్వారా 10-15 పరోక్ష ఉపాధి అవకాశాలు సాధ్యమై, ఆర్థికాభివృద్ధి సమ్మిళితమవుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. దీనివల్ల,

మన దేశ జీడీపీలో సహకార రంగం వాటా కొన్నేళ్లలోనే ఉపాధితో కూడిన 10% దాటే అవకాశముంది.

**నైపుణ్యాల శిక్షణకు సహకార వర్సిటీ**

ఈ క్రమంలోనే, ఈ ఏడాది యూనియన్ బడ్జెట్‌లో సహకార శాఖకు నిధుల్ని రూ.650 కోట్ల మేర పెంచి రూ.1,150




కోట్లు కేటాయించారు. సహకార సంస్థలో ఎవరిని పడితే వారిని సిఫార్సుల మేరకు నియమించకుండా, తగిన నైపుణ్యాలున్నవారిని ఉద్యోగాలకు ఎంపిక చేసే విధంగా శిక్షణకు గుజరాత్‌లోని ఆనంద్‌లో 'త్రిభువన్ సహకారి యూనివర్సిటీ'ని ఏర్పాటు చేశారు.

**భారత్ ట్యాక్సీ యాప్**

ఉబర్, ఓలా, క్యాబ్‌ల మాదిరిగా సహకార ట్యాక్సీల అందుబాటుకు 'భారత్ ట్యాక్సీ'యాప్‌ను ప్రవేశపెడుతున్నారు. నవంబర్‌లో ప్రయోగాత్మకంగా ఢిల్లీలో ప్రారంభించి, ఈ ఏడాది చివరినాటికి అన్ని మహా నగరాలకూ అక్కడ్నుంచి ఇతర పట్టణ ప్రాంతాలకూ విస్తరించాలన్నది ప్రణాళిక. కార్లు, ద్విచక్ర వాహనదారులు తమ వాహనాలను ఈ యాప్‌లో నమోదు గావించుకోవచ్చు. యాప్ ఖాతాలోకి కాకుండా నగదు నేరుగా డ్రైవర్ ఖాతాలోకే జమ అవుతుంది.

**డిజిటలీకరణ అంతరాల్ని అధిగమించాలి**

ప్రపంచంలో సహకారోద్యమం విజయవంతమైన జర్మనీ, జపాన్, కెన్యా దేశాల అనుభవాల నుంచి మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. జర్మనీ పారదర్శకతలో అగ్రగామి కాగా.. సభ్యుల అభిప్రాయాలు, అవసరాల్ని బట్టి జపాన్, కెన్యాలు డిజిటలీకరణ చేపడుతున్నాయి. గుజరాత్ లో డిజిటలీకరణ 63 శాతాన్ని మించిపోతే, కర్ణాటకలో 18 శాతం మాత్రమే ఉంది. ఈ ఏడాది జూన్ నాటికి దేశీయంగా 38% పీఏసీల డిజిటలీకరణ మాత్రమే జరిగింది. ఈ విషయంలో గుజరాత్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్‌లు అగ్రస్థానంలో ఉంటే.. బీహార్, కర్ణాటకలు వెనుకబడ్డాయి. డిజిటల్ అంతరం రుణాల అంతరంలో కూడా ప్రతిఫలిస్తూ, వెనుకబడిన, మహిళా వర్గాలు తక్కువ రుణాలు పొంద గలుగుతున్నారు.

**కో ఆపరేటివ్ ఇన్సూరెన్స్ కంపెనీ**

అదేవిధంగా, దేశంలోని అన్ని సహకార సంఘాలకు బీమా రక్షణ కల్పించేందుకు కో ఆపరేటివ్ ఇన్సూరెన్స్ కంపెనీని ఏర్పాటు చేస్తున్నారు.

**(నవంబర్ 14-20 భారత సహకార వారోత్సవాలు)**

# 2030 నాటికి మనుషులు - టెక్నాలజీ

**అందివస్తున్న ఆధునిక సాంకేతికతలు, పెరుగుతున్న ఆటోమేషన్ వల్ల ఉద్యోగ విధుల్లో చాలా మార్పులు వస్తున్నాయి. టెక్నాలజీ ప్రభావంతో ప్రస్తుతం మనుషులు చేస్తున్న చాలా పనులు భవిష్యత్తులో యంత్రాలు చక్కబెట్టనున్నాయి. ఆటోమేషన్, ఇతర సాంకేతికతల వల్ల ఉద్యోగాలకు ముప్పుతో పాటు కొత్త అవకాశాలు కూడా వస్తాయి. అందిపుచ్చుకునేందుకు మనకు నైపుణ్యాలు, నిత్య నవీకరణ ముఖ్యమని విశ్లేషణలు చెబుతున్నాయి. వచ్చే అయిదేళ్లలో మనుషులు, సాంకేతికత, మానవులు-టెక్నాలజీ కలసి.. నిర్వర్తించే విధుల వాటా (శాతాల్లో):**

| | ప్రస్తుతం | 2030 నాటికి |
|---|---|---|
| మనుషులు చేసే పనులు | 47 | 33 |
| సాంకేతికతతోనే చేసే పనులు | 22 | 34 |
| మనుషులు-యంత్రాలు కలిపి చేసేవి | 30 | 33 |

**(సోర్స్: ఫ్యూచర్ జాబ్స్ రిపోర్ట్ 2025)**

# అరుదైన వ్యక్తిత్వం..రాజీలేని తత్వం...

## మామిడి రామారెడ్డి గారికి నివాళి





అందరికీ ఆప్తమిత్రులు నాకు సొంత అన్న కంటే ఎక్కువ, సమాజ హితాన్ని కోరే గొప్ప వ్యక్తి , వేలాది మందిని ప్రభావితం చేసిన మాననీయుడు, మానవతావాది మామిడి రామారెడ్డిగారిని కోల్పోయామని ప్రజాస్వామ్యపీఠం, లోక్‌సత్తా ఉద్యమ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ పేర్కొన్నారు. ఆయన మృతికి ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేసి, రామారెడ్డి గారితో ఉన్న అనుబంధాన్ని వివరించారు..ఆయన మాటల్లోనే..

పౌరుడిగా, పౌర సమాజం నాయకుడిగా, ఈ దేశంలో కొన్ని కీలకమైన మార్పులకు నాంది పలికిన పోరాట యోధుడిగా ఆయన గురించి మనం తెలుసుకోవాలి. రామారెడ్డి గారి జీవితం ఒక ఫలవంతమైన జీవితం. అర్థవంతమైన జీవితం. స్ఫూర్తివంతమైన జీవితం. చాలా కొద్ది మంది మాత్రమే అంత ప్రభావవంతమైన జీవితాన్ని గడుపుతారు. అందుకనే ఆయన లేని వెలితి మన అందర్ని బాధిస్తోంది. ఇంకో ఐదు, పదేళ్లు మన మధ్య ఉండి, ఒకవేళ శరీరం పూర్తిగా సహకరించక పోయినా ఆయన మేధస్సును, అనుభవాన్ని, జ్ఞానాన్ని మనకు పంచి ఈ దేశంలో మరిన్ని మార్పుల కోసం, స్వేచ్ఛ వికసించడం కోసం ఆయన గనుక నాయకత్వాన్ని ఇస్తే ఎంత బాగుండేది అని మనందరం అనుకుంటాం..ఎందుకంటే మనందరం కూడా దశాబ్దాల పర్యంతం..ఆయన సూచనలని, సలహాలని పాటించాం. సైద్ధాంతిక విషయాల్లో ఆయన నిబద్ధతను గుర్తించాం. ఆయన స్పష్టత నుంచి పాఠాలు నేర్చుకున్నాం. ఆయన వ్యూహచాతుర్యం నుంచి ఎన్నో ఫలితాల్ని సాధించాం. అది కోల్పోయామనే బాధ, దిగులు సహజంగానే మన అందరికీ ఉంటుంది. ఒక వ్యక్తిగా అరుదైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తి రామారెడ్డిగారు. సభ్యత, సంస్కారం, హుందాతనం మూడూ కలబోసిన మనిషి. ఆయన గురించి మనం ఆలోచిస్తే నాకెప్పుడూ ఒక పదం గుర్తుకు వస్తుంది..నిష్కల్మషమైన మనిషి. ఏ రకంగాను మనస్సులో మాలిన్యం అంటని మనిషి. పూర్తిగా స్వచ్ఛత ఆయన సొంతం. అందుకనే ఆయన మాటకి, ఆలోచనకి, చేతకి పెద్ద అంతరం కనిపించదు. ప్రతి విషయంలో కూడా మౌలిక సూత్రాలు, దాని ఆధారంగా తర్కబద్ధంగా ఆయన తన జీవితాన్ని మలుచుకున్నారు. చుట్టూ ఉన్న వాళ్ల జీవితాల్ని మలిచే ప్రయత్నం చేశారు. రాగద్వేషాలకు పూర్తిగా అతీతం. కుటుంబం, బంధుమిత్రులు, సంఘం, స్నేహితులు, సహచరులు, ఇతరులు కావచ్చు ఏ కోశానా మాలిన్యం, రాగద్వేషం కనిపించవు. వాస్తవాన్ని చూడడం, అంచనా వేయడంలో ఆయనకు ఆయనే సాటి. సిద్ధాంతాల విషయంలో రాజీలేనితత్వం. అదే సమయంలో వ్యూహచాతుర్యం, సమయస్ఫూర్తి మనకు కనిపిస్తాయి. ఆయన ఎక్కడ ఏ సంస్థకు నాయకత్వం వహించినా నాయకుల్ని తయారు చేశారు. తానే నాయకుడిగా ఉండాలని కోరుకోలేదు. మట్టిలో మాణిక్యాలను తయారు చేసి సమాజానికి అందించారు. అదీ ఆయనలో ఉన్న ప్రత్యేకత. ఇక భావజాలం చూసినట్టయితే సైద్ధాంతికంగా ఆయనలోని విశిష్టతను చూస్తే.. వ్యక్తి స్వేచ్ఛ, సమాజహితం, రాజ్యం పరిమిత పాత్ర ఈ మూడు ఆయన మౌలిక సూత్రాలు. రాజ్యాంగ విలువలను ఔపోసన పట్టిన మనిషి. ప్రాథమిక హక్కులు, వ్యక్తి బాధ్యతలు, రాజ్యం పాత్ర గురించి స్పష్టత

ఉన్న మనిషి. ఆయన భావాలు, పదిమందికి చెప్పే అంశాలు ,ఆయన ఆచరించే పద్ధతులు చాలా స్పష్టతతో కూడుకున్నవి. అది సహ వికాస నిర్మాణం కావొచ్చు, స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేసేందుకు నిరంతరం ఆయన సాగించిన దీక్ష కావొచ్చు.., సొసైటీలను కాపాడటంలో కావొచ్చు..ఆయన గట్టిగా నిలబడి అద్భుతమైన ఫలితాలు సాధించారు.. ప్రజాస్వామ్య పీఠం నిర్మాణం, లోక్‌సత్తా ఉద్యమ నిర్మాణం కావొచ్చు..ప్రతీ రంగంలో, ప్రతీ సంస్థలో, ప్రతీ ఉద్యమంలో ఆయన పాత్ర కనిపిస్తోంది. ఆయన భావజాలం, స్పష్టత గోచరిస్తాయి. అందువల్లనే ఆయనకు సంబంధం ఉన్న సంస్థలు సమాజానికి విశిష్టమైన సేవలు అందిం చాయి..అందిస్తున్నాయి. హడావుడిగా పోయే లాంతర్ల వెనకాల పోకుండా..సుదూరంగా ఉన్న నక్షత్రాలను గుర్తించి దాన్నిబట్టి దారి ఎంచుకునే ఏర్పాటు చేసే తత్వం ఆయనది. సహకార సంస్థల స్వయం ప్రతిపత్తి కోసం రాజీలేని పోరాటం చేశారు. మ్యాక్స్ చట్టం వచ్చిందంటే అది పూర్తిగా రామారెడ్డిగారి కృషి వల్ల, ఆయన దూరదృష్టి, ముందు చూపు వల్లే...మన రాష్ట్రంలోనే కాదు ఇతర రాష్ట్రాల్లోనూ ఈ చట్టం వచ్చింది. 97వ రాజ్యాంగ సవరణ వచ్చింది..సహకార సంఘాలకు స్వయం ప్రతిపత్తి రాజ్యాంగ బద్ధంగా ప్రాప్తించింది ఆయన చొరవ, నాయకత్వం వల్లే. పాలనా సమాచార హక్కు లాంటి చట్టాలు ఒడుపుగా వచ్చాయి అంటే వ్యూహచాతుర్యంతో లక్ష్య సాధన కోసం ఆయన చూపిన చొరవ, ముందు చూపే కారణం. లోక్‌సత్తా, ప్రజాస్వామ్యపీఠం ఎన్నో విజయాలు సాధిం చాయి..వాటిన్నిటి వెనుకాల రామారెడ్డిగారి ఆలోచన, పాత్ర, నాయకత్వం , సలహాలు, సూచనలు స్పష్టంగా ఉన్నాయి. అన్నిటిని మించి మనదేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగ విలువల గురించి స్పష్టమైన అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించిన మనిషి రామారెడ్డి గారు. ఆయన లేని లోటు పూడ్చలేనిది. కానీ ఆయన మనకు ఇచ్చిన జ్ఞాన సంపద, ముందు చూపుతో ఆయన చేసిన సూచనలు, ఆయన ఏర్పాటు చేసిన సంస్థలు, నడిపిన ఉద్యమాలు, సాధించిన ఫలితాలు మనకు నిరంతరం చుక్కానిలా ఉండి మార్గాన్ని చూపెడతాయి. మన ప్రజాస్వామ్యాన్ని సార్థకం చేయడంలో తోడ్పడతాయి. మీ అందరితో పాటు నా సోదరుడు, ఆప్తమిత్రుడు ప్రజా పోరాట క్షేత్రంలో నిరంతరం అండగా ఉన్న సైన్యాధిపతి రామారెడ్డిగారి మృతికి ప్రగాఢమైన సంతాపాన్ని తెలియజేస్తూ, ఆయన స్ఫూర్తి, ఆయన వ్యక్తిత్వం ఆయన చర్యలు, ఆయన ఆలోచనలు నిరంతరం మనకు దారి చూపెడతాయని మనసారా విశ్వసిస్తున్నాను. ✪

సహకారమే తన ఊపిరిగా భావించి సహకార ఉద్యమానికి ఎనలేని సేవలు అందించిన మామిడి రామారెడ్డిగారు ఇటీ వల హైదరాబాద్‌లో కన్ను మూశారు. ఆయన మరణించినా రామారెడ్డి సహ కార స్ఫూర్తి ఇప్పటికీ మన కళ్ళ ముందు సహ వికాస సంస్థ ద్వారా కనపడుతుంది. హనుమకొండ సమీపంలోని భీమారంలో ఉన్న సహవికాస సంస్థ ద్వారా సహకార రంగానికి గట్టి పునాదిని వేశారు. మామిడి రామారెడ్డి గారి మృతికి లోక్‌సత్తా ప్రగాఢ సానుభూతిని సంతాపాన్ని తెలియజేస్తుంది. మామిడి భోజిరెడ్డి గారు సహకార ఉద్యమ రంగంలో చేసిన సేవలకు కొనసాగింపుగా ఆయన కుమారుడు మామిడి రామారెడ్డి గారు ఆ సహకార స్ఫూర్తిని అందుకొని తండ్రి అడుగుజాడలలో నడిచి సహకార ఉద్యమానికి అనేక సేవలందించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ప్రారంభంలో 1997 నుండి మామిడి రామిరెడ్డి గారు సహకార రంగ స్ఫూర్తిని కాపాడుతూనే లోక్‌సత్తా ఉద్యమ సంస్థకు తమ విలువైన సేవలు అందించారు. లోక్‌సత్తా ఉద్యమ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాశ్ నారాయణ్ గారు ఆహ్వానించిన వెంటనే రామారెడ్డి గారు సహకార రంగంలో మార్పులకు ఎలాంటి పెద్ద పీట వేయాలి, దానిని ప్రజలకు ఎలా అనుసంధానం చేయాలనే విషయాలలో లోక్‌సత్తా ఉద్యమ సంస్థ నాయకులకు, కార్యకర్తలకు ఎన్నో శిక్షణ తరగతులు నిర్వహించారు. అలా 2000 సంవత్సరం నుండి నేను రామారెడ్డి గారిని దగ్గర నుంచి గమనించాను. చాలా సాదాసీదాగా ఉండే ఆయన తెల్లటి ధోవతి అంతే తెల్లటి లాల్చీ ధరించి అందరిని చిరునవ్వుతో పలకరిస్తూ భేషజాలకు పోకుండా కలిసి పోయేవారు. మామిడి రామారెడ్డి గారు వారి తండ్రి స్థాపించిన సహకార ఉద్యమ సంస్థలను రక్షించుకుంటూనే వాటిని నిర్వహించడంలో ఆయన చేసిన కృషి అనన్య సామాన్యమైనది.మామిడి రామారెడ్డి గారి తండ్రి మామిడి భోజరెడ్డి ప్రస్తుత రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ సమితి అధ్యక్షుడిగా పనిచేసిన మామిడి భోజిరెడ్డి గారు 1919లో రంగారెడ్డి జిల్లా శంషాబాద్ గ్రామంలో జన్మించారు. 2001లో మరణించారు. రంగారెడ్డి జిల్లా పరిషత్ చైర్మన్‌గా 1962 నుండి 76 వరకు వరుసగా మూడుసార్లు పనిచేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యధిక కాలం 14 సంవత్సరాలు జిల్లా పరిషత్ చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తిగా ఆయనకు గుర్తింపు ఉంది. మామిడి భోజి రెడ్డి గారి తదనంతరం మామిడి రామారెడ్డి గారు తనదైన రీతిలో తండ్రి అడుగు జాడలలో నడుస్తూ సహకార ఉద్యమ వ్యాప్తికి విశేషమైన చేశారు. అందులో భాగంగానే లోక్ సత్తా ఉద్యమ సంస్థతో కలిసి పని చేసి లోక్‌సత్తా ఉద్యమ సంస్థ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో మా అందరితో కలిసి పని చేశారు. సహకార ఉద్యమ వ్యాప్తికి ఎనలేని సేవలు చేసిన మామిడి రామారెడ్డి గారికి ఘనమైన నివాళి అర్పిస్తున్నాను. వారి మరణం మనందరికీ తీరని లోటు. వారి స్ఫూర్తిని మన లోక్‌సత్తా ఉద్యమ సంస్థ కార్యకర్తలు నాయకులు అందిపుచ్చుకోవాలి.

–బండారు రామ్మోహనరావు

# ఆ సహకార సంఘ రైతుల ఆస్తులు రూ.350 కోట్లు

ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ ఐఏఎస్‌గా కరీంనగర్ జిల్లాలో శిక్షణ తీసుకున్న విషయం తెలిసిందే. అక్కడ ఆయనకు సహకారం రంగంపై ములుకనూర్ సంఘం సారథి విశ్వనాథరెడ్డి చాలా స్పష్టమైన అవగాహన కలిగించారు. ఆ తర్వాత మామిడి రామిరెడ్డి (సహ వికాస), గుజరాత్‌లో వర్గీస్ కురియన్‌లు జేపీకి ఆ రంగం ప్రాధాన్యతను మరిన్ని క్షేత్రస్థాయి ఫలితాలతో విశద పరిచారు. ఇంతకుముందు చెప్పుకున్న 'మ్యాక్స్' చట్టం, 97వ రాజ్యాంగ సవరణను జేపీ సాధించటంలో వీరి స్ఫూర్తి ఎంతైనా ఉంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల దివంగతులైన సహ వికాస కో ఆపరేటివ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రామిరెడ్డికి జేపీ ఘన నివాళులర్పించారు. ఎఫ్.డి.ఆర్, లోక్‌సత్తా కృషిలో, ప్రజల సాధికారతకు పట్టం గట్టే క్రమంలో ఆయన కృషిని స్మరించుకున్నారు. స్వేచ్ఛావాదులందరికీ రామిరెడ్డి మరణం పెద్దలోటని పేర్కొన్నారు.

సహకార రంగం సామర్థ్యాన్ని వెలికితీయటం ద్వారా భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మలిచే ప్రయత్నం జరుగుతున్న నేపథ్యంలో..ములుకనూర్ సహకార సంఘం (ప్రస్తుతం హనుమకొండ జిల్లా) సక్సెస్ స్టోరీ ప్రస్తుతం ఎలా ఉందో చూద్దాం. స్పెషల్ మ్యాగజైన్ స్టోరీగా ఓ ప్రముఖ పత్రిక న్యూస్ ఏజెన్సీ భీమదేవరపల్లి రిపోర్టర్ బుర్ర స్వామి గౌడ్ ఈ కథనం రాశారు:

తెలంగాణ హనుమకొండ జిల్లా ములుకనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘం విజయం చిన్నదేం కాదు. ఇందులోని రైతు సంఘంలోసుమారు ఏడువేల మంది రైతులున్నారు. వీరి ఆస్తుల విలువే రూ.350 కోట్లు. వ్యవసాయం అంటే అప్పులు, కష్టాలు, ఆత్మహత్యల గురించే తరచూ వింటుండే మనకు ఈ రైతు సంఘం సాధించిన విజయం ఆశ్చర్యాన్నే కాదు, స్ఫూర్తినీ రగిలిస్తుంది. అయితే ఈ విజయం వెనుక 70 ఏళ్లనాటి రైతుల కన్నీళ్లు దాగివున్నాయి. ఆ కష్టాలని, కన్నీళ్లనీ దాటటానికి ఆ రైతులు చేసిన కృషే నేటి ఈ విజయానికి కారణం.

ఇప్పుడు లాభాలు తెచ్చిపెడుతున్న ఈ ప్రాంతం 70 ఏళ్ల క్రితం కరవు, కాటకాలతో సతమతమయ్యేది. సాగు చేయటానికి చేతిలో చిల్లిగవ్వలేక, అప్పటికే వడ్డీ వ్యాపారుల నుంచి తీసుకున్న అప్పులకు వడ్డీలు కట్టలేక రైతులు ఎన్నో పాట్లు పడ్డారు. ఒకవేళ ఎవరైనా పంట వేస్తే – గిట్టుబాటు ధర వచ్చేది కాదు. ఇదే కొనసాగితే బిడ్డల భవిష్యత్తు ఊహించలేము అనుకున్న.. విశ్వనాథరెడ్డి, భూపతి కృష్ణమూర్తి, పడాల చంద్రయ్యతోపాటు మరో 373 మంది రైతులు ఏకమై రెండువేల అయిదొందల రూపాయలతో ములుకనూర్ సంఘానికి పునాది వేశారు. అలా 1956 జులైలో ములుకనూర్ సహకార గ్రామీణ పరపతి సంఘం ఏర్పడింది. ఆరోజు వాళ్లు సంఘటితంగా చేసిన ఆ చిన్న పొదుపే ప్రస్తుతం కోట్ల వ్యాపారమై ఎక్కడాలేని విధంగా రైతులకు అండగా ఉంటోంది.

**పునాది ఇలా..**

వందకి వంద వడ్డీ తీసుకునే ఆ రోజుల్లో ఆ భారాన్ని తగ్గించటమే మొదటి లక్ష్యంగా పెట్టుకుంది రైతు సంఘం. జమ చేసిన డబ్బుల్లోంచి కొంత మొత్తాన్ని సభ్యులకు తక్కువ వడ్డీతో అప్పులు ఇస్తూ, మిగిలిన డబ్బుతో రైతుల అవసరాల్ని తీరుస్తూ రకరకాల వ్యాపారాల్లోకి అడుగుపెట్టింది. రైస్ మిల్లు, ఎరువులు-విత్తనాల సూపర్ మార్కెట్లు, వ్యవసాయ యంత్రాల దుకాణాలు, విద్యుత్తు మోటారు షాపులు, విత్తన శుద్ధి కేంద్రాల్లాంటివి ప్రారంభించింది. ఇలా ఒక్కో మెట్టూ ఎక్కుతూ ఒకవైపు వ్యాపారాల్లో మంచి లాభాల్ని అందుకుంటూ, మరోవైపు రైతులకు అండగా నిలుస్తూ వచ్చింది. రైతుల సమష్టి కృషితో ఆ ఊరి ముఖచిత్రమే మారుతూ వచ్చింది. నెమ్మదిగా పక్కనున్న 14 గ్రామాల రైతులూ చేరారు. వాళ్లందరూ సంఘం ద్వారా సాగుబడికి కావాల్సిన రుణాలేకాదు, వ్యవసాయ పరికరాల్ని కొనటానికీ డబ్బు సాయం తీసుకోవచ్చు. ఇంకా రైతులకు నాణ్యమైన విత్తనాలు అందివ్వటం దగ్గర్నుంచి పంట అమ్మటం వరకూ అన్నీ సంఘం ఆధ్వర్యంలోనే జరుగుతాయి. ప్రస్తుతం సంఘం సభ్యుల సంఖ్య 7540 కి చేరింది. రైతుల జమ డబ్బులు రూ.49 కోట్లకు చేరాయి. సంఘం మొత్తం ఆస్తుల విలువ రూ.350 కోట్లకు చేరింది. ఈ ఒక్క ఏడాదే రూ.407 కోట్ల వ్యాపారం చేస్తే ఏడు కోట్ల రూపాయల లాభాలు వచ్చాయట. అందులోంచి రూ. నాలుగు కోట్లను సభ్యులందరికీ బోనస్ గా పంచారట.

**ఏమేం చేస్తుంటారు..**

భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా విడిగా సంక్షేమ నిధినీ పెట్టుకుంది ఈ రైతు సంఘం. తీవ్రమైన సమస్యలు వస్తే, సభ్యులకు సంక్షేమ డిపాజిట్ల ఆధారంగా ఎక్కువ వడ్డీ డబ్బుల ఇస్తూ, తీసుకున్న అప్పు మాఫీ చేస్తుంది. 65 ఏళ్లు నిండిన రైతులకు నెలకు రూ.1000 పింఛన్ ఇస్తోంది. సభ్యులతోపాటు వారి భాగస్వామికీ ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు చేయిస్తుంది. ఇంకా విద్యార్థులకు ఏటా రూ.15 వేలు నగదు ప్రోత్సాహకాలు ఇస్తోంది. వ్యవసాయానికే కాకుండా పిల్లల చదువులకూ, వైద్యానికి, శుభకార్యాలకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తోంది. చుట్టుపక్కల గ్రామాల విద్యార్థులందరూ ఉచితంగా చదువుకునేలా సొంత నిధులతో ఏకేవీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాలల్నీ ఏర్పాటు చేసింది. రెండున్నర ఏళ్లకోసారి పాలక సంఘాన్ని ఎంపిక చేసుకుంటూ, ప్రత్యేకంగా ఉద్యోగుల్ని నియమించుకుని కార్యకలాపాలన్నింటినీ సజావుగా జరుపుకుంటోందీ రైతు సంఘం. ✪

# వికసిత భారత్ లక్ష్యంగా జాతీయ సహకార విధానం 2025

**వ్యవసాయం, పాడి, మత్స్య పరిశ్రమలు, జౌళి, రుణకల్పన, గృహ నిర్మాణం, మార్కెటింగ్ రంగాల్లో మన దేశంలో సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. దేశాభివృద్ధిలో ఇవి క్రియాశీలక భాగస్వాములనే వాస్తవాన్ని గుర్తించిన క్రమంలో ఇటీవల జాతీయ సహకార విధానాన్ని (ఎన్.సి.పి - 2025) ప్రకటించారు.**

**-డాక్టర్ ఎస్. శ్యామ్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్, హైదరాబాద్**

సురేష్ ప్రభు నాయకత్వంలోని 48 మంది సభ్యుల జాతీయ కమిటీ దేశవ్యాప్తంగా ఈ రంగంలోని కీలక భాగస్వాములతో పలు సమావేశాలు నిర్వహించి జాతీయ సహకార విధానాన్ని రూపొందించింది. సభ్యుల చురుకైన భాగస్వామ్యం, సమర్థ నిర్వహణ, పారదర్శకత, అధునాతన సాంకేతికతలతో స్థానిక ఆర్థిక కార్యకలాపాలకు ఊతమిచ్చేలా సహకార సంఘాలను తీర్చిదిద్దటమే ఈ విధానం లక్ష్యం.

**ఆరు మూలస్తంభాలు**

ఎన్.సి.పి 2025 ఆరు వ్యూహాత్మక మూలస్తంభాల ఆధారంగా పనిచేస్తుంది. అవి.. చట్టపరమైన సంస్కరణలు, డిజిటల్ నిర్వహణ, తగిన నిధులతో సహకార విధానానికి బలమైన పునాదులు నిర్మించటంబీ ఆధునిక సాంకేతికతలు, నిపుణుల సాయంతో సహకార సంఘాలను భావి అవసరాలకు తగినట్లుగా తీర్చిదిద్దటంబీ మహిళలు, యువత, దళిత, బలహీన వర్గాలను కలుపుకొనిపోయే సంఘాలుగా రూపొందించటంబీ హరిత ఇంధనాలు, ఆరోగ్యం, ఐటీ వంటి కొత్త రంగాలకు సైతం సహకార సంఘాలను విస్తరించటంబీ నైపుణ్య, నాయకత్వ శిక్షణ ద్వారా యువతరాన్ని భావి సహకారోద్యమ సారథులుగా తయారుచేయటం. ఈ ఆరు లక్ష్యాలను సాధించేందుకు పలు చర్యలు తీసుకుంటారు. సహకార సంఘాలు స్వయంప్రతిపత్తితో పనిచేసేలా సక్రమంగా ఎన్నికలు నిర్వహిస్తారు. దీనికోసం రాష్ట్రాలలో ఆదర్శ సహకార చట్టాలను తీసుకొస్తారు. రిజిస్ట్రార్ కార్యాలయాలను డిజిటలీకరిస్తారు. జాతీయ సహకార డేటాబేస్‌కు స్థానిక సమాచారాన్ని జోడించేలా రాష్ట్రాలను ప్రోత్సహిస్తారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బహుళ ప్రయోజనకర సంఘాలుగా తీర్చిదిద్దుతారు. గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు బాధ్యతను వీటికి అప్పగిస్తారు. కార్పొరేట్ సంస్థలకిచ్చే పన్ను రాయితీలు, ప్రోత్సాహకాలను సహకార సంఘాలకూ ఇస్తారు. ఖాయిలా పడ్డ సంఘాల పునరుద్ధరణకు ప్రత్యేక సంస్థాగత ఏర్పాట్లు చేస్తారు.

మహిళలు, యువత, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన వర్గాలకు ప్రాధాన్యం

ప్రతి జిల్లాలో సమ్మిళిత అభివృద్ధి, నవీకరణలకు ప్రతీకలుగా నిలిచే ఆదర్శ సహకార గ్రామాలను తీర్చిదిద్దాలన్నది సంకల్పం. భౌగోళిక విశిష్ట గుర్తింపు కలిగిన తేనె, కాఫీ, పట్టు, మసాలా ద్రవ్యాల ఆర్థిక క్లస్టర్లను నెలకొల్పుతారు. సహకార రంగ




ఉత్పత్తులను భారత్ బ్రాండ్ కింద మార్కెట్ చేయటమూ ఇందులో భాగమే. ఒక జిల్లా - ఒక ఉత్పత్తి పథకం, ఎగుమతి కేంద్రాలుగా జిల్లాల అభివృద్ధి పథకం అమలులో సహకార సంఘాలకూ భాగస్వామ్యం దక్కనుంది.

సహకార సంఘాల సభ్యుల సంఖ్యను మరో 20 కోట్ల మేర విస్తరించి, జీడీపీలో ఈ రంగం వాటాను మూడింతలు చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యం. అందుకోసం సబ్సిడీలు, ఇతర ప్రయోజనాలనూ అందించాలని సంకల్పించారు.

ప్రభుత్వ ఈ-మార్కెట్, ఓపెన్ నెట్ వర్క్ ఫర్ డిజిటల్ కామర్స్ (ఓ.ఎన్.డి.సి)లో పాల్గొనటం ద్వారా సహకార సంఘాలు తమ వస్తువులకు గిరాకీ పెంచుకోగలుగుతాయి. ఈ సంఘాల కోసం జాతీయ స్థాయిలో బోధన, శిక్షణ సంస్థ ఏర్పాటవుతోంది. గ్రామీణ వ్యాపార సంస్థల కోసం ఇంక్యుబేటర్లు రానున్నాయి. సంఘాల మధ్య పోటీ పెంచేందుకు రేటింగ్ లు ఇస్తారు.

ఫెలోషిప్‌లు, పరిశోధనలకు ప్రోత్సాహం, ప్రాంతీయ భాషల్లో అభ్యసన కేంద్రాల ఏర్పాటు ద్వారా సహకా రోద్యమాన్ని కొత్త మలుపు తిప్పాలనేది ఎన్.సి.పి ఆశయం.

మహిళలు, యువత, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన వర్గాలు, దివ్యాంగులను సహకార ఉద్యమంలో మమేకం చేయటానికి ప్రత్యేక కృషి జరగాల్సి ఉంది. చేనేత, అటవీ ఉత్పత్తులు, మత్స్య పరిశ్రమ, గిరిజన ఉత్పత్తులకు ప్రత్యేక సహకార సంఘాలను ఏర్పాటు చేయనుండటం మంచి

**కమిటీలు, మైలురాళ్లు:**

1965 – వీఎల్ మెహతా కమిటీ
1965 –మీర్ధా కమిటీ,
1967 – ఆర్.కె హజారి కమిటీ
1971 – ఆర్.కె తర్వార్ కమిటీ,
1971 – సి.ఆర్ రాజగోపాలన్ కమిటీ
1971 – బి.వెంకటప్పయ్య కమిటీ
1973 – ఎస్.టి రాజా కమిటీ
1975 – బ్రహ్మప్రకాష్ కమిటీ
1980లు – బి.కె సేథీ కమిటీ
1991 –బి.కె దంత్ వాలా కమిటీ
1995 – ఆంధ్రప్రదేశ్ లో 'మ్యాక్స్' చట్టం
2001 – వైద్యనాథన్ కమిటీ
2004 – ప్రొ.ఎ.వైద్యనాథన్ కమిటీ
2009 –హైపవర్డ్ కమిటీ
2011 – 97వ రాజ్యాంగ సవరణ
2021 –యూనియన్ సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటు

– వి.రమణయ్య

ఆలోచనే. పాఠశాల సిలబస్ లో సహకార సంఘాల సమాచారం చేర్చి, బాల్యం నుంచే సహకారోద్యమ ప్రాధాన్యాన్ని వివరించటం మరో కీలకాంశం.

సారథ్య సంఘం ఏర్పాటు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలను బహుళ వ్యాపారాలు చేపట్టేలా ప్రోత్సహించటం ఎన్.సి.పి లక్ష్యాల్లో ఒకటి. ప్రధానమంత్రి జన్ ఔషధి దుకాణాలు, వినియోగదారుల సేవా కేంద్రాలు, వంటగ్యాస్ పంపిణీ, పెట్రోలు బంకులు, గ్రామీణ తాగునీటి సరఫరా నిర్వహణను వీటికి అప్పగిస్తారు. పట్టణ సహకార సంఘాలు విద్య, వైద్యం, ఐటీ సేవలు, మైక్రో ఇన్సూరెన్స్ రంగాల్లో ప్రవేశించేలా ఏర్పాట్లు చేస్తారు. బయోగ్యాస్, పునరుత్పాదక ఇంధనాల ఉత్పత్తి, ఆగ్రో ఫారెస్ట్రీ విస్తరణ, ఐఓటీ, బ్లాక్ చెయిన్ ఆధారిత బట్వాడా రంగాల్లోనూ సహకార సంఘాలు భాగస్వాములు కానున్నాయి. యువతను సహకారోద్యమ భావి సారథులుగా తీర్చిదిద్దేందుకు పాఠశాలల్లో, కళాశాలల్లో, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేపడతారు. తాజా జాతీయ సహకార విధానం అమలుకు యూనియన్ సహకార మంత్రి ఆధ్వర్యంలో జాతీయ సారథ్య సంఘం ఏర్పాటవుతుంది. సహకార కార్యదర్శి నేతృత్వంలో విధానాల అమలు, పర్యవేక్షణ కమిటీని నియమిస్తారు. నాబార్డ్, ఎన్.డి.డి.బి వంటి జాతీయ సంస్థలకు భాగస్వామ్యం కల్పిస్తారు. ఎన్.సి.పి 2025 కేవలం విధానపత్రంగా మిగిలిపోకూడదు. ప్రజాకేంద్రిత అభివృద్ధి నమూనాలా పనిచేయాలి. భాగస్వాములందరూ తోడ్పాటు అందిస్తే, ఆర్థికాభివృద్ధికి సహకార రంగం చోదక శక్తిగా మారుతుంది. వికసిత భారత్ లక్ష్య సాకారానికి తోడ్పడుతుంది.

**(కర్టెసీ: ఈనాడు)**

## భారతదేశంలో సహకార ఉద్యమం, పరిణామక్రమం

'అందరి కోసం ఒక్కరు, ఒక్కరి కోసం అందరూ' (ఈచ్ ఫర్ ఆల్ అండ్ ఆల్ ఫర్ ఈచ్) అనే నినాదంతో 20వ శతాబ్దంలో భారతదేశంలో సహకార ఉద్యమం ప్రారంభమైంది. గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రుణ లభ్యతను పెంచేందుకు, గ్రామీణ జనాభాను శక్తిమంతం చేసేందుకు, మధ్యవర్తుల రూపంలో ఉన్న దోపిడీని నియంత్రించేందుకు దీన్ని రూపొందించారు. కాలక్రమంలో సహకార సంస్థలు వ్యవసాయ రుణాలు, పాల ఉత్పత్తులు, గ్రామీణ మార్కెటింగ్ లో కీలక పాత్ర పోషించాయి.

☞ 1904లో భారతదేశంలో మొదటి సహకార క్రెడిట్ సొసైటీల చట్టాన్ని ఆమోదించారు.

☞1912లో అన్ని సహకార సంఘాలకు వర్తించే విధంగా మరో చట్టాన్ని తెచ్చారు.

☞1919లో మాంటేగ్ చెమ్స్ ఫర్డ్ సంస్కరణల ఫలితంగా సహకారం ఒక ప్రాంతీయ అంశంగా మారింది.

☞ 1915లో మెక్లగాన్ కమిటీ

☞ 1945లో సరయ్యా కమిటీ

**స్వాతంత్ర్యానంతరం**

☞ **మిశ్రమ ఆర్థిక వ్యవస్థ**: దేశంలో ప్రభుత్వ, ప్రయివేటు, సహకార రంగాలతో కూడిన మిశ్రమ ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికాబద్ధమైన ఆర్థిక విధానాన్ని అవలంబించారు.

☞ **ప్రణాళికా సంఘం**: సహకార సంస్థలు పంచవర్ష ప్రణాళికల్లో భాగమయ్యాయి. సహకార సంస్థలను ప్రజాస్వామ్యానికి అవసరమైన మూడు స్తంభాల్లో ఒకటిగా ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ అభివర్ణించారు.

☞**జాతీయ సహకారం కోసం కమిటీ ఏర్పాటు**: 1954లో గ్రామీణ క్రెడిట్ సర్వే కమిటీ అన్ని స్థాయిల్లో సహకార సంఘాల్లో రాష్ట్రాల భాగస్వామ్యాన్ని సిఫార్సు చేసింది.

☞ **జాతీయ సహకార విధానం**: 1958లో జాతీయ అభివృద్ధి మండలి (ఎన్.డి.సి) సహకార సంస్థలపై జాతీయ విధానాన్ని సిఫార్సు చేసింది. సిబ్బందికి శిక్షణ, సహకార మార్కెటింగ్ సొసైటీలను సూచించింది.

☞ 1984లో బహుళ రాష్ట్ర సహకార సంఘాల చట్టం రూపుదిద్దుకుంది.

☞ 2002: భారత ప్రభుత్వం 2002లో సహకార సంఘాలపై జాతీయ విధానాన్ని ప్రకటించింది.

☞ 2021: 2021లో యూనియన్ సహకార మంత్రిత్వ శాఖ ఏర్పాటైంది.

# శతవత్సరాల దీప్తి! వైకోమ్ సత్యాగ్రహ స్ఫూర్తి!

## నేటి తరానికి కొన్ని పాఠాలు!

-డి. సోమసుందర్-

గత ఏడాది కాలంగా దేశవ్యాప్తంగా వైకోమ్ సత్యాగ్రహ శత వార్షికోత్సవాలు జరుగుతున్నాయి. అంటరాని తనంపై, కులవివక్షపై వందేళ్లక్రితం కేరళ సమాజం చేసిన తిరుగుబాటే వైకోమ్ సత్యాగ్రహం.

తిరువాన్కూరు సంస్థానంలోని వైకోమ్ పట్టణంలో 1924 మార్చి 30వ తేదీన ప్రారంభమైన ఈ సత్యాగ్రహం 1925 నవంబర్ 23 వరకూ 604 రోజులపాటు కొనసాగింది.

అనంతరకాలంలో అంటరానితనానికి, కులవివక్షకు వ్యతి రేకంగా దేశవ్యాప్తంగా సాగిన పోరాటాలకు వైకోమ్ సత్యాగ్రహం గొప్ప స్ఫూర్తినిచ్చింది.

లక్ష్యాలు, మార్గాల గురించి మనదేశంలో కొనసాగే ఎడతెగని చర్చలో ఎదురయ్యే సవాళ్లకు వైకోమ్ సత్యాగ్రహంలో సమాధానాలు లభిస్తాయి. నూరేళ్ళ అనంతరం కూడా మన సమాజానికి మార్గదర్శనం చేయగలిగిన శక్తి వైకోమ్ సత్యాగ్రహంలో ఇమిడి ఉందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

వైకోమ్ పట్టణం నడిబొడ్డున పురాతనకాలం నాటి శ్రీ మహాదేవ ఆలయం ఉంది. ఆలయం చుట్టూ ఉన్న నాలుగు పబ్లిక్ రోడ్లలో అంటరాని కులాలకూ, బడుగు బలహీన, నిమ్న కులాలకు చెం దిన ప్రజల ప్రవేశాన్ని నిరోధిస్తూ సంస్థాన ప్రభుత్వం నిషేధాన్ని అమలుచేసింది. ఈ నిషేధాన్ని ఎత్తివేయాలన్న డిమాండ్ తో వైకోమ్ సత్యాగ్రహం ప్రారంభం అయ్యింది. పబ్లిక్ రహ దారులలో ప్రవేశాన్ని నిరోధించడంతో రోజువారీ రాకపోకల కోసం ప్రజలు రెండు మూడు మైళ్లు అదనంగా నడవాల్సి వచ్చేది. హిందూ మతంలోని బ్రాహ్మణేతర కులాల ప్రజలకు వర్తింప చేసిన ఈ ఆంక్షలు ముస్లిం, క్రైస్తవ మతాలకు చెందిన విశ్వాసులకు వర్తింప చేయలేదు. కొత్తగా మతం మార్చు కున్న వారికి సైతం రాకపోకలకు అనుమతి ఇవ్వలేదు.కేరళలో బలం గా పాతుకుపోయిన అగ్రకుల ఛాందసత్వానికి వ్యతిరేకంగా ప్రముఖతత్వవేత్త, ఆధ్యాత్మిక గురువు, సంఘసంస్కర్త, శ్రీ నారాయణగురు అప్పటికే పెద్దఎత్తున సంస్కరణ ఉద్యమాన్ని చేపట్టారు.

ప్రజల్లో ఆధ్యాత్మిక జ్ఞానోదయం కలగాలని, సామాజిక



సమానత్వం ఉండాలని శ్రీ నారాయణగురు ప్రబోధించారు. ఒకే కులం, ఒకే మతం, మానవత్వమే అసలైన దేవుడు అంటూ ఆయన చేసిన బోధనలు కేరళ సమాజాన్ని అమితంగా ప్రభావితం చేశాయి.

శ్రీ నారాయణగురు ఒకసారి వైకోమ్‌లోని శ్రీ మహాదేవ ఆలయం ముందునుండి వెళ్తుండగా అక్కడి ఛాందసవాదులు ఆయన్ను వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. ఈ చర్య బ్రాహ్మణేతర కులాల ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలను రగిల్చింది. బ్రాహ్మణేతర కులాల్లో విద్యాపరంగా, సామాజికంగా కొంత ముందంజలో ఉన్న ఎళవ కులస్తులు కుల వివక్షకు , అంటరానితనానికి వ్యతిరేకంగా గొంతు విప్పారు.

కేరళలో స్వాతంత్ర్యోద్యమంలో చురుగ్గా పాల్గొంటున్న టి.కే. మాధవన్, కే.పి.కేశవమీనన్ , కే.కేలప్పన్ , జోసెఫ్ జార్జ్, ఇ.వి. రామస్వామి, మన్నత్ పద్మనాభన్, కృష్ణస్వామి అయ్యర్ వంటి వారు అంటరానితనానికి వ్యతిరేకంగా గట్టిగా పోరాడుతున్నారు. కులవివక్ష లేకుండా అన్ని కులాలవారికీ హిందూ ఆలయాలలోకి ప్రవేశం కల్పించాలన్న ఉద్యమం మెల్లిగా ఊపు అందు కుంటున్నది.

**ఛాందస సమాజంలో**

**ప్రగతిశీల పాలనా సంస్కరణలు!**

నిజానికి అలనాటి స్వదేశీ సంస్థానాల్లో ఎంతో కొంత

ప్రగతిశీల సంస్కరణలు చేపట్టింది తిరువాన్కూర్ సంస్థానమే అని చెప్పాలి. బస్సు, రైలు రవాణా సేవలు, తపాలా సేవలు, సార్వత్రిక విద్య, వైద్య సేవలు ప్రవేశపెట్టింది. కులమతాలకు అతీతంగా విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలను స్థాపించింది. దేశంలో మొట్టమొదటిసారిగా చట్టసభను ఏర్పాటు చేసింది తిరువాన్కూర్ సంస్థానమే. ఆ తర్వాత ఎన్నికైన ప్రతినిధులకు కూడా చట్టసభలో అవకాశం ఇచ్చింది కూడా తిరువాన్కూర్ సంస్థానమే.

అప్పట్లో శ్రీమూలం పాపులర్ అసెంబ్లీ పేరిట ప్రజాప్రతినిధుల సభ ఒకటి ఉండేది. శ్రీ నారాయణ గురు భావ జాలంతో పనిచేసే శ్రీ నారాయణ ధర్మపరిపాలనా యోగం (ఎస్.ఎన్. డి.పి.) తరపున ప్రతినిధిగా టి.కే. మాధవన్ అసెంబ్లీ సభ్యునిగా ఉన్నారు. ఆయన "దేశాభిమాని" పత్రికను ప్రచురిం చేవారు.

అంటరానితనానికీ, కులవివక్షకు వ్యతిరేకంగా వైకోమ్ ఆలయం చుట్టూ అవర్ణుల రాకపోకలపై ఉన్న ఆంక్షలను ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ 1917 డిసెంబర్‌లో ఆయన సంపాదకీయం రాశారు. ఆలయ ప్రవేశానికి అన్నికులాలకు అవకాశం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదే విషయమై 46 మంది అసెంబ్లీ సభ్యుల సంతకాలతో 1918లో ఆయన ఒక వినతిపత్రాన్ని సంస్థాన ప్రభుత్వానికి అందచేశారు. ఐదువేల మంది ఎళవ కులస్తులు 1919 లో సమావేశమై అన్ని కులాల వారికి ఆలయ ప్రవేశ అవకాశం కల్పించాలని కోరుతూ ఉద్యమానికి పిలుపు ఇచ్చారు. శ్రీమూలం పాపులర్ అసెంబ్లీలో టి.కే. మాధవన్ పలుసార్లు చర్చ లేవనెత్తడమే కాకుండా తీర్మానాలను కూడా ప్రవేశపెట్టారు. సంస్థాన రాజరిక ప్రభుత్వం అందుకు సిద్ధంగా లేదు. వ్యక్తిగతంగా సంస్కరణకు తాము అనుకూలమేనని సంస్థానాధీశుడు మూలం తిరునాళ్ రామవర్మ , ఆయన మరణానంతరం రీజెంట్‌గా బాధ్యతలు చేపట్టిన పూరదం తిరునాళ్ సేతు లక్ష్మీబాయి చెబుతూ వచ్చారు. కానీ బ్రాహ్మణ అగ్రవర్ణ ఛాందసత్వ ఒత్తిడికి రాజరిక ప్రభుత్వం తలొగ్గి చర్యలు తీసుకోవడానికి నిరాకరించింది. దివాన్ బహుదూర్ టి.రాఘవయ్య స్వయంగా ఛాందసవాది. ఆయన ప్రభావం కూడా సంస్థానాధీశునిపై గట్టిగా పనిచేసింది. ఎంతోకొంత ప్రగతిశీల పాలనాసంస్కరణలు ప్రారంభించిన తిరువాన్కూర్ లో మత,కుల ఛాందసవాదాలు, మూఢ నమ్మకాలు బలంగా కొన సాగడం ఒక వైచిత్రి.

1920 నవంబరులో తొలిసారిగా కేరళ కాంగ్రెస్ నాయకులు వైకోమ్ ఆలయం వద్ద నిషేధాజ్ఞలను ఉల్లంఘిం చారు. పోలీసులు రోడ్లపై ఏర్పాటు చేసిన మార్గవరోధాలను దాటి ముందుకు వెళ్ళారు. వారిని పోలీసులు అరెస్టు చేశారు.

**గాంధీజీ ప్రవేశం!**

టి.కే. మాధవన్ 1921 సెప్టెంబర్ 24న తిరునల్వేలిలో గాంధీజీని కలిసారు. దేశాభిమాని పత్రికకు గాంధీజీ ఇచ్చిన ఇంటర్వ్యూలో "సత్యాగ్రహానికి కేరళ సమాజం సన్నద్ధంగా ఉంది, ఆలయ ప్రవేశ ఉద్యమం ప్రారంభించడానికి తరుణం ఆసన్నమైంది" అన్నారు. ఉద్యమానికి తన పూర్తి మద్దతు ఇవ్వటమే కాకుండా కాంగ్రెస్ కమిటీలు, నాయకులు అందులో తప్పనిసరిగా పాల్గొనాలని స్పష్టంగా చెప్పారు. ఆ తర్వాత అక్టోబర్ 6 వ తేదీ నాటి యంగ్ ఇండియాలో "హిందూయిజం" శీర్షికన గాంధీజీ రాసిన వ్యాసంలో "ఇదో వంతు ప్రజల్ని అంట రానితనం పేరుతో ఆలయాలలోకి రానియ్యకపోవడం హిందూ యిజం కాదు, తోటి మానవులను దూరం పెట్టడం పాపం, హిందూమతానికి అదొక శాపం, అందరికీ సమానత్వం, స్వాతంత్ర్యం ఇవ్వని సమాజం స్వరాజ్యం సాధించలేదు, స్వరాజ్యం అంటే అంటరానితనాన్ని పూర్తిగా రద్దు చేయడమే" అనిగాంధీజీ రాశారు."ప్రస్తుత శంకరాచార్యులు, శాస్త్రులు, వారు ఎంత పెద్దవారైనా, ఎంతటి జ్ఞానులైనా, సనాతన ధర్మం పేరుతో జరుగుతున్న పాపాలను వారు అనుమతిస్తే, వారు తప్పు చేస్తున్నారనీ, హిందూమతానికి ఈ పాపాలకు సంబంధం లేదని మనం చెప్పాలి" అని గాంధీజీ రాశారు.

అంటరానితనం ఒక పాపమనీ, దాన్ని రద్దు చేయాల్సిన బాధ్యత హిందూ అగ్రవర్ణాల వారిదేననీ స్పష్టం చేస్తూ ఆయన మలయాళీ అగ్రవర్ణాలకు గట్టి సందేశం పంపించారు.

1923 డిసెంబర్ 28 నుండి 1924 జనవరి 1 వరకు కాకినాడలో జరిగిన అఖిలభారత కాంగ్రెస్ మహాసభల్లో అంటరానితనాన్ని నిర్మూలించే ఉద్యమాన్ని, అవర్ణుల ఆలయ ప్రవేశ ఉద్యమాన్ని దేశవ్యాప్తంగా కాంగ్రెస్ చేపట్టా లంటూ టి.కే. మాధవన్ ఒక తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. తిరువాన్కూర్ సంస్థానంలో కులవివక్ష అమలు అవుతున్న తీరును, అంటరానితనంలోని అమానుషత్వాన్ని, ఛాందస వాదుల హింసా ప్రవృత్తిని ఆయన సభలో విస్తారంగా వివరించారు. చంపారన్ ఉద్యమకాలం నుండి అస్పృశ్యతను ఒక ప్రధాన సమస్యగా గాంధీజీ తీసుకున్నారు. అవకాశం ఉన్న ప్రతీ ఆలయం వద్ద, స్థానిక ప్రజలు సంసిద్ధంగా ఉంటే ఆలయ ప్రవేశ ఉద్యమం ప్రారంభించాలని ఆయన ప్రబోధిస్తూనే వచ్చారు. ఆమేరకు కాంగ్రెస్ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ వచ్చారు.

కాకినాడ కాంగ్రెస్ మహాసభ ఆమోదం పొందిన కేరళ ప్రతినిధులు వైకోమ్ సత్యాగ్రహం గురించిన ప్రచారం ప్రారం

భించారు. తిరువాన్కూర్ సంస్థానంలో ప్రజాభిప్రాయాన్ని కూడ గట్టడానికి పత్రికలు , కరపత్రాలు, వినియోగించారు. జాతాలు, సభలు సమావేశాలు, నిర్వహించారు.

**గాంధీజీ నిరంతర మార్గదర్శనం!**

సత్యాగ్రహ సన్నాహాలు జరుగుతున్న కాలంనుండి , సత్యాగ్రహం ప్రారంభమై ముగిసేవరకూ గాంధీజీ నిరంతర మార్గదర్శనం చేస్తూనే వచ్చారు. సత్యాగ్రహ నిర్వాహకులతో నిత్య సంబంధాలు నెరపారు.

ఆయన ఎక్కడున్నా వైకోమ్ సత్యాగ్రహంలో ఇమిడి ఉన్న మత, సామాజిక, రాజకీయ అంశాలను ప్రస్తావిస్తూ మాట్లాడుతూ వచ్చారు. యంగ్ ఇండియా, నవజీవన్, పత్రికల్లో నిరంతరం విస్తృతంగా రాస్తూ వచ్చారు.గాంధీజీ సూచన మేరకు వైకోమ్ సత్యాగ్రహులు ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడం కోసం రెండు సుదీర్ఘ పాదయాత్రలను నిర్వహించారు. హిందూ మతంలోని అగ్రవర్ణాలు ఈ యాత్రలకు సారథ్యం వహించాలని గాంధీజీ గట్టిగా చెప్పారు. అంటరానితనం, కొన్ని కులాలకు ఆలయ ప్రవేశ నిరాకరణ హిందూ మతంలోని అంతరంగిక సమస్యగా గాంధీజీ అభిప్రాయపడ్డారు. ఛాందసవాదుల హృదయ పరివర్తన జరగాలంటే హిందూ సవర్ణులు సత్యాగ్రహంలో పాల్గొనాలని, హిందూమతంలో ఉన్న మచ్చను తొలగించే బాధ్యత హిందూ మతంలో సంస్కరణ వాదులైన సవర్ణులదే" అంటూ గాంధీజీ పదేపదే స్పష్టం చేస్తూ వచ్చారు.

"సత్యాగ్రహం అనే పోరాట ఆయుధానికి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. ఆలయం చుట్టూ ఏర్పాటు చేసిన మార్గావరోధాల వద్ద నిలబడి నినాదాలు చేయడం, భైరా యించడం, నూలువడకడం, రాట్నం తిప్పడం వంటి పనులు చేపట్టాలి. ఎట్టి పరిస్థితుల్లోనూ కంచెలు దాటి లోనికి వెళ్లకూడదు. పోలీసులు అరెస్టు చేస్తే జైలుకు వెళ్లాలి. ఛాందసవాదులు గానీ, పోలీసులు గానీ దాడి చేసినా, లాఠీచార్జి చేసినా ప్రతిఘటించకూడదు. హింసను భరించాలి తప్ప ప్రతిహింసకు పాల్పడకూడదు. బాధితులుగా సానుభూతి పొందడం ద్వారా మొత్తం కుటుంబాల్లో ముఖ్యంగా ఛాందసవాదుల కుటుంబాల్లో దీనిపై చర్చ జరగాలి. బలమైన ప్రజాభిప్రాయం రూపొందాలి. ప్రజాభిప్రాయాన్ని ప్రభుత్వం ఆమోదించేటట్లు ఒత్తిడి పెంచాలి" అన్నారు గాంధీజీ.

1924 మార్చి 30న వైకోమ్ సత్యాగ్రహం ఆరంభం అయ్యింది.ప్రతీరోజూ సత్యాగ్రహుల అరెస్టులు కొనసాగాయి. నాయకత్వం మొత్తం చెరసాలకు వెళ్ళింది. దాంతో సత్యాగ్రహం చేసే వలం టీర్లకు కొరత ఏర్పడింది. సత్యాగ్రహంలో పాల్గొనడానికి దేశవ్యాప్తంగా వలంటీర్లను సమీకరించాలన్న కే.పీ. కేశవ మీనన్ సూచనకు గాంధీజీ సమ్మతించలేదు. ఇతర రాష్ట్రాల నుండి వచ్చినవారి భాగస్వామ్యంతో కేరళ ప్రజల మనోభావాలను ప్రభావితం చేయలేమని గాంధీజీ గట్టిగా అభిప్రాయపడ్డారు. సత్యాగ్రహ ఉద్యమాన్ని కొనసాగించడానికి వీలుగా వైకోమ్ వెళ్ళాలని మద్రాసు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు ఇ.వి. రామ స్వామి (పెరియార్)కి సి.రాజగోపాలాచారి బాధ్యత ఇచ్చారు. పెరియార్ రావడంతో సత్యాగ్రహులలో కొంత ఊపు వచ్చింది. అయితే ఆయన వచ్చిన వెంటనే కంచెలు దాటడానికి ప్రయత్నించడంతో పోలీసులు లాఠీచార్జి చేసి ఆయన్ను అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఇలాంటి ఘటనలను ముందుగానే ఊహించిన గాంధీజీ సత్యాగ్రహం నిలకడగా కొనసాగించడంపై దృష్టి సారించాలని, సత్యాగ్రహ నియమాలను ఖచ్చితంగా పాటించడంపైనే ఉద్యమ విజయం ఆధారపడి ఉంటుందని గట్టిగా చెబుతూ వచ్చారు. ఆ తర్వాత ప్రభుత్వం తన వైఖరిని మార్చుకుని సత్యాగ్రహులను అరెస్టు చేయడం మానివేసింది. పెరియార్ విడుదల అయ్యాక మరోసారి ఉద్యమంలోకి వచ్చేం దుకు ప్రయత్నించగా ఆయన్ను సంస్థానం సరిహద్దులోనే అరెస్ట్ చేశారు. ఆయనకు ఈ సారి కఠిన కారాగార శిక్ష పడింది. వైకోమ్ సత్యాగ్రహం సందర్భంగా రెండుసార్లు అరెస్టు అయిన పెరియార్ "వైకోమ్ వీరుడు" అనే పేరు పొందారు.

1924 మే, జూన్ ,జులై నెలల్లో సత్యాగ్రహం నిలకడగా కొనసాగింది. ఆగస్ట్ 7 వ తేదీన సంస్థానాధీశుడు మూలం తిరునాళ్ రామవర్మ మృతి చెందారు. రాజవంశం సంతాప దినాల్లో ఉన్నందున సత్యాగ్రహం నిలిపివేస్తూ కాంగ్రెస్ నిర్ణయం తీసుకున్నది. ఆ తర్వాత మహరాజా వారసత్వం యువరాజుకు లభించినా, ఆయన బాలుడుగా ఉండటంతో మహారాణి పూరదం తిరునాళ్ సేతు లక్ష్మీబాయి సంస్థానం రీజెంట్ గా బాధ్యతలు చేపట్టారు. సంతాప దినాలు ముగిశాక మరోసారి సత్యాగ్రహం మొదలయ్యింది.

వైకోమ్‌లోని శ్రీ నారాయణగురు ఆశ్రమ పాఠశాల సత్యా గ్రహులకు విడిదిగా వినియోగపడింది. అరెస్టులు లేకపో వడంతో శిబిరం వలంటీర్లతో కళకళ లాడింది. వారికి విరాళాలు అందాయి. ఆహార పదార్థాలు సరఫరా అయ్యాయి. పంజాబ్ నుండి వచ్చిన అకాలీలు సత్యాగ్రహుల కోసం ఉచిత లంగర్ ను తెరిచారు.

ముస్లిములు , క్రైస్తవులు సత్యాగ్రహులను పంపించడానికి ఆర్థిక సాయం చేయడానికి ముందుకు వచ్చారు. 1924 అక్టోబర్ లో వైకోమ్ నుండి త్రివేండ్రం వరకూ ఒక పాదయాత్ర, దక్షిణాది నుండి త్రివేండ్రం వరకూ మరోపాదయాత్ర జరపాలని , దీన్నొక రాష్ట్రవ్యాప్త ఉద్యమంగా మార్చాలని కాంగ్రెస్ నిర్ణయించింది. వంద లాది మైళ్ల పాటు కొనసాగిన పాదయాత్ర వైకోమ్

సత్యాగ్రహానికి ప్రజామోదాన్ని కూడగట్టింది. ఈ సందర్భం గా పాదయాత్రీకులు తమ డిమాండ్ల పత్రంపై 25 వేల సంతకాలు సేకరించారు.

అక్టోబర్ లో శ్రీ మూలం పాపులర్ అసెంబ్లీలో ఆలయ ప్రవేశం కోసం తీర్మానం మరోసారి చర్చకు వచ్చింది. ఒకవైపున వైకోమ్ లో సత్యాగ్రహం కొనసాగుతుండగా, మరో వైపున పాదయాత్ర కొనసాగింది. అదే సమయంలో చట్టసభలో కూడా చర్చకు అవకాశం వచ్చింది.

అయితే1925 ఫిబ్రవరిలో జరిగిన ఓటింగ్ లో తీర్మానానికి మద్దతుగా 21 ఓట్లు రాగా, వ్యతిరేకంగా 22 ఓట్లు పడ్డాయి. దాంతో ఉద్యమకారుల డిమాండ్లకు ప్రభుత్వ ఆమోదం లభించలేదు. ప్రభుత్వం నామినేట్ చేసిన అధికారులు తీర్మానానికి వ్యతిరేకంగా ఓట్ చేయడం వల్లనే తీర్మానం వీగిపోయింది. ప్రభుత్వం తటస్థంగా ఉండకుండా ఛాందస వర్గాలకు మద్దతు ఇచ్చిందని ఓటింగు తేటతెల్లం చేసింది.

కాంగ్రెస్ నాయకుల విజ్ఞప్తి మేరకు గాంధీజీ 1925 మార్చిలో కేరళ పర్యటనకు వచ్చి పది రోజులపాటు పలు ప్రాంతాలు సందర్శించారు. మార్చి 9, 10 తేదీల్లో గాంధీజీ వైకోమ్‌లో ఉన్నారు. ఆయన 10వ తేదీన శ్రీ మహాదేవ ఆలయ ప్రధాన సంరక్షకుడు ఇడందురితి నంబూద్రి ఇం టికి సంప్రదింపుల కోసం వెళ్లారు. ఆయనవెంట సి.రాజ గోపాలాచారి, మహాదేవ దేశాయ్, ఇ.వి.రామస్వామి, కృష్ణ స్వామి అయ్యర్, రామదాసు గాంధీ వంటివారు ఉన్నారు. “గాంధీజీ వైశ్య కులస్తుడు, అవర్ణులతో తిరిగి ఆయన మైలపడ్డారు, సత్యాగ్రహులంతా అవర్ణులే , గాంధీజీ సహా వారెవ్వరూ నా ఇంటిలోనికి రావడానికి వీలులేదు, నా ఇంటిలో ఉన్న దైవ మందిరం మైలపడటం నాకు ఇష్టంలేదు” అంటూ నంబూద్రి స్పష్టం చేశారు. నంబూద్రి ఇంటి ఆవరణ బయట రోడ్డుపై గాంధీజీ బృందం కూచున్నది. నంబూద్రి ప్రతినిధులకు, గాంధీజీ బృందానికి మధ్య మూడు గంటల పాటు సంభాషణ జరిగింది. వేదాల్లో అంటరానితనం ఉన్నదని తనకు చూపిస్తే సత్యాగ్రహం విరమించి వెళ్ళిపోతామని గాంధీజీ చెప్పారు.

తమది శంకర స్మృతి అని వేద ప్రమాణం తమకు వర్తించదని నంబూద్రి చెప్పారు. అంటరానితనానికి మద్దతుగా శంకర స్మృతిలో ఋజువు చూపించాలని గాంధీజీ కోరారు. దానికి సమా ధానంగా తమది చిరకాలంగా కొనసాగుతున్న సంప్ర ˇదాయక విశ్వాసమని, దానికి రుజువులు చూపాల్సిన అవసరం లేదని నంబూద్రి అన్నారు. ఆలయం చుట్టూ ఉన్న నాలుగు రహదారులలో కుక్కలు, జంతువులు తిరుగుతున్నాయి, కానీ తోటి మానవులను ఎందుకు దూరం పెడుతున్నారు, ఇది అమానుషం కాదా అని గాంధీజీ అడిగారు. దానికి నంబూద్రి మౌనం పాటించారు. వైకోమ్ సత్యాగ్రహం ముగియడానికి గాంధీజీ మూడు ప్రతిపాదనలను నంబూద్రి ముందుంచారు. మొదటిది: వేదాల్లో గానీ, శంకరస్మృతిలో గానీ అంటరాని వారికి ఆలయప్రవేశం లేదని రుజువులు చూపించండి. రెండోది : నంబూద్రి తన తరపున ఒక పండితుడిని నియమిస్తే, గాంధీజీ ఒక పండితుడిని నియమిస్తారు. పండితులు చర్చించుకున్నాక ఇద్దరూ కలిసి ఏం చెబితే దానికి ఇరుపక్షాలు అంగీకరించాలి. మూడు: రహదారులలో రాకపోకల సమస్యపై సవర్ణుల నుండి ప్రజాభిప్రాయం సేకరించాలి. అందులో వెలువడిన ఫలితం ప్రకారం ఇరుపక్షాలు కట్టుబడి ఉండాలి.

అయితే నంబూద్రి ఈ మూడు ప్రతిపాదనల్లో ఏ ఒక్కదానికీ అంగీకరించలేదు. దాంతో చర్చలు విఫలం అయ్యాయి. గాంధీజీ ఆలయ ప్రవేశ మార్గంలోని మార్గావరోధాలవద్ద సత్యా గ్రహులను ఉద్దేశించి ప్రసంగించారు. “అహింసాయుత పద్ధతుల్లో ఉద్యమాన్ని ఇప్పటిమాదిరి గానే కొనసాగించండి , సత్యాగ్రహులు పట్టుదలగా పోరాడితే త్వరలోనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది” అంటూ గాంధీజీ దృఢంగా చెప్పారు. ఆరోజు ఆశ్రమంలో జరిగిన ప్రార్థనా సమావేశంలో “ఇది ఎప్పటికి ముగుస్తుందో నాకు తెలియదు, నెలలు పట్టవచ్చు, సంవత్సరాలు పట్టవచ్చు, సత్యాగ్రహులు ఆశ్రమంలో క్రమ శిక్షణా వాతావరణాన్ని పరిరక్షించండి. అందరూ పనులు చేయండి, పరిశుభ్రతను కాపాడండి. నూలు వడకండి, రాట్నం నేర్చుకోండి, సంస్కృతం, హిందీ భాషలు నేర్చుకోండి, స్వరాజ్యంలో మీరంతా క్రమశిక్షణ కలిగిన సైనికులుగా రూపొం దండి” అంటూ సందేశం ఇచ్చారు.

11 వ తేదీన గాంధీజీ తిరువనంతపురం వెళ్ళి సంస్థాన ప్రభుత్వ రీజెంట్ సేతు లక్ష్మీబాయిని కలుసుకున్నారు. ప్రజాభిప్రాయా నికి అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని, సామరస్య పరిష్కా రానికి నంబూద్రి సిద్ధంగా లేనందున ప్రభుత్వమే తగిన నిర్ణయం తీసుకోవాలని గాంధీజీ కోరారు. ఆమె అందుకు సానుకూలంగా స్పందించారు.

**శ్రీ నారాయణగురు - గాంధీజీ భేటీ!**

12వ తేదీన గాంధీజీ బృందం వర్కల వెళ్ళి శివగిరిమఠం సందర్శించింది. శ్రీ నారాయణగురు ఆశ్రమ పద్ధతులను పక్కన బెట్టి ఎదురువెళ్ళి గాంధీజీకి స్వయంగా స్వాగతం పలికారు. ఆశ్రమం ప్రతినిధి ఒకరు సాష్టాంగ నమస్కారం చేసి గాంధీజీకి స్వాగతం పలికారు. ఆశ్రమం ఆవరణలో గాంధీజీ బస చేయడానికి ఒక ఇంటిని ఏర్పాటు చేసి “గాంధీజీ ఆశ్రమం” అంటూ దానికి నామకరణం చేశారు. వారిద్దరూ ఆధ్యాత్మిక, ధార్మిక, అంశాలపై మనసు విప్పి

మాట్లాడుకున్నారు. గాంధీజీ బృందం సమర్పించిన నూలు దండను గురూజీ మెడలో ధరించి "ఇప్పుడు నేను సత్యాగ్రహిని అయినట్లేనా" అంటూ చమత్కరించారు! స్వామీజీ ఇంగ్లీషులో మాట్లాడతారా అని గాంధీజీ అడిగారు. గాంధీజీ సంస్కృతంలో మాట్లాడతారా అంటూ స్వామీజీ ఎదురు ప్రశ్నించారు. స్వామీజీ సంస్కృతం, మలయాళంలో మాట్లాడగా, గాంధీజీ ఇంగ్లీషులో మాట్లాడారు.

మోక్షసాధనకు హిందూ మతం సరిపోతుందంటూ ఇద్దరూ అభిప్రాయపడ్డారు. వేర్వేరు మార్గాల ద్వారా కూడా భగవంతుని చేరుకోవచ్చునని కూడా ఇద్దరూ అంగీకరించారు. వైకోమ్ సత్యాగ్రహం ప్రస్తుతం సరైన దారిలోనే నడుస్తున్నదనీ, అదే పద్ధతిలోనే కొనసాగవచ్చునని, దానికి సంబంధించి ఎలాంటి మార్పులు అవసరం లేదని గాంధీజీ ప్రశ్నకు స్వామీజీ సమా ధానంగా చెప్పారు. పోరాటమార్గంలో హింస అవసరమా అని గాంధీజీ అడిగిన ప్రశ్నకు అహింస మాత్రమే సరైన ఆయు ధమని స్వామీజీ చెప్పారు. కులవివక్ష, అంటరానితనం, అవర్ణుల ఆలయ ప్రవేశం, వంటి అంశాలలో ఇద్దరూ ఒకే అభిప్రాయం కలిగి ఉన్నారని సంభాషణలో వెల్లడయ్యింది.

అయితే హిందూమతంలో ఉన్న వర్ణాశ్రమ ధర్మం సరైనదేనని , కులం వేరు, వర్ణం వేరు అంటూ గాంధీజీ చెప్పిన అంశాన్ని శ్రీ నారాయణగురు అంగీకరించలేదు.

"మనుషులు మోక్షం ఒక్కటే కాకుండా భౌతిక స్వేచ్ఛలు కూడా కోరుకుంటారు" అని స్వామీజీ అన్నారు. "వారికి అది తప్పక లభిస్తుంది" అని గాంధీజీ అన్నారు.

"అలా లభించాలంటే గాంధీజీ తనను తాను సంపూర్ణంగా పునర్నిర్మాణం చేసుకోవాలి" అని స్వామీజీ నవ్వుతూ అన్నారు.ఆశ్రమ పాఠశాలలో అన్నికులాల పిల్లలు కలిసి చదువుకోవడం, ఆశ్రమం పరిశుభ్రంగా ఉంచుకోవడం, పిల్లలు సంస్కృతాన్ని అభ్యసించడం చూసి గాంధీజీ ముగ్ధులు అయ్యారు.అక్కడి నుండి గాంధీజీ వైకోమ్ వెళ్ళారు. సత్యాగ్రహాన్ని కొనసాగించాలని కోరారు.

సత్యాగ్రహంలో క్రైస్తవులు, ముస్లిములు, సిక్కులు , బయటి ప్రాంతాల వలంటీర్లు పాల్గొనడాన్ని గాంధీజీ నివారించారు. ఇది హిందువుల్లోని కరడుగట్టిన ఛాందసవాదుల బలాన్ని పెంచుతుంది, తమ మతంపై ఇతర మతాలవారి దాడిగా ఛాందసవాదులు పరిగణిస్తారు అంటూ గాంధీజీ వివరించారు. హిందూమతం లోని సంస్కరణలకు హిందువుల నుండి మాత్రమే ప్రేరణ, మద్దతు రావాలని గాంధీజీ నొక్కి చెప్పారు. గాంధీజీ రాక సందర్భంగా ఒక సానుకూల స్పందనగా ప్రభుత్వం అరెస్టయిన సత్యాగ్రహులను విడుదల చేసింది.

సత్యాగ్రహుల తరపున కూడా శాంతి భద్రతలకు భంగం కలుగకుండా వారి నుండి సానుకూల ప్రతిస్పందన రావాలని ప్రభుత్వం కోరుకున్నది.మార్చి 18 వ తేదీన తిరువనంతపురంలో గాంధీజీ సిటీపోలీసు కమిషనర్ డబ్ల్యు.హెచ్. పిట్ తో భేటీ అయ్యారు.ఆలయం చుట్టూ ఉన్న నాలుగు రహదారులలో ఏర్పాటు చేసిన మార్గావరోధాలను , కంచెలను తొలగించాలని గాంధీజీ కోరారు. సత్యాగ్రహులకు ఛాందసవాదుల నుండి తగు రక్షణలు ఏర్పాటు చేయాలని గాంధీజీ సూచించారు. సత్యాగ్రహాన్ని కంచెలకు కొద్ది దూరంలో నిర్వహించుకోవాలని, వారివల్ల శాంతి భద్రతలకు ఇబ్బందులు రాకుండా సహకరించాలని సిటీ పోలీసు కమిషనర్ కోరారు. ఆమేరకు గాంధీజీ , సిటీ పోలీసు కమిషనర్ ఒక అంగీకారానికి వచ్చారు.

గాంధీజీ కేరళ పర్యటనలో మరికొన్ని పట్టణాలు పర్యటించారు. అనంతరం తిరిగి మద్రాసు చేరుకున్నారు.

**రాజీ ఒప్పందం!**

కేరళ కాంగ్రెస్ ప్రతినిధులకు, సంస్థాన ప్రభుత్వానికీ మధ్య చర్చలు కొనసాగాయి.1925 మే 18 వరకూ మహారాజా దివాన్ గా కొనసాగిన టి. వీర రాఘవయ్య తప్పుకోవడంతో ఎం.ఇ.వాట్స్ దివాన్ గా బాధ్యతలు చేపట్టారు. వైకోమ్ సమస్య పరిష్కారం కోసం ఆయన గట్టి ప్రయత్నం చేశారు. మహారాజు మరణించడం రాజ్యానికి ఒక అపశకునమని, వైకోమ్ విషయంలో ఏదో ఒక అంగీకారానికి వెళ్ళడం మంచిదని జ్యోతిష్కులు, సలహాదారులు, మంత్రులు రీజెంట్ సేతు లక్ష్మీబాయికి హితవు చెప్పారని కూడా అంటారు.

ఆలయం పరిసరాల్లోని నాలుగు రహదారులు ప్రైవేటు రహ దారులనీ, నడకహక్కు దేవస్థానం ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుందన్న వాదన తెరపైకి వచ్చింది. కొం దరికి నడక అవకాశం ఇచ్చి మిగిలినవారికి నిరాకరించడం కుదరదన్న వాదన కూడా బలం పుంజు కున్నది. దేవతామూర్తుల వూరేగింపు కోసం ఆలయం వెనుకవైపు నుండి వినియోగించే రోడ్డులో అర్చకులు మినహా మరెవ్వరూ వెళ్ళే అవకాశం లేదనే మాట కూడా ముందుకు వచ్చింది. మొత్తం మీద దఫదఫాలుగా వివిధపక్షాల మధ్య జరిగిన సంప్రదింపుల ఫలితంగా రాజీ ఫార్ములా రూపొందింది.

ఆలయం చుట్టూ ఉన్న నాలుగు రహదారులలో మూడు రహదారులను అందరూ వినియోగించుకోవడానికి ఒప్పం దం కుదిరింది. ఒప్పందానికి గాంధీజీ ఆమోదం ఉంటేనే తాను అంగీకరిస్తానని రీజెంట్ సేతు లక్ష్మీబాయి షరతు పెట్టారు. దానిపై ఒప్పందం ప్రతిని వేరే రాష్ట్రంలో పర్యటనలో ఉన్న గాంధీజీకి పంపించి ఆయన ఆమోదం తీసుకున్నారు. ఈ సంప్రదింపుల క్రమం కొనసాగు తుండగా1925 ఏప్రిల్ 4 న వైకోమ్ లో అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను సడలిస్తూ పోలీసు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అవి 7 వ

తేదీనుండి అమలులోకి వచ్చాయి. మార్గావరోధాలను, కంచెలను కూడా తొలగించారు. సిటీ పోలీసు కమిషనర్ కు గాంధీజీ ఇచ్చిన హామీ మేరకు సత్యాగ్రహులు సైతం తమ హద్దుల్లోనే ఉంటూ సత్యాగ్రహాన్ని కొనసాగించారు. ఇరుపక్షాలకూ తుది అంగీకారం కుదురుతుందన్న వాతావరణం నెలకొన్నది. గతంలో మాదిరిగా రోడ్లపై రాకపోకలను అనుమతించారు. అయితే అందరికీ రోడ్లు అందుబాటులోకి రాలేదు. రోడ్లు ఇంకా పూర్తిగా తెరచుకోలేదని గాంధీజీ దృష్టికి తెస్తూ కే. కేలప్పన్ జూన్ 18న ఒక లేఖ రాశారు. చివరికి ఒప్పందం నవంబర్ నుండి పూర్తిగా అమల్లోకి వచ్చింది. దాంతో 1925 నవంబర్ 23 న సత్యాగ్రహాన్ని విరమిస్తున్నట్లు కాంగ్రెస్ కమిటీ ప్రకటించింది. సత్యాగ్రహులు, వైకోమ్ ప్రజలు, సంస్థానంలోని వివిధ వర్గాల ప్రజలు సత్యాగ్రహం సాధించిన విజయానికి హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. మూడురోడ్లలో మాత్రమే రాకపోకలకు అంగీకరించి రాజీపడటం కొందరికి నచ్చలేదు. నాలుగో రోడ్డులో కూడా నడక హక్కు సాధించి ఉండాల్సిందని, ఆలయ ప్రవేశం కూడా ఈ ఉద్యమం సందర్భంగా సాధించి ఉండాల్సిందని మరికొందరు భావించారు. ఇవే కారణాలతో పెరియార్ తర్వాతి కాలంలో కాంగ్రెస్ కు రాజీనామా చేశారు. టి.కే.మాధవన్, కే.పీ. కేశవమీనన్, మన్నత్ పద్మనాభన్, జార్జ్ జోసెఫ్, ఇ .వి. రామస్వామి ( పెరియార్) వంటివారు వైకోమ్ సత్యాగ్రహంలో చురుగ్గా పాల్గొన్నారు.

**సత్యాగ్రహ పర్యవసానాలు !**

ఆలయం చుట్టూ ఉన్న రహదారులలో నడక హక్కు సాధించడం తొలిమెట్టు మాత్రమేనని, ఆ తర్వాత ఆలయ ప్రవేశహక్కు కోసం పోరాడాలని గాంధీజీ నిరంతరం ప్రబోధిస్తూ వచ్చారు. కాంగ్రెస్ దేశవ్యాప్తంగా అంటరానితనాన్ని నిర్మూలించే ఉద్యమాన్ని కొనసాగించింది. తిరువాన్కూర్ సంస్థాన వారసుడు చిత్ర తిరునాళ్ బలరామ వర్మ యుక్తవయస్సు వచ్చాక రాజరిక బాధ్యతలు చేపట్టారు. ఆయన 1936లో సంస్థానం పరిధిలోని అన్ని ఆలయాలలో అవర్ణులకు ప్రవేశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా గాంధీజీ సంస్థానాధీశునికి లేఖ రాశారు.

“అందరూ నన్ను మహాత్ముడు అని పిలుస్తూ ఉంటారు, ఆ మాటకు నేను అర్హుడనో కాదో నాకు తెలియదు. కానీ మీరు ఆలయ ప్రవేశంపై అందరికీ అవకాశం కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకం. ఈ నిర్ణయం తర్వాత అసలైన మహాత్ముడు మీరే అని చెప్పక తప్పదు” అంటూ గాంధీజీ ఆ లేఖలో రాశారు.

వైకోమ్ సత్యాగ్రహం జరిగి ఒక శతాబ్దం గడిచిన తర్వాత ఇప్పుడు అలనాటి ఘటనల క్రమాన్ని పరిశీలిస్తే గాంధీజీ తీసుకున్న వైఖరులు సరైనవేనని తేలుతుంది. ఆయన ఎత్తుగడలు ఆచరణాత్మకంగా ఉన్నాయని అర్థం అవుతుంది . హిందూ మతంలోని ఛాందసవాదులకు వ్యతిరేకంగా సవర్ణులలోని సంస్కరణా భిలాషులను, ప్రజాస్వామిక వాదులను, సమీకరించిన తీరు అద్భుతం. వివిధ రూపాలలో ప్రజాభిప్రాయాన్ని కూడగట్టడానికి గాంధీజీ అనుసరించిన మార్గం ఆయన ముందుచూపునకు నిదర్శనం అని చెప్పాలి. ముస్లిములను, క్రైస్తవులను, సిక్కులను, సత్యాగ్రహంలో ప్రధాన పాత్రధారులు కానీయకుండా దూరంగా ఉంచడం, కులాన్ని నిర్మూలించాలి, దేవుడు లేడు , మతం లేదు అని నమ్మే నాస్తికుల దుస్సాహసాలకు దూరంగా పోరాటాన్ని నడిపించడం గాంధీజీకి చెల్లింది. పెరియార్ తో జీవితకాల విభేదం వచ్చినా గాంధీజీ జంకలేదు. ఒక పక్క సంస్థాన అధిపతితో, ప్రభుత్వంతో, ఛాందసవాదులతో, అధి కారులతో, శ్రీ నారాయణగురుతో, సత్యాగ్రహులతో గాంధీజీ బహుళపక్ష సంభాషణలు జరిపి ఒక పరిష్కారం సాధించేందుకు చేసిన ప్రయత్నం ఆచరణాత్మకమైనది. ఇలాంటి పరస్పర విశ్వాసాన్ని సాధించడం ద్వారానే సత్యాగ్రహం విజయవంతం అయ్యింది.ప్రజల సన్నద్ధత ఎంతవరకూ ఉంటే అంతమేరకే పోరాట రూపాలు ఎంచుకోవాలనే ఆచరణాత్మక వైఖరిని గాంధీజీ అనుసరించారు.

కులంలో ఆధునిక ప్రజాస్వామ్య సంస్కరణలు సాధించవచ్చు గానీ కులాన్ని నిర్మూలించలేమని , మత ఛాందస వాదాన్ని ఎదుర్కోగలం గానీ , మతాన్ని నిరాకరించలేమని నూరేళ్ళ క్రితమే గాంధీజీ ఋజువు చేశారు. నేటితరం ఇలాంటి పాఠాలను నేర్చుకోవడానికి వైకోమ్ సత్యాగ్రహం ఒక చక్కని పాఠ్య గ్రంథం.

అవర్ణుల రాకతో తన ఇల్లు మైలపడి పోతుందని గాంధీజీని ఇంటిలోనికి రానీయకుండా అడ్డుకున్న నంబూద్రీ కుటుంబం ఆ తర్వాత కాలంలో చెల్లా చెదురు అయ్యింది. వారి వారసులు ఎక్కడో సెటిల్ అయ్యారు. వైకోమ్ లోని తమ విశాలమైన ఇంటిని అమ్ముకున్నారు. కేరళ కల్లుగీత కార్మికసంఘం నంబూద్రీ గారి అదే ఇంటిని కొనుగోలు చేసింది. ఒకప్పుడు నంబూద్రీలు ఎళవ కులస్తులను అంటరానివారిగా అవమానించి ఆలయం ముందునుండి కూడా నడవకుండా నిషేధించారు. దానికి వ్యతిరేకంగా అదే ఎళవ కులస్తులు వైకోమ్ సత్యాగ్రహానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం కల్లుగీత కార్మికసంఘం తాను కొనుగోలు చేసిన నంబూద్రీ ఇంటి ఆవరణలో వైకోమ్ సత్యాగ్రహ భారీ స్మారకాన్ని ఏర్పాటు చేస్తున్నది. ఎళవ కులస్తులు సంప్రదాయకంగా కల్లుగీత కార్మికులు! నూరేళ్ల నాడు అమల్లో ఉన్న ఒక ఘోర అమానుషం అంతం అయ్యింది. ప్రజల చొరవతో చరిత్ర సామాజిక న్యాయాన్ని సాధించింది. ★

# కులాన్ని రాజకీయం పెంచి పోషిస్తోంది కాబట్టే విజయవాడ కాంక్లేవ్ లో జేపీ ఆ విమర్శ చేశారు

## -సీనియర్ విశ్లేషకులు అజ్ఞానంతో సమాజానికి నష్టం చేయొద్దు-

-ఎ. అన్నపూర్ణ-




ఇటీవల విజయవాడలో 'వే 2 న్యూస్' డిజిటల్ ఛానల్ వారు నిర్వహించిన కాంక్లేవ్‌లో ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ యువత-విద్య, ఆరోగ్యంపై చర్చలో పాల్గొన్న సంగతి తెలిసిందే. ఆ వీడియోల్ని 'జేపీ లోక్‌సత్తా' యూట్యూబ్ ఛానల్‌లో చూసివుంటారు, నివేదికను 'జనబలం'లో చదివి ఉంటారు. అయితే అందులో యువత-విద్యపై పార్లమెంటు సభ్యులు శ్రీ భరత్‌తో జేపీ చర్చపై ఒక వివాదాస్పద వీడియో విడుదలైంది. చర్చలో కుల రాజకీయాల్ని జేపీ ప్రస్తావించి ఆ అంశంపై ఎంపీని ప్రశ్నించారు. ఆయన తాను ప్రాతినిధ్యం వహిస్తున్న విశాఖపట్నం లోక్‌సభ నియోజకవర్గంలో కాస్మోపాలిటన్ సంస్కృతి ఎక్కువని, కులం ప్రభావం అంతగా లేదని చెప్పారు. దానిపై జేపీ విజయవాడ వాసులనుద్దేశించి, 'వింటున్నారా? విశాఖలో కులం లేదట, విజయవాడ వారు కూడా కుల రాజకీయాల నుంచి బయటపడాలి. ఒకప్పుడు గోపరాజు రామచంద్రరావు (గోరా), త్రిపురనేని రామస్వామి, లవణం, చెన్నుపాటి కుటుంబీకులు వంటి గొప్ప సామాజిక సంస్కర్తలు విలసిల్లిన ఈ ప్రాంతం ప్రస్తుతం కులాల కుంపటిగా మారటం చాలా బాధ కలిగిస్తోంది' అన్నారు. దీనిపై ఒక పాప్యులర్ డిజిటల్ ఛానల్ వారిని ఎవరో ముంబయి నుంచి ప్రశ్నించారట. 'ఏమిటీ, జేపీ అలా అంటున్నారు? విజయవాడలో అంత కుల రాజకీయం ఉందా?' అని. ఆ ఛానల్ ప్రతినిధి 'అబ్బే, ఏమీ లేదు. ఒకప్పుడు ఉండేదేమో' అని చెప్పారట. ఈ అంశం మీద ఒక సీనియర్ రాజకీయ విశ్లేషకునితో ఇంటర్వ్యూ కూడా చేశారు. అందులో జేపీ భావజాలంపై కనీస అవగాహన కూడా లేకుండా, వక్రీకరించే వ్యాఖ్యలను సదరు విశ్లేషకుడు చేశారు. ఇలాంటి అభిప్రాయాన్ని విజయవాడ వాసులు కొందరు కూడా వ్యక్తం చేసిన సందర్భాలున్నాయి. విజయవాడలో కుల రాజకీయాలపై జేపీ హెచ్చరికలకు సంబంధించి అపోహల్ని తొలగించేలా వివరణ ఇవ్వటం మంచిదని భావించి ఈ వ్యాసాన్ని ప్రజల ముందుకు తెస్తున్నాం.

ఆ సీనియర్ రాజకీయ విశ్లేషకుడు తొలుత తెలుగుదేశం పార్టీలో ఉండేవారట. జేపీ లోక్‌సత్తా పార్టీని స్థాపించాక

అందులో చేరారట. ఆయనకు నాలుగు కీలక కమిటీలలో జేపీ చోటు కల్పించారు. అయినా అక్కడ అంత ప్రజాస్వామికత లేకపోవటంతో ఆరు నెలల్లోనే లోక్‌సత్తా పార్టీకి రాజీనామా చేశారట. తనకో రహస్య ఎజెండా ఉందని, లోక్‌సత్తాను తెలుగుదేశంలో విలీనం చేయాలన్నది తన ఆంకాక్షని ఆయనే చెప్పుకున్నారు. లోక్‌సత్తా పార్టీలో ఈ రచయిత కూడా మొదట్నుంచీ ఉన్నారు. మౌలికాంశాల విషయంలో, సమయాభావం వల్ల తప్ప జేపీ నిర్మొహమాటంగా, అవతలివారికి అవకాశం ఇవ్వకుండా మాట్లాడిన సందర్భం ఒక్కటి కూడా కనిపించలేదు. పార్టీ రాష్ట్ర, జాతీయ కార్యవర్గ సమావేశాలలో అందరూ స్వేచ్ఛగా అభిప్రాయాల్ని చెప్పేవారు. అందరూ మాట్లాడినాక జేపీ సమాధానం చెప్పేవారు. అవసరమైతే మధ్యమధ్యలో జోక్యం చేసుకుంటుండేవారు. మల్లగుల్లల తర్వాత ఒక నిర్ణయం వెలువడి మీడియా ద్వారా ప్రజలకు తెలియచేశాక, ఇక మార్చుకోవటం ఉండదు. 'నిర్ణయం ఏమిటి? ఏ ప్రాతిపదికన, ఎందుకోసం ఆ నిర్ణయం లోక్‌సత్తా తీసుకుంది?' అంతవరకే చెప్పేవారు. లోపల జరిగిన వాదోపవాదాల ప్రస్తావన ఉండేది కాదు. ఇది కొందరికి అప్రజాస్వామికంగా అనిపించి ఉండొచ్చు. ప్రజాస్వామ్యంలో స్వేచ్ఛకు పరిమితులుంటాయని రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ దగ్గర్నుంచి నేటి సోషల్ మీడియా వేదికలపై చర్యల దాకా చాలామంది సాధికారికంగా చెబుతున్నా.. ఎవరెలా పోయినా నాకు నచ్చినట్లు చేసే స్వేచ్ఛ ఉండాలి అంటే – అది ప్రజాస్వామ్యమా?'సూత్రబద్ధతలేని రాజకీయం, లక్ష్యంలేని అధికారం ప్రమాదకరం' అని గాంధీ ఎప్పుడో చెప్పారు. లోక్ సత్తా పార్టీ ఏ ఒక్కరి సొంతం కాదు, ప్రజల ఆస్తి. ఆ వాహనాన్ని ఉపయోగించుకుని ప్రజలకు సాధికారతను అందించే, వారిని ప్రభువులుగా నిలిపే రాజకీయం చేసేవారికి ఎటువంటి ఫిర్యాదులూ చేయాల్సిన అవసరం ఎప్పుడూ తలెత్తదు. లోక్‌సత్తా లక్ష్యం, రాజకీయ సంస్కృతి, పాటించే హేతుబద్ధత, తర్కం, ప్రపంచ దేశాల అనుభవాలు, భారతీయ నేపథ్యం, ప్రజాస్వామ్యం మొదలైన అంశాల గురించి స్పష్టత ఉంటే.. ఇలాంటి వాదనలు తలెత్తవు. ఎప్పుడూ చెప్పదలచుకోని విషయాల్ని చెబుతున్నాను అని మొదలుపెట్టి, కొండను తవ్వి చివరకు ఎలుకను కూడా పట్టలేదు. లోక్‌సత్తా పార్టీలో చేరకముందు, రాజీనామా చేశాక సదరు విశ్లేషకునికి తెలుగుదేశంలో ఏమైనా ఒక్క కమిటీలో స్థానం లభించిందా, ఒక్క సంస్థాగత పదవి లభించిందా, కనీసం చంద్రబాబుతో కూర్చుని పది నిమిషాలు మాట్లాడే అవకాశం లభించిందా, సొంత నిర్ణయం తీసుకుని ప్రకటించే స్వేచ్ఛ లభించిందా అంటే.. శూన్యం. ఉట్టికెగరలేనమ్మకి ఆకాశానికెగిరే అవకాశమిస్తే

**లోక్‌సత్తా పార్టీ ఏ ఒక్కరి సొంతం కాదు, ప్రజల ఆస్తి. ఆ వాహనాన్ని ఉపయోగించుకుని ప్రజలకు సాధికారతను అందించే, వారిని ప్రభు వులుగా నిలిపే రాజకీయం చేసేవారికి ఎటువంటి ఫిర్యాదులూ చేయాల్సిన అవసరం ఎప్పుడూ తలెత్తదు. లోక్‌సత్తా లక్ష్యం, రాజకీయ సంస్కృతి, పాటించే హేతుబద్ధత, తర్కం, ప్రపంచ దేశాల అనుభవాలు, భారతీయ నేపథ్యం, ప్రజాస్వామ్యం మొదలైన అంశాల గురించి స్పష్టత ఉంటే.. ఇలాంటి వాదనలు తలెత్తవు.**

ఇలాగే ఉంటుంది.

ఇక రెండో అంశం, జేపీ కులం గురించి. ఎన్.టి రామారావు గురించి. ఎన్.టి.ఆర్ వచ్చాకే రాజకీయాల్లో వెనుకబడిన, సామాన్య వర్గాలకు అవకాశాలు వచ్చాయంటే, తెలుగువారికి జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చిందంటే కాదని ఒక్కరు కూడా చెప్పలేరు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్నప్పుడు, ఇప్పుడు కూడా ఏ పార్టీవారైనా ఎన్.టి.ఆర్ పేరు చెబితే చేతులెత్తి నమస్కరిస్తారు. కులంతో పనిలేదు. రిజర్వేషన్లతో పనిలేదు. ఈవేళ అసెంబ్లీలో కూర్చున్న, ఎన్నికల్లో పోటీ చేసిన వారిలో అత్యధికులు ఎన్.టి.ఆర్ వల్లే రాజకీయంగా ఆ స్థాయికి వచ్చారు. ఏ పార్టీకి చెందిన నేతయినా, ఎన్.టి.ఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించటం, ఆయన విగ్రహాన్ని లేదా ఆయన పేరు మీద ఉన్న దేన్నయినా మార్చటానికి ఇష్టపడరు. అంతెందుకు, రాష్ట్రం విడిపోయాక వైఎస్ జగన్ కూడా ఎన్.టి.ఆర్ వైద్య విశ్వవిద్యాలయం పేరు మార్చినా చివరికి ఎన్.టి.ఆర్ పేరుతో జిల్లాను ప్రకటించాల్సి వచ్చింది. రామారావుకి కులం పట్టింపు లేదంటూనే, జేపీ కృష్ణా జిల్లా కమ్మ కులస్తుడు కాబట్టి తన ముఖ్య కార్యదర్శిగా తీసుకున్నారని సదరు రాజకీయ విశ్లేషకుడు తెలిపారు. ఎన్.టి.ఆర్‌కి కులం పట్టింపు లేనప్పుడు, కులాన్ని బట్టి జేపీని ఎందుకు తీసుకుంటారు? అదీగాక, రామారావు వద్ద పి.ఎస్ గా చేరను అని జేపీ అంటే, ఎన్.టి.ఆర్ ప్రత్యర్థులైన జలగం వెంగళరావు, వైఎస్ రాజశేఖరరెడ్డి లాంటి వారు చేరటం మంచిదని ప్రోత్సహించారు. ఎన్.టి.ఆర్ మంచి వ్యక్తి, అవినీతిలేని మనిషి, పెద్ద మెజారిటీతో ఎన్నికయ్యారు.. ఆయన ద్వారా మీరు ప్రజలకు మంచి చేయవచ్చు అని

వారు నచ్చచెప్పారు. అప్పటికే జేపీ గురించి, ఆయన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రత్యేక అధికారిగా భూ నిర్వాసితులకు దేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా పరిహారం ఇప్పించటంతో పాటు.. 8,000 మంది, వారిలో ఎక్కువ మత్స్యకారులు, అందరికీ ప్లాంట్ యాజమాన్యం చేతే శిక్షణనిప్పించి ఉద్యోగాల్లోకి తీసుకునేలా చేయటం గురించి, ప్రకాశం, తూర్పు గోదావరి జిల్లాల్లో కలెక్టర్‌గా, సహకార బ్యాంకు ఎండీగా, ఇతరత్రా ఆయన సాధించిన విజయాల గురించి రాజకీయంలో ఉన్నవారందరికీ తెలుసు. వివిధ జిల్లాల ప్రజల్లో చాలామంది ఇప్పటికీ ఆ విషయాల్ని కథలు కథలుగా చెప్పుకుంటారు. ప్రకాశం జిల్లాలో ఎకరాకు రూ.2,000తో రెండు లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే ఏర్పాటు జేపీ చేశారు. అందులో రూ.1000 రైతులకు తాను ష్యూరిటీ ఉండి బ్యాంకుల్లో అప్పు ఇప్పించారు. ఆ డబ్బును గడువుకి ముందే రైతులు అణాపైసలతో సహా చెల్లించారు. ప్రజల చేతికి సరైన రీతిలో అధికారమిస్తే ఎలాంటి అద్భుతాలు జరుగుతాయో జేపీ నిరూపించి చూపారు. దీనివల్ల ఆ ఒక్క జిల్లాలో లక్ష కుటుంబాలు శాశ్వతంగా పేదరికం నుంచి బయటపడ్డాయి. జిల్లాల్లో ఎక్కడో ఇరవైకి ఆవలి స్థానంలో ఉన్న ప్రకాశం.. ఉమ్మడి ఏపీ రాష్ట్రంలో మొదటి స్థానంలోకి వచ్చింది. అప్పుడు గుంటూరు జిల్లాకు చెందిన మంత్రి ఒకాయన తమ కలెక్టర్‌ని పిలిపించి.. జేపీకి సాధ్యమైనది నీకెందుకు సాధ్యం కావటం లేదు, అదే పథకం, అంతకంటే వెనుకబడిన రైతులు కదా ప్రకాశంలో ఉన్నది? అని అడిగారట. సర్ ఆర్థర్ కాటన్ తర్వాత అంత తక్కువ ఖర్చుతో రైతులకు సాగునీరిచ్చిన సందర్భం లేదు. స్వతంత్ర భారతదేశంలో ఇప్పటికీ ఆ రికార్డు కొనసాగుతోంది. ఇవన్నీ చూశాక ఎన్.టి.ఆర్ తీసుకున్నారు గానీ, తన కులం కాబట్టి కాదు. 'జేపీ ముఖ్య కార్యదర్శిగా లేకపోతే, ఎన్.టి.ఆర్ కథ ఎప్పుడో ముగిసేదని' అప్పట్లోనే అనేవారు. సన్మానాలు, సత్కారాలు తప్ప ఎన్.టి.ఆర్ అప్పట్లో పాలనపై దృష్టి కేంద్రీకరించిన సమయం తక్కువ. జేపీ అంటే అంత నమ్మకం ఆయనకి. ఆ సమయంలోనే దేశ చరిత్రలో సువర్ణాధ్యాయానికి నాంది పలికిన 'మ్యాక్స్' (పరస్పర సహాయ సహకార సంఘాల) చట్టాన్ని రాష్ట్రంలో జేపీ సూచనతో రామారావు తీసుకొచ్చారు. అదేవిధంగా, ఆ తర్వాత హైటెక్ సిటీ ఏర్పాటు సమయంలో ఎల్ అండ్ టీకి భూముల కేటాయించటంలోనూ జేపీ పాత్ర కీలకం. మీకు తెలుసో, లేదో.. ఒకానొక దశలో ఎన్.టి.ఆర్ చంద్రబాబును పార్టీ నుంచి బహిష్కరిస్తానంటే జేపీయే అడ్డుకున్నారు. ఈ విషయాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద టీడీపీ సీనియర్ నేత గాలి ముద్దుకృష్ణమ నాయుడే చెప్పారు. ఆ సమయంలో అసెంబ్లీ బీట్ జర్న లిస్టులు కూడా ఉన్నారు. చంద్రబాబు కష్టం లేకుంటే తెలుగుదేశం పార్టీ నిలబడేది కాదు అన్న విజ్ఞత ఉండబట్టి జేపీ ఆరోజు అలా వ్యవహరించారు. ఎన్.టి.ఆర్ పిల్లలకీ ఈ విషయం తెలుసు. అందుకే, బ్లడ్ ఈజ్ థిక్కర్ దేన్ వాటర్ అనేది మినహాయించి ఆలోచించగలిగితే.. వారికి చంద్రబాబు కన్నా జేపీ మీదే ఎక్కువ నమ్మకం ఉంటుంది.

జేపీ కంటే తెలివైన, సమర్థులైన ఐఏఎస్ అధికారులు చాలామంది ఉన్నారని ఆ విశ్లేషకుడు అన్నారు. ఒక్కరి పేరు చెప్పండి. అన్ని తెలివితేటలుండి, దేశంలో మార్పు కోసం అధి కారిగా, రాజకీయ ఉద్యమకారునిగా, కాలమిస్టిగా, ఎలక్ట్రానిక్ మీడియా తొలితరం ప్రజెంటర్‌గా, పార్టీ వ్యవస్థాపకునిగా, అధ్యక్షునిగా, పౌర సమాజ నేతగా, పౌరునిగా అంత పోరాటం చేసినవారిని ఒక్కరిని చూపండి. ప్రజాజీవితంలో నిజమైన కృషి చేసినవారెవరూ ఇలాంటి మాటలు మాట్లాడరు.

ఇక అసలు విషయానికి వద్దాం. పైన పేర్కొన్న విషయాలతో చాలామంది ఏకీభవిస్తారుగానీ, కులం గురించి, అందులోనూ విజయవాడవాసుల కుల రాజకీయాల గురించి ఆయన పదే పదే పేర్కొనటాన్ని చాలామంది ఇబ్బందికరంగా భావి స్తున్నారు. 2009 ఎన్నికల్లో కుల రాజకీయాలు, విజయవాడ వాసుల్లోని కుల ముద్రలపై జేపీ వీడియో, షార్ట్ తెలుగునాట చూడనివారు లేరు. ప్రవాస తెలుగువారైతే చెప్పనక్కర్లేదు. 2025 లోనూ ఇటీవలి కాంక్లేవ్ లో అదే మాట అనటం, అదీ విజయవాడ ప్రముఖుల ముందు అనటం కొందరికి కంటగింపుగా అనిపిస్తోంది. దీనిపై విశ్లేషించిన సీనియర్ పరిశీలకుడు కూడా, ఎన్నో త్యాగాలు చేసి, కష్టాలు పడ్డ, అద్భుత విజయాలు సాధించిన కమ్మవారంటే ఈవేళ చులకనైపోయిందని, ఎన్.టి.ఆర్ ను ఏమీ చేయలేక అసూయతో కాపు కులస్తులతో హింసాత్మక ఘటనలకు కుట్ర పన్నారని అన్నారు. ఈ అసూయాపరుల్లో కొందరు కమ్మ కులస్తులు కూడా ఉన్నారని, వారి కోవలోకే జేపీ కూడా వస్తారన్నారు. ఎన్.టి.ఆర్ పట్ల అసూయ ఉంటే, ఆయన వద్ద జేపీ ఎందుకు చేరతారు? ఆయనకు అంత కీర్తిప్రతిష్టల్ని ఎలా తెస్తారు? బహుశా ఎన్.టి.ఆర్ చివరి క్షణాల్లో నమ్మిన ఏకైక వ్యక్తి జేపీయేనంటే అతిశయోక్తి కాదు. అదలా ఉంచితే, కులం వద్దు అనే వ్యక్తి ప్రతిసారీ కులం గురించి ఎందుకు మాట్లాడుతున్నారని జేపీని ఉద్దేశించి ఆ విశ్లేషకుడు ప్రశ్నించారు. ఇక్కడ ముంబయి నుంచి ఫోన్ చేసిన వ్యక్తి, ఆ ఇంటర్వ్యూ చేసిన సీనియర్ యాంకర్, చివరికి ఆ రాజకీయ విశ్లేషకుడు కూడా గుర్తించని ఒక కీలకాంశముంది.

జేపీ సాధారణంగా కులం గురించి మాట్లాడరు. కొన్నేళ్ల క్రితం లోక్‌సత్తా పార్టీలో కటారి శ్రీనివాసరావు అనే నేతకు

లభించిన ప్రాధాన్యతను చూసి ఒకాయన ఆ విశ్లేషకుడి లాగానే పొరబడి, ఆయన జేపీ తమ్ముడు, సొంత తమ్ముడికి పార్టీ పదవులు కట్టబెట్టారని ఆరోపణలు రాశారు. ఆ రిపోర్టర్ కి, ఎడిటర్‌కి కూడా తెలియదు. వారు ప్రచురించేశారు. అప్పుడు ఈ రచయిత కటారి కులం ఏమిటా అని అడగాల్సి వచ్చింది. వేర్వేరు కులాలు అని పార్టీ నుండి తెలియచేశాక.. ఆ రిపోర్టర్‌ని సీనియర్లు మందలించారట. కటారి లాంటి కొంతమంది నేతలు సొంత కృషి వల్ల గుర్తింపు తెచ్చుకున్నారు తప్ప, జేపీ ప్రత్యేకించి ఎవరి పట్లా పక్షపాతం చూపలేదు. కాకపోతే, కొందరు కుటుంబ నేపథ్యం దృష్ట్యా అవకాశాలు అందనివారుంటే.. వారు ఆత్మన్యూనతకు లోనవకుండా, అదనపు మద్దతు ఇచ్చేలా పార్టీని తీర్చిదిద్దారు. అదేవిధంగా ఇటీవల రాహుల్ గాంధీ బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్‌ను అనుకరిస్తూ కులగణన నినాదాన్నిచ్చినప్పుడు, దాని గురించి ఒక వీడియో రిలీజ్ చేద్దామని 'జేపీ లోక్‌సత్తా' అఫీషియల్ యూట్యూబ్ ప్రతినిధులు అడిగినప్పుడు తిరస్కరించారు. బయటి ఛానల్స్ వాళ్లు అడగటంతో ఆ అంశంపై మాట్లాడారు. కులగణనను బహుశా తెలంగాణలో, దేశంలో అప్పటికి, ఇప్పటికీ స్పష్టమైన కారణాలతో వ్యతిరేకించిన పౌర రాజకీయ ఉద్యమకారుడు జేపీయేనేమో. మిగతా కొందరు వ్యతిరేకించినా, రాజకీయ అవసరాల రీత్యా సర్దుబాటు చేసుకున్నారు. కానీ జేపీ తన వాదనకు కట్టుబడి ఉన్నారు. కులగణన మోసపూరితం, రిజర్వేషన్లకు–కుల గణనకు సంబంధంలేదు అని చాలా స్పష్టంగా ప్రకటించారు. విజయవాడలో కులం గురించి మాట్లాడటానికి ఒక ప్రత్యేకమైన కారణముంది. 2009 నుంచి కూడా.

ఆ రాజకీయ విశ్లేషకులు చెప్పినట్లు, కులం ప్రభావం క్రమంగా తగ్గిపోతున్న మాట వాస్తవం. కొత్త తరంలో చాలా మందికి కులం వారి తల్లిదండ్రులు చెబితే తప్ప తెలి యదు. లోక్ సత్తా పార్టీలో కూడా ఎవరి కులం ఏమిటో చాలా మందికి తెలియదు. అలాంటప్పుడు కులాన్ని జేపీ ఎందుకు తీవ్రంగా విమర్శించాల్సి వస్తోందంటే.. కులాన్ని రాజకీయం సృష్టించకపోయినా, ప్రజలను ఆకట్టుకునే ఎజెండా లేక, ఆ సామర్థ్యం లేక రాజకీయ పార్టీలు కులాన్ని రెచ్చగొడుతున్నాయి. వ్యక్తిగతంగా చంద్రబాబుకి, రాహుల్‌కి, మోదీకి కులం పట్ల నమ్మకం లేకపోవచ్చు. కానీ పొద్దున లేస్తే, వారు చేస్తున్నదేమిటి? కులాల లెక్కలు లేకుండా ఏ రాజకీయ నిర్ణయమైనా చేస్తున్నారా? కులానికో కార్పొరేషన్ పెట్టింది చంద్రబాబు కాదా? అగ్రకులాలు, అణగారిన కులాల కాంబినేషన్‌ను ఎన్నికల ఫార్ములాగా అనుసరిస్తున్నది బీజేపీ కాదా? అంతెందుకు, వైకాపా వ్యవస్థాపకులు వైఎస్ జగన్ అవశేష ఆంధ్రప్రదేశ్‌లో ఎలా అధికారంలోకి రాగలిగారు? అమరావతి అంటే కమ్మ వారి రాజధాని, వారి నగరం అని దుష్ప్రచారం చేయబట్టే గదా? 2019లో ఆయన ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌ని అడగండి. అదే దుష్ప్రచారం విజయవాడ, పరిసరాల్లో తప్ప ఏపీలో ఇంకెక్కడా పని చేయదు, ఎందుకని? విజయవాడ కమ్మవారి ప్రత్యేకత అది. గోరా, త్రిపురనేని రామస్వామి వంటి వారి సంస్కర్తల స్థానంలో ఈవేళ అధికారాన్ని పూజించే, తాతల ఆస్తుల మీద, వారి బంగారం నిల్వల మీద బతికేసే లంపెన్ బ్యాచ్ ఆ కులంలో ఎక్కువైంది కాబట్టి. బడాయిలు తప్ప నిజమైన ప్రతిభ, సొంతంగా ఏదైనా నిర్మించి సమాజానికి మేలు చేసే సంస్కృతి కొరవడింది గనుక. విజయవాడ తొలి ఎంపీగా ఛటోపాధ్యాయ ఎన్నికయ్యారు అని సదరు విశ్లేషకులు ఘనంగా చెప్పారు. జేపి చెబుతున్నదీ అదే. ఒకప్పుడు రాష్ట్రాన్ని, భాషను కూడా దాటి ఆలోచించి హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయను గెలిపించిన, ఎంతోమంది సామాజిక సంస్కర్తలకు నిలయమైన విజయవాడలో ఈవేళ ఎక్కువమంది ప్రజలు కులం దాటి ఎందుకు ఆలోచించటం లేదు? అని. ఇప్పుడున్న లంపెన్ బ్యాచ్ ఎందుకో తెలియకుండా అమెరికాకు వెళ్లి, అక్కడ సినిమా ఫ్యాన్స్ పేరుతో కుల రాజకీయాలు చేయటం ట్రంప్ లాంటి వారు తయారవటానికి కారణాల్లో ఒకటి అంటే ఎవరూ కాదనలేరు. ఇటీవల డల్లాస్‌లో తెలుగువారు జరిపిన సమావేశంలో ఈ అంశంపై ఆత్మపరిశీలన చేసుకోవాలని తీర్మానం కూడా చేశారు.

2014 ఎన్నికల్లో తెలుగుదేశం, బీజేపీ, జనసేన కలిసి పోటీ చేస్తున్నప్పుడు జేపీ విజయవాడలో నిలబడితే గెలిపిస్తామని పొత్తు గురించి ప్రతిపాదనలో టీడీపీ అగ్రనేతలు తెలిపారు. గెలుపే ప్రధానమనుకుంటే, జేపీ ఆ సీటు తీసుకునేవారు. గ్యారంటీగా గెలిచేవారు. కానీ కులం, అక్రమంగా లెక్కలు చూపని డబ్బు ఖర్చు చేసి గెలిపించేవారు.

ప్రస్తుత ఏపీ అసెంబ్లీలో చిరంజీవిపై ఎమ్మెల్యే బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు దేనికి సంకేతం? ఒక మాజీ ముఖ్యమంత్రిని, సాటి సభ్యుడిని, 40% ఓట్లు సాధించిన పార్టీ అగ్రనేతని, వాడు వీడు అని మాట్లాడటం, సైకో అనటం దిగజారుడు కుల రాజకీయం గాక మరేమిటి? గతంలో కూడా హీరోల అభిమానుల మధ్య గొడవలుండేవి. కానీ ఇప్పుడు హీరోలు రాజకీయాల్లో రావటం వల్ల కమ్మ, రెడ్డి, కాపు కులాల మధ్య యుద్ధంగా అభిమానుల గొడవలు మారుతున్నాయి. రాజకీయాలు సినీ ఫ్యాన్స్‌ని కులసంస్థలుగా ఉపయోగించుకోవటం గతంలో లేని కొత్త ఒరవడి. ఇంకా నయం.. పటేళ్లు, మరాఠాలు, గుజ్జర్లు, మీనాలు, జాట్ల తరహాలో తెలుగు రాష్ట్రాల్లో కమ్మ, రెడ్డి కులస్తులు రిజర్వేషన్లు అడగటం లేదు. ఈడబ్ల్యూఎస్‌ను కూడా వారు

అడగలేదు. తొలగించినా అభ్యంతరం చెప్పరనుకుంటా. అదేవిధంగా, కాంగ్రెస్ వైపు జేపీ మొగ్గు చూపుతారంటూ విశ్లేషకుడు తెగ విమర్శ చేశారు. ఇప్పుడు అందరూ జేపీ బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని యతిప్రాసలతో అంటున్నారు. కొందరు తెలుగుదేశం అంటే, ఇంకొందరు జనసత్తా అంటూ జనసేనతో కలిపారు. కాంగ్రెస్‌లో లోక్ సత్తాను విలీనం చేస్తే జేపీని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రిని చేయటానికి కూడా కాంగ్రెస్ అధిష్టానం సిద్ధపడింది. వద్దనుకుంటే, యూనియన్ కేబినెట్‌లో మంత్రిపదవి. లోక్‌సత్తా సమాజంలో మౌలిక మార్పు (ట్రాన్స్ ఫర్మేషనల్ పాలిటిక్స్) కోసం వచ్చింది తప్ప, పదవుల బేరసారాలకు (ట్రాన్సాక్షనల్ పాలిటిక్స్) కోసం రాలేదని జేపీ చాలా స్పష్టంగా చెప్పారు. తర్వాత ఆ ఆఫర్ ని ప్రజా రాజ్యానికి ఇస్తే, మరో ఆలోచన కూడా లేకుండా జెండా పీకేశారు. ఏం జరిగిందో పవన్ కళ్యాణ్‌ని అడిగినా చెబుతారు. చివరికి లోక్‌సత్తా స్ఫూర్తితో వచ్చిన ఆమ్‌ఆద్మీ పార్టీ (ఆఫ్) ఢిల్లీలో అధికారంలోకి వచ్చినా, వారూ విలీనం చేయమని కోరినా జేపీ అంగీకరించలేదు. బీజేపీ జేపీకి గవర్నర్ పదవి ఇస్తుందని కొన్నాళ్లు ప్రచారం చేశారు. పార్టీ ఎన్నికల్లో పోటీ చేయకపోవటం మినహా మిగతా రాజకీయాన్ని యథాతథంగా లోక్‌సత్తా కొనసాగిస్తోంది. వ్యవస్థలో మౌలిక మార్పు కోసం రాజకీయ, పాలనా సంస్కరణలకు ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలతో కలసి పనిచేస్తోంది. అన్నట్లు కొన్నాళ్ల క్రితం వైకాపాలో చేరతారని కూడా వదంతులు వచ్చాయి. జగనా, చంద్రబాబా, మోదీయా, పవన్ కళ్యాణా లోక్‌సత్తాకి అనవసరం. ప్రజలకు మంచి చేసే ఆచరణసాధ్య సంస్కరణలు తీసుకురండి, కీర్తి మీరే తీసుకోండి.. ఇదే లోక్‌సత్తా విధానం. ఎన్నికల్లో పోటీ చేయకపోవటం వల్ల పార్టీ రిజిస్ట్రేషన్ రద్దయినా సరే అదే ఎజెండా, విధానాల కోసం నిరంతర కృషి కొనసాగుతుంది, ఈ నేపథ్యంలోనే..'రాజకీయ పార్టీల ఉచ్చులో మీ భవి ష్యత్తును కోల్పోవద్దు, పార్టీల నాయకులకు వచ్చే నష్టమేమీ లేదు, చంద్రబాబు, జగన్, పవన్ కళ్యాణ్‌లు పదవులు లేకుంటే విదేశాల్లోనైనా దర్జాగా బతకగలరు. మీరు, మీ పిల్లల జీవితాల్ని చూసుకోండి. పార్టీలంటే మతం లాగా, నాయకులంటే దేవుళ్లలాగా పిచ్చిగా ప్రవర్తించకండి' అని ప్రజలకు జేపీ హితవు చెబుతున్నారు. ఇది ధర్మాగ్రహం, వాస్తవ పరిస్థితికి అవసరమైన ఆగ్రహం. తెలుగుదేశం అంటే కమ్మవారి పార్టీ, వైకాపా రెడ్ల పార్టీ, జనసేన కాపు కులస్తుల పార్టీ అన్న ముద్రలేదని చెప్పమనండి.

చివరిగా, ఒక ప్రస్తావన. గతంలో ఒకసారి గద్దర్ లోక్ సత్తా కార్యాలయానికి వచ్చారు. జేపీతో జరిగిన సమావేశంలో ఈ రచయిత కూడా పాల్గొన్నారు. కులాన్ని, వివక్షని తీవ్రంగా వ్యతిరేకించే గద్దర్ చాలా స్పష్టంగా చెప్పారు – కులం యాదృచ్ఛికం, ఎక్కడ పుట్టాలనేది ఎవరి చేతిలో ఉండదు అని. మనం ఒక కులంలో, ఒక ప్రాంతంలో పుట్టినాక వాటిని అంటగడతారు. వద్దన్నా మన చుట్టూ మన కులస్తులు ఎక్కువగా ఉంటారు. అధికారాన్ని పూజించే సమాజం కాబట్టి, తక్కువ ఆదాయాలతో ఆత్మన్యూనతకు గురవుతూ సినిమా హీరోల్లో, కుల నాయకుల్లో, రాజకీయ పార్టీల అగ్రనేతలు వంటి వారిలో తమ అభద్రతను కప్పిపుచ్చే అస్తిత్వ భావాన్ని వెతుక్కుంటుంటారు. వారిని తప్పు పట్టనక్కర్లేదు.

అదేవిధంగా, ఒకే కులం కాబట్టి ఈనాడు, ఆంధ్రజ్యోతి మీడియాల్లో జేపీ, లోక్‌సత్తా వార్తలు వద్దు అని చెబుతామా, అత్యధిక సర్క్యులేషన్, వీక్షణలు ఉన్న వారి సేవలు వినియోగించుకోవాలనుకుంటామా? అదేవిధంగా, దేశ యువత, భవిష్యత్తు తరాల మీద అన్యాయమైన, మోయలేని భారం వేసే పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్)ను తిరిగి తీసుకువస్తామని కాంగ్రెస్ సహా కొన్ని ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల హామీనిచ్చాయి. ఈవేళ రూపాయి జమ చేయకుండా, ఎప్పుడో రిటైరయ్యే ప్రభుత్వోద్యోగులకు అప్పటి తరంవారు భారీగా తమ పన్నుల డబ్బు పెన్షన్ గా చెల్లించాలన్న ఆ విధానం ఎంత ప్రమాదకరమో జేపీ అనేక మార్లు స్పష్టం చేశారు. 3% ప్రభుత్వోద్యోగుల కోసం 97% ప్రజల, వారిలో అత్యధికులు అసంఘటిత రంగంలో, రెక్కాడితేగానీ డొక్కాడని స్థితిలో జీవిస్తున్న దేశంలో ఇది ఆచరణలో అసాధ్యమవుతుందన్నారు. ప్రపంచంలో అత్యంత సంపన్న దేశాలు కూడా ఈ విధానం అమలు చేయటం లేదన్నారు. ఇలాంటి ఓపీఎస్ ఇచ్చిన డెట్రాయిట్ నగరం 2003లో దివాళా తీసిన విషయాన్ని గుర్తు చేస్తూ వివరిం చారు. పౌర సమాజం, పార్టీల్లో, మీడియాలో పలువురికి విషయం క్రమంగా అర్థమైంది. కానీ సామాన్య ప్రజలకు, ప్రభుత్వోద్యోగుల్లోనే బాధ్యత గలవారికి అర్థమయ్యేందుకు ఆ భావాలన్నిటినీ ఒకచోట కూర్చి, జేపీ వ్యాసాలు రాస్తే.. ఇవేపత్రికలు ఒకే కులం కాబట్టి ప్రచురించలేదు. 'మాకున్న పాఠకుల్లో అత్యధికులు టీచర్లు, ఇతర ప్రభుత్వోద్యోగులు. వారితో గొడవ పెట్టుకుంటే, మాకు పాఠకులతోపాటు ప్రభుత్వ వాణిజ్య ప్రకటనలకు కూడా గండికొడతారు. సారీ' అన్నారు. ఇక్కడ కులం ముఖ్యమైందా? వ్యాపార ప్రయో జనం ముఖ్యమైందా? చివరికి జేపీ గట్టిగా చెప్పటంతో రాహుల్ గాంధీ లాంటి వారు, తెలంగాణ, ఏపీ, కర్ణాటక ప్రభుత్వాధినేతలు వెనక్కితగ్గారు కానీ, విశ్లేషకులవారు అం టున్న ఒకే కుల పత్రికలు మాత్రం ధైర్యం చేయలేదు. ప్రజా ప్రయోజనాలు మీడియా బాధ్యతల్లో భాగమైనా.. వారు చొరవ చూపలేక పోయారు. చివరికి, సొంత సోషల్

మీడియా ఖాతాల్లో, కొన్ని ఆంగ్ల పత్రికల్లో జేపీ తన వాదన వినిపించారు. కాబట్టి, మీడియా వారు కులవివక్ష లేకుండా లక్ష్యం దిశగా పని చేస్తున్నంత వరకూ వారిని ప్రోత్సహిం చాల్సిందే. లేకుంటే, కొండ నాలుక్కి మందేస్తే ఉన్న నాలుక ఊడుతుంది. అదే సమయంలో వ్యాపార షరతులు వర్తిస్తాయి.

అదేవిధంగా, కులం శాశ్వతంగా పోవాలంటే, కులాంతర వివాహాలు చివరి దశ. అయితే వివాహం ప్రత్యేకమైనది, దీర్ఘకాలికమైనది. ఆర్థిక భరోసా, నిజాయతీ, సామర్థ్యం, పరిణతి, సమస్యలను ఎదుర్కొనే నైపుణ్యం, ధైర్యం, సమయస్ఫూర్తి మొదలైన అనేక లక్షణాలు కావాలి. అలాకాకుండా ఆదర్శం కోసం కులాంతరో, మతాంతరో వివాహం చేస్తే.. జీవితాంతం మనకు పడి ఏడుస్తారు. మనకు బలంగా పనిచేసే కుటుంబ వ్యవస్థ బలహీనతగా మారుతుంది. అందుచేత, కుల పరిణామక్రమంలో ఈ దశ రావటానికి కొన్ని తరాలు పట్టవచ్చు. కానీ ఈలోగా రాజ కీయం కులాన్ని ఉపయోగించుకోకుండా చేయటం, కులాన్ని పలచన చేసే పట్టణీకరణను ప్రోత్సహించటం అవసరం.

అయ్యా, విశ్లేషకులవారూ! కులం పోవాలంటే ప్రజాస్వామ్యం పరిణతి చెందటం కీలకం. ఇందుకోసం ఆదాయాలు పెర గటం, నాణ్యమైన చదువు అందటం, చట్టబద్ధపాలన, స్థానిక ప్రభుత్వాల సాధికారత అత్యవసరం. వీటి కోసం నిరంతరం పోరాడుతున్నదెవరు? అధికారంలో ఉన్న చంద్రబాబు, రేవంత్, మోదీలను, ప్రతిపక్షంలో ఉన్న రాహుల్ ను వీటి కోసం మీరు ఎప్పుడైనా డిమాండ్ చేశారా? మీ ఇంట్లో దళి తులకు భోజనం పెడతామని చెప్పారు. అన్ని ప్రభుత్వాలూ వద్దన్నా ఉచిత బియ్యం ఇస్తున్నాయి, వండి వారుస్తున్నాయి, ముఖ్యమంత్రి సహా కొన్ని సందర్భాల్లో దగ్గర కూర్చుని ముద్దలు చేసి మరీ తినిపిస్తున్నారు. కానీ రేపు ఆకలేయదా? వాళ్లు ఎల్లకాలం భోజనానికి ప్రభుత్వ దయా దాక్షిణ్యాల మీదే ఆధారపడాలా? వారి కాళ్ల మీద వారు నిలబడి పౌష్టికాహారం సంపాదించుకోలేరా? తమ పిల్లల్ని తమ కంటే ఆరోగ్యవంతులుగా, సంపన్నులుగా మార్చలేరా? .. అలా చేయాలంటే నాణ్యమైన విద్య కావాలి. హాస్టళ్లకో, స్కూళ్ల కో వెళ్లి భోజనం తినిపిస్తారుగానీ, చదువు ఎలా చెబుతున్నా రు, మార్కెట్ లో పనికొచ్చే, బుద్ధి వికసించే చదువేనా? అని మాత్రం అడగరు. చేపల గురించి చైనా సామెత వినలేదా? ఎంతో నిజాయతీపరులైన కమ్యూనిస్టుల గురించి కొన్నేళ్ల క్రితం ఓ విదేశీ సామాజిక విశ్లేషకుడు కొన్నేళ్లపాటు మన దేశంలో పరిశోధనలు చేసి, మిగతా కమ్యూనిస్టు దేశాలకు భిన్నంగా భారత్‌లోని ఆ పార్టీవారు, తీవ్రవాద వామపక్ష వాదులైన నక్సలైట్లు సహా నాణ్యమైన విద్య పేదలకు, అణగారిన కులాలకూ అందాలని ప్రయత్నించకపోవటానికి కారణం – సైకాలజీ ఆఫ్ క్యాస్ట్ అని తేల్చిచెప్పారు. పని మనుషులకు భోజనం పెడతారు, మంచి బట్టలిస్తారు, పండగ చేస్కో అని అప్పడప్పుడూ టిప్పులిస్తారు.. కానీ వారి పిల్లలు మన పిల్లలతో సమానంగా చదువుకోవాలని కోరుకోరు. అంచేత భోజనం గురించి మాత్రమే చేస్తే అంత ఘనంగా చెప్పుకోనక్కర్లేదు. సైకాలజీ ఆఫ్ క్యాస్ట్‌ని కొంచెం ఆత్మపరిశీలన చేసుకోండి విశ్లేషకా! కమ్మ కులస్తులు సంఘాల పేరుతో వివిధ కార్యక్రమాల్ని నిర్వహిస్తుంటాయి. మిగతా అన్ని కులాల్లాగే. వాటికి ఆహ్వానించినా జేపీ వెళ్లరు. ఆయన వెళ్లకపోయినా.. కమ్మ సంఘాల వారు తాము ప్రచురించే సావనీర్లు వంటి వాటిలో జేపీ బొమ్మ వేసుకుని ఆయన విజయాల్ని సగర్వంగా చాటుకుంటారు. ఎవరి మూలంగా ఎవరికి గౌరవం వచ్చింది?

అయినా, మీరు భుజాలు తడుముకుని మాట్లాడారుగానీ, జేపీ కమ్మ కులం గురించి ప్రస్తావించారా? పూర్వం ఎవరో తత్వవేత్త చెప్పినట్లు.. తెలిసిన విషయాలు మాత్రమే చెప్పటం, తెలియని విషయాల పట్ల మౌనం పాటించటం గౌరవాన్ని కాపాడుకునే పద్ధతి, సభా మర్యాద. ఈ డిజిటల్ యుగంలో కూడామీడియా ఇంటర్వ్యూల్లోనూ అదే మర్యాద! 1973 నుండి ప్రజాజీవితంలో బహుముఖ కృషి చేస్తున్న జేపీ విశ్వసనీయత కోసం గత చరిత్రను చూడనక్కర్లేదు. 52 ఏళ్ల ఇండస్ట్రీ కాబట్టి నమ్మనక్కర్లేదు. ప్రతి రోజూనీకొత్తగా, ప్రతి అంశాన్నీ దేనికదే విడిగా చూసి నిర్ణయం తీసుకోవచ్చు. హేతుబద్ధత, వాస్తవాలు, తర్కం, ప్రపంచ అనుభవాలు, భారతదేశ పరిస్థితులు, అందరి ప్రయోజనాల సమన్వయమూ ప్రాతిపదికగా ఆలోచించండి చాలు.. జేపీ మాటల్లోని వాస్తవం అర్థమవుతుంది.

రాజకీయాన్ని కులం నుంచి వేరు చేయటం కోసం, ప్రజలకు పార్టీల పిచ్చి లేకుండా వారి అభివృద్ధి, సమాజహితం గురించి ఆలోచించి ఓటు వేసేలా చేయటం కోసం ఎన్ని కలు, రాజకీయ వేదికలపై కార్యక్రమాలు వంటి సంద ర్భాల్లోనే జేపీ కులాన్ని విమర్శిస్తున్నారన్న అవగాహన ఏమాత్రం ఉన్నా.. ఆ విశ్లేషకునితో వీడియో చేయాల్సిన అవ సరం వచ్చేది కాదుబీ మేం ఈ సమాధానం ఇవ్వాల్సిన అవ సరమూ వచ్చేది కాదు.

అలాంటివారందరికీ వినమ్రంగా విజ్ఞప్తి – మీ సమయాన్ని కుల రక్షణ కోసం కాకుండా, ప్రజా స్వామ్యం ద్వారా ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాల కోసం, నివారించదగ్గ బాధలను తొలగించటం కోసం నాణ్యమైన విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన, చిన్న పట్టణాల అభివృద్ధితో గ్రామీణ–పట్టణ అంతరాలను తొలగించటం, ఆర్థిక క్రమశిక్షణ, పెట్టు బడులను ప్రోత్సహించటం, సత్వర న్యాయం మొదలైన వాటికి వినియోగించటం మంచిది. ✯

# ఆంధ్రప్రదేశ్ లో ప్రజా ఉద్యమాలకి శ్రీకారం చుట్టండి: జేపీ

## రాష్ట్ర లోక్‌సత్తా అధ్యక్షుడిగా మరోసారి భీశెట్టి బాబ్జీ..

## 6 లక్ష్యాలతో కార్యాచరణ!




ఎన్నికలు, పక్షపాత రాజకీయాలతో సంబంధం లేకుండా ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా కలిసివచ్చే ప్రజాసంఘాలతో కలసి లోక్‌సత్తా ప్రజా ఉద్యమాలకి శ్రీకారం చుడుతుందని, ఇందు కోసం ఉద్యమాల్లో సీనియర్ నేత భీశెట్టి బాబ్జీకి లోక్‌సత్తా ఏపీ అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ తెలిపారు.

అక్టోబర్ 16న హైదరాబాద్ జాతీయ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సీనియర్ నేతలతో జేపీ సమావేశమయ్యారు. ఎన్నికల వేళ మాత్రమే ఎన్నికల రాజకీయాల కోసం మాట్లాడాలని..ఎన్నికల తరువాత విద్య, ఆరోగ్యం, ఉపాధి, అధికార వికేంద్రీకరణ, పౌర సేవలు, ప్రజల అవసరాలు, చట్టబద్ధ పాలన, వ్యవసాయంలో ఆదాయం, రాజకీయ సంస్కరణలు తదితర అంశాలపై ప్రజలను చైతన్యవంతులను, కార్యోన్ముఖుల్ని చెయ్యాల్సిన అవసరం ఉందన్నారు. దాని కోసం భీశెట్టి బాబ్జీ నాయకత్వంలో రాష్ట్ర వ్యాప్తంగా కలిసొచ్చేవారితో ఉద్యమాలు జరుగుతాయని భావిస్తున్నట్లు జేపీ తెలిపారు.

ప్రజల అవసరాలు గుర్తించి సమస్యలో భాగం కాకుండా, వాటి పరిష్కారంపై దృష్టి సారించి పాలకులపై వత్తిడి తెచ్చే సరికొత్త వ్యవస్థను, కొత్త నాయకత్వాన్ని లోక్ సత్తా తయారు చేయాలని జేపీ సూచించారు. ఇందుకోసం ఆరు అంశాలతో లోక్‌సత్తాని పునర్నిర్మాణం చేశామన్నారు. ప్రభుత్వ విధానాలపై హేతుబద్ధంగా చర్చను చేపట్టడం అత్యవసర మన్నారు.ఇందుకు కార్యాచరణను భీశెట్టి బాబ్జీ తయారు చేస్తారని జయప్రకాష్ నారాయణ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ లోక్ సత్తా లక్ష్యాలను వివరించే గోడ పత్రికను విడుదల చేశారు. సమావేశంలో లోక్ సత్తా సీనియర్ నాయకుడు పంచాది రాంబాబు, సాయి రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

**స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాల అభినందనలు**

లోక్‌సత్తా ఏపీ అధ్యక్షునిగా తిరిగి ఎన్నికైన భీశెట్టి బాబ్జీకి విజయనగరంలో ఘనస్వాగతం లభించింది. జిల్లా స్వచ్ఛంద సంస్థల సమాఖ్య కన్వీనర్, ఇంటర్నేషనల్ యునైటెడ్ కలాం ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి ఇప్పలవలస గోపాలరావు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు అలక రాజు, జిల్లా పౌర వేదిక సభ్యులు తుమ్మగంటి రామ్మోహనరావు, అల్లంశెట్టి నాగభూషణరావు, బోర రమేష్, వెంకటేష్, జిల్లా అద్దె వాహనాల డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు కర్రోతు రాము, సభ్యులు వెలిశెట్టి లక్ష్మణరావు, అల్లు రమేష్, అప్పారావు తదితరులు పార్టీలకతీతంగా లోక్‌సత్తా చేపట్టే కార్యక్రమాలకు తమ మద్దతును ప్రకటించారు.

★

# బీహార్ ఎన్నికల హామీలు - భారత్‌కి పాఠాలు




భారతదేశానికి రాజనీతి దిశానిర్దేశం చేసిన, బుద్ధుడు వంటి మహనీయులు నడయాడిన బీహార్ ప్రాంతం బీమారీ, వెనుకబడిన ప్రాంతంగా పేరుమోయటానికి దశాబ్దాల దుష్పరిపాలనే కారణమని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఇందుకు రాజకీయ నేతలతోపాటు అధికార యంత్రాంగం కూడా ప్రధాన కారణమన్నారు.

బీహార్ అసెంబ్లీ ఎన్నికల తీరుపై జేపీ ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో స్పందిస్తూ, నితిష్ కుమార్ ముఖ్యమంత్రి అయి కొంత ఆశ కనిపిస్తున్న నేపథ్యంలో కొన్నేళ్ల క్రితం బీహాంకి ఎక్కువ నిధులు ఇవ్వాలని తాను ఢిల్లీలోని ఓ అత్యున్నతస్థాయి సమావేశంలో కోరితే.. తన పేరు చూసి మీ సొంత రాష్ట్రం కాబట్టి ఎక్కువ నిధులు అడుగుతున్నారా? అని ఒక అధికారి విమర్శించాడన్నారు. లోక్‌నాయక్ పేరు తనకు పెట్టారు తప్ప తాను బీహారీని కాదని చెప్పాక, ఆశ్చర్యపోయారన్నారు. బీహార్ బాగుపడితే భారతదేశం బాగుపడుతుందన్నారు. బీహార్‌లో ప్రస్తుతం యువత పెద్దసంఖ్యలో ఉన్నారని, సరైన ఎజెండాతో వారిని నడిపిస్తే రాష్ట్రానికి పూర్వవైభవం తేవొచ్చన్నారు. ఆర్థికంగా తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిన ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక పెన్షన్లు ఏ రాష్ట్రంలోనూ లేనిరీతిలో నెలకు రూ.4,000 ఉంటే, బీహార్‌లో వృద్ధాప్య పింఛను కేవలం రూ.400 ఉండటం బాధాకరమన్నారు. ఇటీవల ఎన్నికల హామీగా రూ.1100కి పెంచారన్నారు.

తాను రాజకీయ పార్టీల, నేతల కష్టాన్ని అర్థం చేసుకోగలనని.. అయితే ఇంటికో ప్రభుత్వోద్యోగం ఇస్తానని బీహార్‌లో ఓ ప్రధాన పార్టీ చేసిన ఎన్నికల వాగ్దానం అత్యంత ప్రమాదకరమని జేపీ అన్నారు. ఉద్యోగాలు సమాజానికి అవసరమైన సేవల నుండి వస్తాయి తప్ప, ప్రభుత్వం ద్వారా రావన్నారు. ప్రభుత్వంలో వెయ్యికి ఒకరు ఉద్యోగం సంపాదించగలరని, మిగతా 999 మంది పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. సమాజంలో అవకాశాలకు కొదవలేదని, కానీ మన మెదళ్లలోని భావ దారిద్ర్యం మనల్ని చొరవతో ఎదగ నీయటం లేదన్నారు. ప్రభుత్వోద్యోగం కోసం ప్రయత్నించటంలో తప్పు లేదని, వస్తే మిగతా సమాజం కంటే ఎక్కువ ఆదాయాలు, జీవన భద్రత, గౌరవం పొందుతున్నందున చిత్తశుద్ధితో సేవలందించాలని జేపీ అన్నారు. కానీ ఆ ఉద్యోగం కోసం విలువైన జీవితకాలాన్ని పణంగా పెట్టటం, రాకపోతే డీలా పడిపోవటం తగదన్నారు. ప్రజల్లో ప్రభుత్వోద్యోగాల వెర్రి మిగతా దేశంతో పోలిస్తే బీహార్‌లో కాస్త ఎక్కువ ఉండొచ్చని, కానీ అన్ని రాష్ట్రాల్లోనూ ఈ పరిస్థితి ఉందన్నారు. యువత అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని, ప్రతి ఇంట్లో ఓ ప్రభుత్వోద్యోగం ఇస్తామనటం ఆచరణలో అసాధ్యమన్నారు.

బీహార్‌లో ప్రస్తుతం ఉన్న 12 లక్షల మంది ప్రభుత్వోద్యోగులకు పెన్షన్లు వంటివి కాకుండా కేవలం జీతాలే నెలకు రూ.80,000 కోట్లు అవుతున్నాయని, అక్కడున్న కుటుంబాల సంఖ్య ప్రకారం అదనంగా 2.5 కోట్ల ఉద్యోగాలిస్తే రూ.16 లక్షల కోట్లు కావాలని, బీహార్ రాష్ట్ర స్థూల ఉత్పత్తి – అంటే బీహార్ లో ప్రజలందరి సంపాదన మొత్తం కలిపి – కేవలం రూ.9,90,000 కోట్లని జేపీ తెలిపారు. అలాంటప్పుడు అంత డబ్బు ఎక్కడ్నుంచి తెస్తారని ప్రశ్నించారు. ప్రపంచంలోనే కనీవినీ ఎరుగని ఈ హామీని దేవుడు కూడా అమలుచేయలేడన్నారు. ఐఏఎస్‌లో 10,000 మందికి 1 అభ్యర్థి ఎంపికవుతున్నారని, ప్రభుత్వంలో 100 గుమాస్తా పోస్టులకు పీ.హెచ్.డీలు, ఇంజినీర్లు వంటి వారు సహా 5–10 లక్షల మంది దరఖాస్తు చేస్తున్నారని అన్నారు. ఈ భావదారిద్ర్యాన్ని భారతీయ యువత వదిలించుకోవాలన్నారు. 'మీరో అద్భుతమైన శతాబ్దంలో ఉన్నారు. ఎన్నడూలేని అవకాశాలు మీకు అందుబాటులో ఉన్నాయి. డిగ్రీ కాగితాలు, ర్యాంకుల కోసం వెంపర్లాడకుండా నిజమైన

విద్యను, నైపుణ్యాల్ని సంపాదించండి' అని యువతకు జేపీ విజ్ఞప్తి చేశారు. భారతదేశంలో ప్రభుత్వాలు ఏడాదికి రూ.90 లక్షల కోట్ల దాకా ఖర్చు చేస్తున్నాయని, అందులో రూ.20,000 కోట్లు బీహార్ కి ఉదారంగా సాయం చేసి అక్కడ చిన్న పట్టణాలను ఆర్థిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తే యువత పొట్ట చేత పట్టుకుని దూరప్రాంతాలకు వలసలు పోవాల్సిన అవసరం ఉండదన్నారు. వలసలు అభివృద్ధికి దోహదం చేస్తాయని, కానీ నిస్సహాయ వలసలు ఉండకూడదన్నారు. ఈవేళ ఫెడరలిజం బలపడి రాష్ట్రాల భవిష్యత్తు రాష్ట్రాల చేతుల్లోనే ఉందని, కానీ ఇప్పటికీ ప్రభుత్వం ఏం చేయాలో ఆ పనుల్ని బీహార్‌లో చేయటం లేదని, పంటలు పండించాల్సిన నదులు బీహార్ దు:ఖదాయినుల్లా 21వ శతాబ్దంలోనూ ఇళ్లను ముంచెత్తుతున్నాయన్నారు. నాణ్యమైన విద్య, ఆరోగ్యం, నైపుణ్యాలు, మౌలిక వసతులు, చిన్న పట్టణాల అభివృద్ధి, చట్టబద్ధపాలనతో మిగతా రాష్ట్రాల కంటే వేగంగా బీహార్ ను అభివృద్ధి చేయవచ్చని, జాతీయ సగటులో కేవలం నాలుగో వంతు తలసరి ఆదాయం (రూ.68,000) ఉన్న బీహార్ ప్రజలను గెలిపించేలా, మిగతా రాష్ట్రాలకూ కొన్ని పాఠాలు నేర్పేలా ఈ ఎన్నికల చర్చ ఉండాలని జేపీ విజ్ఞప్తి చేశారు.




## అధికారులు, పాలకుల వల్లే విద్య అధ్వాన్నం

మూస పద్ధతి నుండి, రాజకీయ నేతలు ఎలాగోలా ఎన్నికల్లో గెలవాలనుకున్నట్లు ఏదోకరకంగా బట్టీ, మార్కులు, ర్యాంకుల ధోరణి నుండి మన పాఠశాల విద్యావ్యవస్థను బాగుచేసి.. కాన్సెప్ట్, మార్కెట్ అవసరాలకు ఆ విద్యను అన్వయించగలగటం, సంక్లిష్ట సమస్యల్ని తెలివిగా పరిష్కరించగలగటం వంటి ధోరణుల్ని పెంపొందించాలని ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్ సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. ఈ నైపుణ్యాల్ని పరీక్షించటం అవసరంగానీ.. ఎప్పుడో ఏడాది చివరన కాకుండా, రెగ్యులర్ గా, కాపీ కొట్టటానికి వీల్లేని, ఒత్తిడి లేని రీతిలో మూడు నాలుగు సెట్ ల ప్రశ్నాపత్రాల్ని జిగ్ జాగ్ గా పంపిణీ చేసి ఆ పరీక్షల్ని నిర్వహించాలన్నారు. డబ్బు, పిల్లల తెలివితేటలు, కష్టపడటంలో ఏ లోటూలేదని.. సమస్యంతా ప్రభుత్వ విధానాల అమలు, అధికారుల నిర్లక్ష్యంలోనే ఉందన్నారు. హైదరాబాద్ మాదాపూర్ లో లాయిడ్ గ్రూప్స్ ధనిక్ భారత్ ఎడ్యుకేషనల్ లోగో లాంచ్ కార్యక్రమంలో జేపీ పాల్గొన్నారు. ఈ రకమైన విద్యను అందిస్తే, అడుగడుగునా మన యువతకు ఉపాధి అవకాశాలు అందుబాటులో కనిపిస్తాయన్నారు. సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ, సివిల్స్ అకాడమీ చైర్మన్ బాలలత, లాయిడ్ గ్రూప్ సీఎండీ విక్రమ్ నారాయణ, డైరెక్టర్ మహేష్ కవతేకర్, ధనిక్ భారత్ సంస్థల డైరెక్టర్లు విక్రమ్ అజయ్ బాబు, విక్రమ్ సురేంద్ర, సీఏ భీముని తిరుపతిరెడ్డి, కందిమళ్ల సాంబశివరావు, ఆళ్ల గిరిబాబు, విజయ్ భాస్కర్, విక్రమ్ రాఘవ, విక్రమ్ నాగార్జున, పూర్ణచంద్రరావు, కొమ్మినేని మురళి, రాయపాటి ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధాలు -నోబెల్ శాంతి బహుమతి

నోబెల్ శాంతి బహుమతి 2025ని వెనిజువెలాకు చెందిన మారియా కొరినా మఖాడోకి ప్రకటించటంతో ప్రపంచంలో చాలా దేశాలు ఊపిరి పీల్చుకున్నాయి. తాము కోరుకుంటున్న ఓ మహాత్ముడికో, ఒక నిస్వార్థ, అసాధారణ ప్రజాస్వామికవాదికో ఈ అవార్డు రావటం వల్ల దేశాలు ఊరట చెందలేదు. యుద్ధాలు ఆపటమే పనిగా అసాధారణ కృషి చేస్తున్న తనకు నోబెల్ శాంతి బహుమతి ఇచ్చేలా మద్దతివ్వాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేస్తున్న ఒత్తిడికి, ఉక్కిరిబిక్కిరికిఈ ఏడాది తెరపడటం వివిధ దేశాలకు ఉపశమనాన్నిచ్చింది.

ఒకప్పుడు ఆర్థికంగా ఓ వెలుగు వెలిగి, 18,000 డాలర్ల తలసరి ఆదాయం దాకా వెళ్లి..ఆర్థిక వ్యవస్థను వైవిధ్యీకరించకపోవటం, ప్రభుత్వోద్యోగాలను పార్టీ ఉద్యోగాలుగా మార్చి, అడిగినవారికి, అడగనివారికి తేడా లేకుండా సంక్షేమమే పాలన, అభివృద్ధి అక్కర్లేదు అనిపందేరాలు చేస్తూ 1999 నుండి 2013 వరకు వెనిజువెలాను నిరంకుశంగా పరిపాలించినహ్యూగో ఛావెజ్ వల్ల ఆ దేశంలో కరెన్సీకి గుర్తింపు తగ్గి కొనుగోలుశక్తి పడిపోయింది. తిండికి కూడా ప్రజలు వెతుక్కోవాల్సి వచ్చింది.



వెనిజువెలాలో చమురు నిల్వలు పుష్కలంగా ఉన్నాయి. కానీ ముడిచమురుకి భారీ గిరాకీ ఉన్న సమయంలో చమురు బావులన్నిటినీ ఛావెజ్ సోషలిజం పేరుతో జాతీయీకరించారు. అన్నీ ప్రభుత్వమే.. అని ప్రయివేటు రంగాన్ని అణగదొక్కారు. ఆయన మరణం నాటికి మిగతా పార్టీలన్నీ నామమాత్రమవటం, అధికార పార్టీ ఏకపక్షంగా ఎన్నికల్ని శాసిస్తుండటంతో ఛావెజ్ వారసుడిగా నికోలస్ మదురో అధ్యక్షుడయ్యారు. మదురో దురదృష్టమో ఏమో, మొత్తానికి చమురు ధరలు ఒక్కసారిగా పడిపోయాయి. అయినా, పాత విధానాలనే కొనసాగించటం వల్ల రాజకీయ కేంద్రీకరణతోపాటు ప్రజల్లో అసంతృప్తి పెరగసాగింది. సంక్షోభానికి మూలకారణాల్ని అన్వేషించ కుండా ఎన్నికల్లో గెలవటమే నాయకత్వం అనే రీతిలో మదురో వ్యవహరించటం ట్రంప్ 1.0లో అమెరికా ఆంక్షలకి దారితీసింది. ఆ తర్వాత మళ్లీ ఎన్నికల్లో మారియా కొరినా మఖాడో ప్రతిపక్షాలని అతికష్టం మీద ఏకం చేసి పోటీ చేసి ఓట్లలో భారీ ఆధిక్యం పొందినా దబాయించి మరీ తానే గెలిచానని మదురో ప్రచారం చేసుకున్నారు. మఖాడో ఆధిక్యం వివాదాస్పదం గానీ.. అంతర్జాతీయ పరిశీలకులు ఆమె ఘనవిజయాన్ని ఖరారు చేయటం మనకు హేతుబద్ధ ఆధారం. ఈనేపథ్యంలో, అమెరికా ఆంక్షలు ఇంకా ఎక్కువయ్యాయి.మీడియా స్వేచ్ఛలో వెనిజువెలా ఏకంగా 42 స్థానాలు దిగజారింది. వేలమంది విచారణ లేకుండా ఉరిశిక్షకు గురయ్యారు. సుమారు 70 లక్షల మంది దేశం విడిచి పారిపోయినట్లు అంచనా. 'నియంతృత్వం నుంచి ప్రజాస్వామ్యానికి' దేశాన్ని మళ్లించేందుకు సాహసోపేత పోరాటం చేశారంటూ మారియా కొరినా మఖాడోకి 2025 నోబెల్ శాంతి బహుమతిని ప్రకటించారు.

అన్ని దేశాలకన్నా చమురు నిల్వలు అత్యధికంగా ఉన్నా.. అమెరికా వంటి దేశాలు ఆంక్షలు విధించటంతో వెనిజువెలా ఆర్థిక స్థితి దిగజారిందని, అలాంటి అమెరికాకు, ఇతర విదేశీ బహుళజాతి కంపెనీలకు వెనిజువెలా సార్వభౌమాధికారాన్ని మఖాడా తాకట్టు పెడుతున్నారనే ఆరోపణలున్నాయి. అదే విధంగా ఇజ్రాయిల్ కు మద్దతివ్వటం ద్వారా సామ్రాజ్యవాద ధోరణుల్ని పెంచుతున్నారని, వెనిజువెలాలో పలువురు అకారణ ప్రాణత్యాగాలకు కారణమయ్యారనే ఆరోపణలున్నాయి. ట్రంప్ని ప్రసన్నం గావించుకునేందుకే అమెరికాకు అనుకూలమైన మఖాడోకు నోబెల్ శాంతి బహుమతి ఇచ్చారనే వాదనలూ ఉన్నాయి. అవార్డును ట్రంప్ కి అంకితమిస్తున్నట్లు ఆమె చెప్పటం అందుకు రుజువనుకోవచ్చు. ఈ అవార్డుకి ట్రంప్ అన్ని విధాలా అర్హుడని మఖాడో ఫోన్ చేసి మరీ అభినందించారు. మొత్తమ్మీద ట్రంప్ శాంతించి, ఆమె నేతృత్వంలో మరింత సాయం అందిస్తాననిహామీ ఇచ్చారు.

ఇండియా విషయానికొస్తే.. భారతీయ రైతుల ప్రయో జనాలను కాపాడటం కోసం అమెరికా వ్యవసాయ దిగు మతుల్ని తోసిపుచ్చటంతోపాటు.. పహల్గాం దాడుల నేపథ్యంలో భారత్–పాక్ యుద్ధాన్ని తానే ఆపానని, ఏడు యుద్ధాలు ఆపినందున తనకు నోబెల్ బహుమతి రావాలని 2.0 హయాంలో ట్రంప్ ఎన్నిసార్లు చెప్పినా ప్రధాని మోదీ పట్టించుకోలేదు. దీంతో ట్రంప్ కోపం కట్టలు తెంచుకుని భారత్పై వాణిజ్య ఆంక్షలు విధించటంతోపాటు శాప నార్థాలూ పెట్టారు. అయితే నోబెల్ శాంతి బహుమతి ప్రకటన వెలువడ్డాక కాస్త సర్దుకున్నారు. గాజా యుద్ధంతో కలిపి 8 యుద్ధాలు ఆపానని, అయితే నోబెల్ బహుమతి కోసం తాను యుద్ధాల్ని ఆపలేదని చెప్పుకొచ్చారు. అయినా తాను కృషి చేసింది 2025లో కాబట్టి, గతేడాది కృషి ఆధారంగా ఇచ్చే నోబెల్ బహుమతి తనకు వర్తించదని ప్రాప్తకాలజ్ఞతను ప్రదర్శించారు. భారత్లో తనకు గొప్ప స్థానంలో ఉన్న గొప్ప మిత్రుడున్నాడని మోదీని మళ్లీ

ప్రశంసించటం మొదలుపెట్టారు.

ఇతర చెడ్డ లక్షణాలను అలా ఉంచితే, ట్రంప్‌లోని ఈ సరళత్వం చాలా గొప్పది. తా బట్టిన కుందేలుకి మూడే కాళ్లుఅని భీష్మించుకోరు. నిజాయితీకి విలువ వచ్చినప్పుడు నిజాన్ని నిర్మొహమాటంగా ఒప్పుకుంటారు. మోదీ.. ఇదే అదనుగా ఒకటికి రెండుసార్లు ట్రంప్ కృషిని గాజాకు సంబంధించి ప్రశంసించారు. మన బృందాలు వాణిజ్య చర్చల కొనసాగింపుకి మళ్లీ అమెరికా వెళ్లాయి. ట్రంప్‌ని ఎలా డీల్ చేయాలో మిత్రుడు మోదీకి తాను చెబుతానన్న ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నెతన్యాహూ కూడా ట్రంప్ చెవిలో ఏదో ఊదినట్లున్నారు. మొత్తమ్మీద భారత్‌కి పరిస్థితులు కాస్త సర్దుకున్నాయి.

అసలు ఇదంతా మాజీ పోటస్ ఒబామా వల్ల వచ్చిందని కొందరు చిరాకు పడుతున్నారు. ఓ పార్టీలో ట్రంప్ వ్యసనాలపై ఒబామా నైతిక ఆధిపత్య ధోరణితో వ్యాఖ్యానించారట. దాంతో ఎలాగైనా అమెరికా అధ్యక్షుడ వ్వాలని, ఒబామా లా నోబెల్ శాంతి బహుమతిని సాధిం చాలని ట్రంప్ సంకల్పించారట. తనకు ఎందుకు నోబెల్ శాంతి బహుమతి ఇచ్చారో తనకే తెలియదని ఒబామా అన్న మాటను సైతం ట్రంప్ పట్టించుకుంటే, ఈ గొడవ ఉండేది కాదు. కానీ ఒబామాకు ఇచ్చినప్పుడు నాకూ ఇవ్వాల్సిందే ఈ అవార్డు అంటున్నారు. ట్రంప్‌తో వ్యక్తిగత అవసరం లేకున్నా, అమెరికాతో అవసరాలున్నాయి కాబట్టి.. అన్ని దేశాధినేతలూ తందానా అంటున్నారు. నిజానికి ట్రంప్ స్టయిల్ ఆయన్ని దెబ్బతీస్తోందిగానీ, ఆయన కుదిర్చిన అబ్రహం ఒప్పందం అపూర్వమైనది. గేమ్ ఛేంజర్. అదేవిధంగా, ఇటీవల గాజా యుద్ధాన్ని శాశ్వతంగా ఆపగలిగితే, మరో గొప్ప విజయం. సహస్రాబ్దుల ఘర్షణను ఒక కొలిక్కి తెచ్చినవారవుతారు. ఉక్రెయిన్ యుద్ధాన్నీ ఆపగలిగితే ఇంకో ఘన విజయమవుతుంది. ఇప్పటివరకూ తాను ఆపిన యుద్ధాల శాంతి కృషిని ఒకడుగు ముందుకు, రెండడుగుల వెనక్కి కాకుండా ప్రపంచశాంతి లక్ష్యం దిశగా ట్రంప్ నడిపిస్తే మంచిదే.

మళ్లీ నోబెల్ శాంతి బహుమతి నామినేషన్ల పర్వం వచ్చే వరకూ ట్రంప్ కాస్త నింపాదిగా, విజ్ఞతతో ఆలోచించే అవకాశం ఉందని ప్రపంచ దేశాలు భావిస్తున్నాయి. వచ్చే నోబెల్ శాంతి బహుమతి నాటికి మిగతా దేశాలు కూడా ట్రంప్ నామినేషన్ ని బలపరిచేలా మేం చర్యలు తీసుకుంటాం అని యూదు, ముస్లిం దేశాల నేతలు నమ్మబలికారు. వారిలో మోదీ కూడా ఉండొచ్చు. తర్వాత ఏం జరుగుతుందో చెప్పలేం కాబట్టి.. మళ్లీ నోబెల్ గొడవ మొదలయ్యేలోగా మిగతా దేశాల్లా మనం కూడా వాణిజ్య ఆంక్షల విషయంలో సర్దుబాటు చేసుకుంటే మంచిది. సుంకాల భారం అమెరికావారి మీద ఎక్కువైతే వారు చూసుకుంటారు. మేం మొదట అమెరికన్లం, ఆ తర్వాతే భారతీయులం అని ఎన్నారైలు అంటున్నారు కాబట్టి, మరీ సమస్య ఎక్కువైతే వారి సంగతి అప్పుడు ఆలోచిద్దాం. ప్రస్తుతానికి శాంతి మంత్రంతో మన ఆర్థిక వ్యవస్థను వేగంగా పెంచే మార్గాల మీద దృష్టి సారించి, సమ్మిళిత అభివృద్ధితో స్వదేశీ మార్కెట్ ను విస్తరించుకుందాం.

ఈ మొత్తం ఎపిసోడ్ లో ఆసక్తికర మెరుపు ఏమిటంటే, వెనిజువెలా ఏ విధానాలను అనుసరించయితే దివాళా తీసిందో, మఛాడా వంటి నోబెల్ శాంతి బహుమతి విజేతను తయారుచేసిందో.. అవే విధానాలను తమ పార్టీ అధికారంలో ఉన్న తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్ లలో అమలు చేస్తున్న కాంగ్రెస్ లోక్ సభా పక్ష నేత రాహుల్ గాంధీ– ఇదే వెనిజువెలా ఉన్న లాటిన్ అమెరికాలో పర్యటిస్తూ భారత ప్రజాస్వామ్యాన్ని విమర్శించటం. అది కూడా తాను పరిష్కారంలో భాగం కాకుండా. ఇంకా విచిత్రమేమంటే, ఇదేసమయంలో భారత్‌లోని కొందరు కాంగ్రెస్ నాయకులు మఛాడా తరహాలో రాహుల్ కూడా ప్రజాస్వామ్య పునరుద్ధరణకు పోరాడుతున్నందున ఆయనకూ నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని డిమాండ్ చేయటం. ఇంతకీ భారత ప్రజాస్వామ్యం గురించి మఛాడో మాత్రం చాలా ఆరాధనాభావంతో మాట్లాడారు.

మనం సోషల్ మీడియాలో, రోజువారీ రాజకీయంలో, సామాజిక జీవనంలో చిన్నచూపు చూస్తున్న మహాత్మాగాంధీ విలువను, కొన్ని లోపాలున్నా భారత ప్రజాస్వామ్యం ఘనతను భారత్ లోని ఓ జాతీయ ఛానల్ ఇంటర్వ్యూలో ఒకరకంగా మనకు చెంపపెట్టులా మఛాడోతెలియచెప్పారు. అన్నిటినీ మించి, తన అపార అనుభవం నుండి ఆమె భారత ప్రజాస్వామ్యానికిచ్చిన సందేశం ఎంతో విలువైనది. ముఖ్యంగా యువతకు. 'ప్రజాస్వామ్యం దానంతటదే మనుగడ సాగిస్తుందని మనం వ్యక్తిగత జీవితంలో కొట్టుకుపోతూ వదిలేస్తే, ఏదోకరోజు అందుకు మూల్యం చెల్లించాల్సి వస్తుంది. ప్రజాస్వామ్యాన్ని, అందులోని స్వేచ్ఛ, హక్కుల్ని ప్రతిరోజూ కాపాడుకుంటుండాలి' అన్నారామె.

మనం మఛాడోకు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వటంతో ఏకీభవించకపోవచ్చు, కానీ ఆమె ప్రజాస్వామ్యం గురించి ఇచ్చిన సందేశం మాత్రం వాస్తవం. తత్వవేత్త రాజు అవ్వాలని, పరిపాలనకు ప్రత్యేకించి ఎటువంటి ఉమ్మడి నిబంధనలూ అక్కర్లేదనిరాసి, ఆ తర్వాత నాలిక్కరచుకుని 'చట్టాలు' ఎందుకు అవసరమో వివరిస్తూ మరో పుస్తకం రాసిన ప్లేటో వ్యక్తం చేసిన భావాల్ని మఛాడో మాటలు మరోమారు గుర్తుచేస్తున్నాయి.. 'సమాజహితాన్ని పట్టించుకోని మంచివారికి పడేశిక్ష – చెడ్డవారి పాలనలో మగ్గిపోవటం' అని ప్లేటో వేల ఏళ్ల క్రితమే పేర్కొన్నారు. తాను ఆచరించి చూపిన సత్యం, అహింస సహా అనేక భావాల గురించి మహాత్మాగాంధీ చెప్పినట్లు.. ఇవేవీ కొత్త విషయాలు కావు. కాలాతీత సత్యాలను ప్రపంచం విస్మరించినప్పుడు వాటిని తెలియచేస్తూ ముందుండి నడిపించేవారు నాయకులు, మహాత్ములు, యధాయధాహి ధర్మస్య.. అంటూ మనం కీర్తించి అవతార పురుషులు/స్త్రీలు. అలాసమాజాన్ని బాగుచేశాడు కాబట్టే.. న్యూయార్క్ రిపబ్లికన్ పార్టీ మేయర్ అభ్యర్థి నుండి తాజాగా మఛాడా వరకూ అనేకమంది గాంధీని ప్రస్తావించాల్సి వస్తోంది. మనఅవకాశాలు, బాధ్యతలపై కాలయాపన లేకుండా మేలుకొందాం. ★








గీతం యూనివర్శిటీ హైదరాబాద్ క్యాంపస్‌లో పీఎస్‌పీఏ సహకారంతో పాఠశాలల ప్రిన్సిపాల్స్ జాతీయ సదస్సు నిర్వహించారు. ప్రజాస్వామ్య పీఠం(ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్, స్వామి బోధమయానంద, జి.సతీష్‌రెడ్డి, గీతం అడిషనల్ వీసీ ప్రొఫెసర్ డీ.ఎస్.రావ్, ప్రొఫెసర్ సయ్యద్ తదితరులు పాల్గొన్నారు.













RNI. Regd No. 69976/98 Postal Reg. No. HCD-913/2024-2026 Published on 10th November, 2025 Posting Date 15 &16th of every month
Posted at BPC-IV Patrika Channel, Nampally, HYDERABAD-500 001




**2200 లక్షల మందిదరఖాస్తులు - 7.2 లక్షల మందికే ఉద్యోగాలు.. గత 8 ఏళ్ల ప్రభుత్వోద్యోగ భారతంపై యువతకు ప్రజాస్వామ్య పీఠం (ఎఫ్.డి.ఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకులు డాక్టర్ జయప్రకాష్ నారాయణ్ చేస్తున్న హెచ్చరికలు, పరిష్కారాలు (ఇంగ్లిష్)**

Watch @
https://www.youtube.com/
@JPLoksatta Official

*If undelivered please return to:*
*LOKSATTA UDYAMA SAMSTHA,*
*H.NO. 6-3-678,B-106,*
*PASHA COURT 71, Somajiguda,*
*Behind TRIBHUVANDAS*
*JEWELLERS (TBZ),*
*Hyderabad - 500 082*

**Edited, Printed and Published by Dr. Jayaprakash Narayan, National Coordinator, Loksatta for and behalf of Foundation for Democratic Reforms, H.NO. 6-3-678,B-106,PASHA COURT 71, Somajiguda, Behind TRIBHUVANDAS JEWELLERS , Hyderabad- 500 082.**
**Printed at Kala Jyothi Process Pvt Ltd, Plot No : CFC-1 and 2, Survey No: 18, E-City, SEZ, General industrial park, Raviryal & Srinagar village, Maheswaram mandal, Rangareddy district-501359, Telangana.**